
ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రిక

9-4-58
25 నయాపైసలు



ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY



తాత

ఫొటో : పి. వి. నారాయణ్,—రాజమండ్రి.



పుణ్యస్మృతి : దేశోద్ధారకుని 20-వ వర్ధంతి ఏప్రిల్ 1

సంవత్సర చందా
రు. 13-0-0
విడిప్రతిక 25న.పై.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

సంపుటము 52
సంచిక 33
9-4-58

Founder : K. NAGESWARA RAO

విలంబి చైత్ర బహుళ షష్ఠి బుధవారం

★ విషయానుక్రమణిక ★

★

ముఖచిత్రం :

హిందీనటి 'చిత్ర'

★

వచ్చేవారం

సుప్రసిద్ధ సినీతార


శ్రీమతి భానుమతీ రామకృష్ణ

ప్రత్యేక వ్యాసం

★



భద్రాచలాలయంలోని
శ్రీ సీతారామలక్ష్మణులు.



భద్రాచల ఆలయ గోపురాల దృశ్యం.

భద్రాద్రి

భద్రాచల క్షేత్ర చరిత్రకు శ్రీ రామదాసు చరిత్రకు అవినాభావసంబంధ మేర్పడి యున్నది. రామదాసు కీర్తనలతో పరిచయంలేని గ్రామీణులు గాని, రామమందిరము లేని గ్రామముగాని ఆంధ్రావనియందు లేదన్న - అందు ఎంతమాత్రమును అతిశయోక్తి లేదు. భక్తిరసము చిప్పిలు రామదాసు కీర్తనలు పాడుకుంటూ చెక్క భజనలు చేసుకుంటూ, కోలాటాలు వేసుకుంటూ శ్రీ రామనవమికి అనేక భక్త బృందాలు భద్రాద్రికి కాలినడకను 'హరిలో రంగహరి, శ్రీ భద్రాచలవాస గోవిందా హరి' అని పోతూవుంటారు. రాజమహేంద్రవరమునుంచి లాంచీలలోను, పడవలలోను, కొత్తగూడెంవరకూ రైళ్లలోను, అక్కడనుంచి కార్లలోను, ఏలూరు, వరంగల్లు మున్నగు ప్రాంతాలనుంచి కార్లు, బళ్లలోను భక్తులు శ్రీ సీతారాముల దర్శనార్థము తరలిపోతారు. భద్రాద్రివంటి క్షేత్రము, శ్రీరామునివంటి దైవము, గోదావరివంటి పుణ్యనది, రామదాసువంటి నిష్కల్మషభక్తుని చరితము, పర్ణశాలవంటి కమనీయ ప్రకృతి దృశ్యములను, గ్రహించి, దర్శించి, ధన్యులైనవారి భాగ్యమే భాగ్యము గదా!

క్షేత్ర మాహాత్మ్యము


భద్రాచలం పూర్వము దండకారణ్యము అని చెప్పబడే ప్రాంతమున తూర్పుగోదావరీ నదీతీరాన యావద్భారత క్షేత్రముగా అలరారుచున్నది. ఆ ప్రాంతమంతా రామచంద్రుని పాదరజముచేత పునీతమైనది. దండకారణ్యమును పోతన వర్ణించిన విధము కన్న మిన్నగా ఎవ్వరూ చెప్పలేరు. పోతనగారి మాటలలో—

"పుణ్యుడు రామచంద్రుడట పోయి,
ముదంబున గాంచె దండకా
రణ్యము, దాపసోత్తమ
శరణ్యమునుద్దత బర్హిబర్హిలా
వణ్యము, గౌతమీవిమల
వాఃకణ పర్యటన ప్రభూతసా
ద్గుణ్యమునుల్లసత్తరుని
కుంజ వరేణ్యముగ నగ్రగణ్యమున్ ॥

ఆవనంలో శ్రీరాముడు అనుజసమేతుడై సతితోడ ఒక పర్ణశాల నిర్మించుకొని నివసించాడు. పర్ణశాల భద్రాచలానికి ఉత్తరాన 22 మైళ్లలో గోదావరిఒడ్డునే ఉన్నది. గోదావరి అక్కడ నేత్రపర్వంగా రమ్యంగా ఉంటుంది. ఆవలి వైపున రావణుడు రథము నిలబెట్టిన రథపుగుట్ట - రథము పోయిన ఆనవాలు ఇప్పటికీ చూపిస్తూ ఉంటారు. ఈ పర్ణశాలను లక్ష్మణుడు నిర్మించిన స్థలమును పర్ణశాలనుండి సీత బయటకు వచ్చిన గుర్తులను, మాయలేడి గిట్టల చిహ్నాలు, కోదండ రామాలయమూ ఇప్పటికీ చూపిస్తారు. సీత వాగు, పసుపు, కుంకుమరాళ్లు, శ్రీ రాముని విశ్రాంతి వేదిక, సీతమ్మచీర ఎండవేసిన చోటు, శూర్పణఖ లక్ష్మణుని చేరవచ్చిన స్థలము చక్కగా చూడవచ్చు. చుప్పనాతి చెట్టుపై ఇప్పటికీ తలోరాయి విసరి తమ అక్కసు తీర్చుకుంటారు. ఈ పరిసరారణ్యంలో ఒక్క లేడి, జింకా కనిపించక పోవడం మహర్షుల కోపం అంటారు. నెమళ్లుమటుకు కనిపిస్తాయి.

పర్ణశాలకు భద్రాచలంవైపు నాలుమైళ్లలోనే దుమ్ముగూడెం ఉన్నది. శూర్పణఖ ముక్కుకోసిన వార్త విని ఖరదూషణాది పదునాల్గువేల రాక్షసులు దండెత్తి రాగా శ్రీరాముడు వారిని యుద్ధంలో ఓడించి దుమ్ముచేసి పారవేసినందున ఆ స్థలమున కట్టిన ఊరుకు దుమ్ముగూడెం అనే పేరు వచ్చినదట. ఇక్కడికి దగ్గరలోనే సీతకు ఆ యుద్ధాన్ని లక్ష్మణుడు దగ్గర ఉండి చూపించిన గుట్టను లక్ష్మణగుట్ట అని పిలుస్తారు. ఇక్కడికి దక్షిణంలో జటాయువుకు శ్రీరాముడు సంస్కారం చేసిన 'ఎటపాక' గ్రామము, జటాయుగుట ఉన్నది. పర్ణశాల గ్రామము, ఆలయము గోదావరి కోతకు గురి కాకుండా నిరోధించవలసి యున్నది."

మేరువు, మేరుదేవితో కూడి పుత్ర



ఆలయ సమీపంలోని గోదావరి దాటుతున్న యాత్రికులు.

భద్రాద్రి

సంతానంకోసం తపస్సు చేయగా భద్రుడికి పరమేశ్వరుడు ప్రసాదించాడు. శ్రీరామచంద్రుడు దండకలో సంచరించే రోజుల్లో ఒకనాడు వాహ్యాళి బయలుదేరి భద్రుడున్న గౌతమీ తీరానికే వచ్చి, విశ్రాంతికోసం అక్కడ కూర్చున్నాడు. ఆ గిరి సుఖస్పర్శచే శ్రీరాము డానందముపొంది 'భవిష్యసి మహాత్మత్వం, భక్తోసిగిరి రూపభృత్" అని మహాత్మ అచలరూపుడవు గమ్మన్నాడు. నాటినుండి రామభద్రపద చిహ్నితుండగుట చేసి భద్రాచలమను ఖ్యాతి వచ్చినది. భద్రుడు అనేక వేల ఏండ్లు తపము చేయగా శ్రీరాముడు ప్రత్యక్షముకాగా భద్రుడు తనను దర్శించువారలకు భుక్తిముక్తిప్రదుండై తనపై శాశ్వతముగా నెలకొనియుండుమని ప్రార్థించెను. శ్రీరాముడు ప్రీతుడై "వసామి శిఖరే భద్ర! తవ యావస్థిరివ్యతి, భూమి ర్భూతాని కల్పాంతే మత్సాయుజ్య మవాప్స్యసి" అని కల్పాంతమువరకు ఇక్కడ ఉంటాను. తర్వాత నా సాయుజ్యమును పొందగలవన్నాడు. శ్రీరామనవమి నాడు తులసీదళాదులచేత భద్రాద్రి రాముని పూజించి, ఉపవసించి, జాగరణము చేసిన వారు ముక్తిని పొందగలరని భక్తులు శ్రీరామనవమికి భద్రాద్రియాత్ర చేస్తు ఉంటారు.

తపోయోగ సిద్ధులచేత తమ శరీరాలను శిలామయంగా చేసుకొని శీతాతపప్రచుర అసురబాధల కతీతులుగవుండే మహా జీవులే సుప్రసిద్ధులగు కొన్ని పర్వతరాజములందురు. భద్రాచలమున శ్రీరామచంద్రమూర్తి వామాంకమున సీతామహాసాధ్వి ఆసీనురాలై ఉండగా తాను పద్మాసనంలో ఉన్నాడు. ఎడమవైపున లక్ష్మణుడు ధనుర్బాణములతో నిలచి ఉన్నాడు. శ్రీరాముడు నారాయణ స్వరూపుడుగా అక్కడ వెలశాడు. పై రెండు చేతులలో శంఖచక్రములను, మిగతా రెండు చేతుల్లో ధనుర్బాణాలను ధరించాడు. కనుక వైకుంఠ రాముడని, రామ నారాయణుడని ఆయన్ని పిలుస్తు ఉంటారు.

ఈ స్వామిని శ్రీ రామకర్ణామృతమున ఈవిధంగా కీర్తించారు. "వామాంకస్థిత, జానకీ పరిలసత్ కోదండ దండం కరే। చక్రం చోర్ధ్వకరేణ, బాహుయుగళే, శంఖం శరం దక్షిణే। బిభ్రాణం, జలజాతపత్ర నయనం, భద్రాద్రిమూర్ధ్ని స్థితం। కేయూరాది విభూషితం రఘుపతిం సౌమిత్రి యుక్తం భజే"- రోజూ ఈ శ్లోకం ఆలయంలో చదువుతూ ఉంటారు. "ప్రొక్కిన నీకు మొక్కవలె మోక్షమొసంగిన నీవు యీవలెన్, దక్కిన మాటలేమిటికి దాశరథీ కరుణాపయోనిధీ" అని భక్తరామదాసు తన దాశరథీ శతకంలో స్తుతించాడు. శ్రీ త్యాగరాజస్వామి గిరిపై నెలకొన్న, ఎన్నగాను రామభజన, క్షీరసాగరశయనా॥ అను కీర్తనలలో రామదాసు గారిని పేర్కొన్నారు. శ్రీరాముని దర్శించినప్పుడు శ్రీ త్యాగరాజు భద్రాద్రిరాముని మోహన విగ్రహాన్ని చూచి సమ్మోహితుడై మోహనరాగంలో ఈ కృతి చెప్పారు:

మోహనరామ, ముఖజిత సోమ ముద్దుగా
బల్కు మో (॥మో॥)
మోహనరామ మొదటిదైవమా మోహము
నీపై మొనసియున్నదిరా (॥మో॥)
ధరమను జావతార మహిమవిని
సురకిన్నర కింపురుష విద్యాధర
సురపతి విధి విభాకర చంద్రాదులు
కరగుచు ప్రేమతో
వరమృగపక్షి వానర తనువులచే
గిరిని వెలయు సీతావరచిర కొలువు
గుణితవ్రత మైమరచి సేవించిరి
వరత్యాగరాజ వరదాఖిలజగన్॥

"ఇదిగో భద్రాద్రి, గౌతమి
అదిగో చూడండి।
ముదమున సీతా ముదిత లక్ష్మణులు
కదలి కొలువగా రఘుపతి యుండెడి"

అని శ్రీరామదాసు వర్ణించియున్నాడు. "వారు స్వర్ణప్రాకార గోపుర ద్వారములలో సుందరమై యుండెడి"

అనుపమానమై, యతిసుందరమై,
తనరుచక్రము ధగధగ మెరసెడి॥
కలియుగమందున గలవైకుంఠము
నలరుచున్నది నయముగ ప్రొక్కుడి॥
పొన్నలపొగడల పూపొదరిండ్లు
చెన్నుమీరగను శృంగారంబగు॥
శ్రీకరముగ శ్రీరామదాసుని
ప్రాకటముగ బ్రోచె ప్రభు నివాసము."


అయితే మధ్యమధ్యన ఈ క్షేత్రము దండయాత్రికుల గురి అయినది. పై కీర్తనను స్మరించి ప్రస్తుతము జీర్ణావస్థలో ఉన్న ఈ ఆలయాన్ని భక్తులుద్ధరించ పూనుకోవాలి.

మొదట శబరికుల సంజాతయైన పోకల దమ్మక్కకు స్వామి స్వప్నంలో కనిపించి [illegible] ఉన్నాను అని చెప్పాడు. అప్పుడామె గ్రామస్థుల సహాయంతో వెళ్ళి అన్వేషించగా శ్రీ సీతారామచంద్ర లక్ష్మణ శిలా మూర్తులు కనిపించినవి. ఆమె వాటిని తీసుకొని అర్చనాదుల కేర్పాటుచేసినది. శ్రీరామునాజ్ఞ ననుసరించి పాల్వంచ తహసీలారుగా వచ్చిన శ్రీ కంచర్ల గోపన్న (రామదాసు) నకు ఈ పవిత్ర కార్య మప్పజెప్పి కైవల్యము పొందినది. ఆ భక్తురాలి పేరిట ఇప్పటికే శ్రీరామాలయ పూజాదికములలో ఒక భాగము పోకలవారి వంతుతే వ్యవహరింపబడుచు కొందర రర్చకులచే ననుభవింపబడుచున్నది.

భద్రాచల ఆలయ నిర్మాణానికి రామదాసు ప్రభుద్రవ్యాన్ని ఆలయ గోపుర మండపాది నిర్మాణాలకు, స్వామివారి అలంకారాదులకు వెచ్చించాడు. ఆ అపరాధానికి తానీషాచే గోలకొండ కోటలో బందీఖానాలో ఉంచబడాడు. చివరకు శ్రీరాముడు లక్ష్మణ సమేతుడై మారువేషంలో వచ్చి ఆరు లక్షల రొఖాన్ని తానీషాకు చెల్లించి రామదాసుని విడిపించారు. రామదాసు జన్మించిన ఖమ్మంజిల్లా నేలకొండ పల్లెను, బందీఅయిన గోలకొండకోటను భక్తులు ఇప్పటికీ దర్శిస్తూఉంటారు. రామదాసుభద్రాద్రి తిరిగివచ్చినప్పుడు రెండు "మాడలు"బంగారు నాణెములు శ్రీరామలక్ష్మణులను అలంకరించ డానికి భద్రాద్రికి తెచ్చుకున్నాడు. రామూర్చనకు తానీషాయొసగిన పాల్వంచ (హసనాబాద్) పరగణాను పాలింపుచు, రామచంద్ర ప్రభుని కల్యాణభోగఉత్సవాలకు డబ్బు వచ్చిసూ భద్రాచలాన్ని కలియుగ వైకుంఠముగా చేశాడు.

రామదాసు చేయించిన చింతాకుపతకము

(12-వ పేజీ చూడండి)



రాజధానిలో కాంగ్రెసుపార్టీ ఓటమి

కొత్తగా ప్రవేశపెట్టిన ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్‌కు మొదటిసారిగా ఈమధ్య ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ మునిసిపల్ పార్టీ ఎన్నికలలో పూర్తిగా పరాజితమైంది. భారతీయులలో ఇంకా చేవ చావలేదని కూడా ఈ ఎన్నికలు నిరూపించాయి. దీపస్తంభాన్ని నుంచో పెట్టినా కాంగ్రెసు గెలుస్తుందనే భ్రాంతిని కూడా ఈ ఎన్నికలు పటాపంచలు చేశాయి.

ఢిల్లీతో సంబంధంలేని బయటివాళ్ళని ఢిల్లీలో అభ్యర్థులుగా నుంచో పెట్టడంవల్లనే కాంగ్రెసుకు ఈ ఘోరపరాజయం కలిగిందని నిశ్శంకగా చెప్పవచ్చు. ఈ విషయంలో కాంగ్రెసు వైఖరిని గూర్చి ఏమన్నా అనుమానంఉంటే పార్లమెంటులోని ఢిల్లీ ప్రతినిధులను చూస్తే అనుమానం కాస్తా తీరిపోతుంది. ఢిల్లీకి రాజ్యసభలో మూడు, లోక్‌సభలో అయిదు, మొత్తం 8 స్థానాలు ఉన్నాయి. ఇవన్నీ కాంగ్రెసువారి చేతుల్లోనే ఉన్నాయి. వారెవరయా అంటే:- రాజ్యసభలో మంత్రి శ్రీ ఎస్. కె. డే (బెంగాలీ), బీగం సదికాకిద్వాయ్ (ఉత్తర ప్రదేశ్), లాలా ఓంకారనాథ్; లోక్‌సభలో శ్రీమతి సుచేతా కృపలానీ (బెంగాలీ—ఈమె బెంగాలీలోనే ప్రమాణస్వీకారం చేసింది). లాలా రాధారమణ్, చౌధురి బ్రహ్మప్రకాష్, శ్రీ కృష్ణనాయర్ (మలయాళీ), శ్రీ నవల్ ప్రభాకర్.

అంటే 8 మందిఢిల్లీ ప్రతినిధులలోనూ నలుగురు ఢిల్లీవారు కారన్నమాట. లాలా ఓంకారనాథ్ తను పింఛను పుచ్చుకోవలసిన మనిషినని భావిస్తూ ఉంటారు. శ్రీ కృష్ణనాయర్ సాధారణంగా గైరుహాజరవుతూ ఉంటారు. శ్రీ రాధారమణ్‌కు విదేశ వ్యవహారాలేతప్ప దేశ వ్యవహారాలేవీ పట్టవు. ఇక శ్రీమతి సుచేతా కృపలానీ దృష్టి అంతా పాపం నిరాశ్రయులైన శరణార్థుల మీదే ఉంటుంది. అసలీవిడ క్రితంపార్లమెంటులో భర్త నాయకత్వాన పి. ఎస్. పి. సభ్యురాలుగా ఉండేది.

ఢిల్లీకాంగ్రెసు అధ్యక్షురాలు శ్రీమతి సుభద్రా జోషీ. ఇప్పటికీ ఆవిడకి కాంగ్రెసులో మంచిపలుకుబడి ఉంది. ఐతే ఈమె పార్లమెంటులో మాత్రం అంబాలా (పంజాబ్) ప్రతినిధురాలు. ఈవిడ పంజాబీ. కమ్యూనిస్టునాయకుడు శ్రీ జోషీభార్య.

వెనకటికి బ్రిటన్ నూరేళ్ళ యుద్ధంతోను, ఏడేళ్ళయుద్ధంతోను, రోజాల యుద్ధంతోనూ సతమతమవుతూ ఉండేదట. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత ఢిల్లీకాంగ్రెసు కూడా ఎడతెగనియుద్ధంలో మునగాసాం తేలాసాంగా ఉంటోంది. ఈయుద్ధంలో జనరలిజ్మో ఎవరయా అంటే శ్రీమతి సుభద్రాజోషీ.

శ్రీ కృష్ణ

[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

మొదట్లో ఈవిడా, శ్రీ బ్రహ్మప్రకాష్ కలిసి శ్రీ కృష్ణనాయర్‌ను పడగొట్టి తరిమివేశారు. ఇప్పుడు శ్రీమతి జోషీ, శ్రీ రాధారమణ్, శ్రీ కృష్ణనాయర్ కలిసి శ్రీ బ్రహ్మప్రకాష్‌మీద కయ్యం సాగిస్తున్నారు. ఈకలహం ఎంతతీవ్రం అయిందంటే ఢిల్లీకాంగ్రెసును సస్పెండుచేసి శాంతి స్థాపించటానికి గానుఒక తాత్కాలిక సంఘాన్ని నియమించవలసి వచ్చింది. పైకి చూస్తే నిబంధనావళి రీత్యా ఈ తాత్కాలిక సంఘమే కాంగ్రెసు అభ్యర్థులను ఎన్నికలకు సెలెక్టు చేసినట్లు కనబడుతుంది. కాని జరిగిన దేమిటంటే శ్రీమతి జోషీముఠా, శ్రీ బ్రహ్మప్రకాష్ ముఠా తమ తమ అభిమానులను సెలెక్టు చేయించి అభ్యర్థులుగా నుంచో పెట్టాలని కుద్దులాడుకున్నాయి. చాలా చోట్ల, ముఖ్యంగా గ్రామ ప్రాంతాల్లో, ప్రజలు తమకు బలవంతాన ఎవరెవరో అభ్యర్థుల్ని అంటగట్టవద్దని కాంగ్రెసువారిని కోరారు. సమర్థులు, విశ్వసనీయులు అయిన కాంగ్రెసువాదులను అభ్యర్థులుగా నిలబెట్టాలని ప్రజలు ఒత్తిడి చేశారు కూడా. అయినా ఢిల్లీ కాంగ్రెసు పెద్దలు వింటేగా? ఓటర్ల సూచనలను తృణీకరించారు. తృణీకారానికి ప్రతీకారంగా ఓటర్లు తమ సొంత అభ్యర్థులకే బాగా వోట్లు వేసి గెలిపించుకున్నారు.

ఇంతేగాదు, ఇంకా వుంది కథ. కాంగ్రెసు అభ్యర్థులేమి, కాంగ్రెసు వర్కర్లేమి ముందు స్వార్థం, తరవాతనే పరార్థంగాని, పార్టీగాని, అనే వైఖరి అవలంబించారు. ఢిల్లీ కార్పొరేషనుకు ద్విసభ్య నియోజకవర్గాలున్నాయి. అక్కడ కాంగ్రెసు ప్రచారకులు ఎవరికివారే "మా అభ్యర్థికి ఒకఓటు వేసి, ఇంకోఓటు మీ ఇష్టం వచ్చిన వాళ్ళకి వేసుకోండి" అని ఓటర్లలో ప్రచారంచేశారు. రెండుస్థానాలకీ కాంగ్రెసు అభ్యర్థులు పోటీచేస్తున్నా కూడా ఇలా ఒక్కొక్కరు ఒక్కొక్క స్థానానికే ప్రచారం చేయటం కడు శోచనీయమైనది. కాంగ్రెసు ఓటమినిబట్టి తాత్కాలిక సంఘం బొత్తిగా అసమర్థమైనదైనా అయి ఉండాలి; లేకపోతే అభ్యర్థులను సెలెక్టు చేయటంలో తన కర్తవ్యం విస్మరించైనా వుండాలి. ఓటమికి ముఖ్యకారణం, భారత రాజధానిలోని కాంగ్రెసువారు పదవుల కోసం తమలోతాము పదేళ్లుగా సాగించిన అంతఃకలహాలే. శ్రీమతి సుభద్రా జోషీకి అండగా ఒక ముఠా అంటూ ఉన్నంత కాలమూ, ఆమె అత్యున్నత స్థానాల్లో ఉన్న వ్యక్తుల ఇళ్లకువెళ్ళి వారి సహాయాన్ని అడిగి తెచ్చుకోగలిగినంత కాలమూ ఢిల్లీ కాంగ్రెసులో శాంతి ఏర్పడటం జరగదని కొందరు భావిస్తున్నారు. ఆమె పంజాబీ. పంజాబులోని ఒక నియోజకవర్గానికి ఆమె లోక్‌సభలో ప్రతినిధురాలు. పంజాబులో కాంగ్రెసు వ్యవహారాలు బొత్తిగా అస్తవ్యస్తంగా తయారైనాయి. అందుచేత, భారతరాజధానిలో కీచులాటలు రెచ్చగొట్టే

★ న్యూఢిల్లీ లేఖ ★

బడులు, తన రాష్ట్రంలో కాంగ్రెసు వ్యవహారాల్ని చక్కదిద్దుకోరాదా అని శ్రీమతి జోషీని అడగటంలో అసబబులేదు. అయితే కాంగ్రెసుమీద గాంధీజీకున్న ప్రేమలో సగం ప్రేమైనా లేని కాంగ్రెసు నాయకుల నుంచి అంత మంచిపని ఆశించగూడదు. మహాత్మాగాంధీ తన కెంత దగ్గరి స్నేహితుల మీదనైనాసరే, అవసరమని తోస్తే చర్య తీసుకోనటానికి జంకేవారు కాదు. ఆయనకు ఆ పవిత్రము భారతదేశం; దానికి సేవ చేసేందుకే కాంగ్రెసు.

* * *

శ్రీ బల్వంత్ రాయ్ గోపాల్జీ మెహతా, ఆయన అంచనాల సంఘమూ చాలా ఉపయోగకరమైన పనులు చేస్తున్నారు. విద్యను గురించి వరసగా కొన్ని నివేదికలు ప్రచురించాలని ఈ సంఘం ఆలోచిస్తోంది. ప్రాథమిక విద్యను గూర్చిన మొదటి నివేదిక ఈ మధ్య వెలువడింది. ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యకు అయిదేళ్లలో రు. 700 కోట్లు అవుతుందని చాలా జాగ్రత్తగా అంచనాలు వేసి ఈ సంఘం లెక్కలు తయారు చేసింది. .

విద్యాశాఖ డిమాండ్లపై జరిగినచర్చకు సమాధానమిస్తూ డా॥ శ్రీమాలి చాలావిషయాలు ప్రకటించారు. విశ్వవిద్యాలయాలలో మూడేళ్ళడిగ్రీకోర్సువిషయమై దేశ్ ముఖ్ సంఘం సమర్పించిన నివేదిక అమలునుగూర్చి, స్త్రీవిద్యనుగూర్చి పరిశీలించటానికి శ్రీమతి దురాబాయ్ దేశ్ ముఖ్ అధ్యక్షతను ఒకసంఘాన్ని వేయటంగూర్చి ప్రశంసార్హమైన పనిచేసిన ఉపాధ్యాయులకు జాతీయబహుమతు లివ్వటంగూర్చి ఆయన ప్రకటనలుచేశారు.

ఉపాధ్యాయుల జీతాలకు అవుతున్న అధికవ్యయాన్ని భరించలేకపోతున్న రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థికసహాయం చేయటం గూర్చి, అఖిలభారత క్రీడాసంఘాన్ని పునర్వ్యవస్థీకరించడంగూర్చి, రాజకుమారి క్రీడా శిక్షణ స్కీమును ఇతర శిక్షణ స్కీములతో విలీనం చేయటాన్ని గూర్చి ఆయన ప్రభుత్వ నిర్ణయాలు వెల్లడించారు.

విద్య రాష్ట్రప్రభుత్వ బాధ్యత అయినా, విద్యాభివృద్ధిపై కేంద్రప్రభుత్వం ఎంతో ఆసక్తి చూపిస్తోందని చెబుతూ డా॥ శ్రీమాలి ప్రాథమిక, సెకండరీ, విశ్వవిద్యాలయ, వ్యాయామ, స్త్రీవిద్యలనుగూర్చిన అనేక పథకాలనుగూర్చి, ఉపాధ్యాయుల జీతాలను గూర్చి, ఇంకా ఎన్నో వివరించారు.

ప్రాథమిక పాఠశాలోపాధ్యాయుల్నించి విశ్వవిద్యాలయ అధ్యాపకులదాకా అందరికీ ఎక్కువజీతా లివ్వగలిగే నిమిత్తం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రప్రభుత్వాలకు వచ్చే ఏటి నుంచి ధనసహాయం చేస్తుందని మంత్రి చెప్పారు.

దేశ్ ముఖ్ సంఘంసూచించిన మూడేళ్ళ డిగ్రీకోర్సు పథకాన్ని ఆమోదించామని, ఇక విశ్వవిద్యాలయ విద్యను పునర్వ్యవస్థీకరించటానికి పూనుకుంటామనీ డా॥ శ్రీమాలి చెప్పారు. ఈ సంస్కరణను ప్రవేశపెట్టటానికి అయ్యే ఖర్చును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెరిసగమూ పంచుకుంటాయని, అయితే ఒక్కొక్క కాలేజీకి 800 నుంచి 1000 దాకా కంటే ఎక్కువ విద్యార్థులు వుండరాదని కూడా ఆయన అన్నారు. వచ్చే మూడేళ్ళలో 1500 ఇంటర్మీడియెట్ కాలేజీలను డిగ్రీకాలేజీలుగా చేస్తామనీ, 860 డిగ్రీ కాలేజీలను పునర్వ్యవస్థీకరిస్తామని ఆయన తెలిపారు.

సభ హర్షధ్వానాలుచేసి, డిమాండ్లను మంజూరు చేసింది. ఐతే అసలుచిక్కంతా ఎక్కడంటే, విద్య రాష్ట్రప్రభుత్వ బాధ్యత. ఈసంగతి మంత్రే ఒప్పుకున్నారు. అయినా ప్రాథమిక దశనుంచి విశ్వవిద్యాలయ దశదాకా కేంద్రప్రభుత్వం ధనసహాయం చేస్తోంది. రాజ్యాంగం అంటే ఖాతరు లేనప్పుడు అసలు రాజ్యాంగమంటూ ఎందుకో! భారత రాజ్యాంగాన్ని ఇంత "చక్కగా" మన్నిస్తున్నారు కదా, దీనికి సంజాయిషీ చెప్పుకోవలసిన అవసరం ఎంతయినా ఉంది.

అదనపుపన్నులు వేయటానికి, ముఖ్యంగా ప్రత్యక్షపుపన్నులు వేయటానికి రాష్ట్రప్రభుత్వాలు సుముఖంగా లేవని మొదటి పంచవర్ష ప్రణాళిక నిరూపించింది. దీనికి కొన్ని రాజకీయ కారణాలున్నాయి. ప్రత్యక్షపుపన్నులు వేస్తే పలుకుబడి కొసాపోతుందని రాజకీయ నాయకుల భయం. కాని దేశాభివృద్ధి ప్రణాళికలకు డబ్బులేందే కుదరదు గదా. ఎన్నికల్లో గెలవటానికికూడా అదిఅవసరం. అంటే రాష్ట్రాలకి సంబంధించినంతవరకూ, శ్రేయోరాజ్యమూ సాధించాలి, అందుకు ఎవర్నీ బాధపెట్టగూడదు అన్నమాట.

కాని కేంద్రప్రభుత్వపు పన్నులవిధానం చూడండి. ధనికులనుండి ధనం పీల్చివేస్తామని ప్రచారంచేసి ఎన్నికలలో గెలవటానికీ, పన్నులద్వారా వీలైనంత ఎక్కువఆదాయం రాబట్టటానికి అనువైనవిధానం అది.

రాష్ట్రప్రభుత్వాలు చేయవలసిన పనులకు ధనసహాయం చేయటానికి కేంద్రప్రభుత్వానికి ధనంకావాలి. ఈ ధనాన్ని సేకరించటానికి ఉపయోగపడేవి ప్రణాళికాసంఘమూ పంచవర్ష ప్రణాళికలూ. డా॥ జాన్ మతయ్ రాజకీయనాయకుడుకాదు. అందుకనే ఆయనకు ప్రణాళికలంటే వళ్లుమంట.

ఇది సమస్యలో ఒకభాగం మాత్రమే. మరొకభాగం ఏమిటంటే ప్రభుత్వ శాఖల విస్తరణం, కొత్తకొత్త ఉద్యోగాల్ని సృష్టించటం. 1958 జనవరి తరవాత రెండు కొత్త సంఘాలను, అదనంగా నలుగురు డిప్యూటీ మంత్రులను ఏర్పాటు చేశారు. 1939 లో విద్య, ఆరోగ్య, భూములశాఖ అని ఒకటే శాఖ ఉండేది! బ్రిటిష్ కామన్వెల్తులోని భారతీయుల యోగక్షేమాలను కూడా ఈ

(55- వ పేజీ చూడండి)

వెళ్ళిపోయే వ్యక్తులు

[స్థలం. కాఫీహౌస్. ఒక బల్లదగ్గర యిరుపుగా కుర్చీలు వేసుకుని ఆరుగురు మనుషులు కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ వుంటారు.]

సుబ్బారావు: ఆవెడుతున్నాడే ఎవడు వాడు?

రామారావు: వాడా? వాడిపేరు కోటిలింగం.

ముకుందరావు: వాడి పెళ్ళామే కదూ...

సుబ్రహ్మణ్యం: ఎందుకూ మొహమాటం. వాడి పెండ్లామే లేచిపోయింది.

శేఖరం: ఎక్కడికి?

రాములింగం: స్వర్గానికి.

సుబ్బా: అంటే?

రామ: సుఖం ఎక్కడ వుంటే అదే స్వర్గమన్నారు.

రామా: రండి రండి పంతులుగారూ!

పంతు: ఇక్కడ చోటువుందా? ఇప్పటికే చాలామంది యిరుక్కున్నట్టున్నారే.

రామా: అట్టే లేములెండి. అరుగురం... ఆ కుర్చీ యిలా లాక్కుని కూర్చోండి. వీరు రామన్న పంతులుగారు. వీళ్ళంతా నా మిత్రులు.

పంతు: చాలా సంతోషం నాయనా! మిమ్మల్ని కలుసుకున్నందుకు.

సుబ్బా: బాయ్. మరో కాఫీ తీసుకురా.

పంతు: హాట్ కాఫీ అయితే డోసు చాలుతుంది... మీరంతా మళ్ళీ ఓ మారు పుచ్చుకోరూ.

శేఖ: ఇప్పటికి రెండుమార్లు అయింది.

పంతు: వేడు కాఫీ లాచ్చి ప్రాణాలు తీస్తున్నాయి.

సుబ్బా: మరి తమరు...?

పంతు: ఏం చేస్తాం? కాలానికి ఎదురీదుతామా?

ముకుం: బాగా సెలవిచ్చారు.

పంతు: కొంచెం పంచదార ప్రట్టా... మా అమ్మాయి పెళ్ళి పెద్ద సమస్య అయిందోయి.

రామా: ఇంకా కుదర లేదూ?

పంతు: కట్నాల దగర పేచీ లొస్తున్నాయి.

రామ: బిల్లు ప్యాసు అయిందిగా.

పంతు: అసెంబ్లీలో.

సుబ్బా: పంతులుగారు చమత్కారంగా మాట్లాడతారు.

పంతు: ఏమ్రా, మీలో ఎవరెవరికి పెళ్ళిళ్ళయినాయి?

ముకుం: నాకు యిద్దరు పిల్లలు.

రామ: నా పెళ్ళి సెటిల్ అయింది.

రామా: నా విషయం తమకు తెలియనే తెలుసును.

శేఖ: మా కులం వేరు.

సుబ్బా: నేను పెళ్ళి చేసుకోదల్చ లేదు.

రామా: ఇంక సుబ్రహ్మణ్యంవున్నాడు.

రామ: అవును. సుబ్రహ్మణ్యం వున్నాడు.

సుబ్ర: నేను... నేను...

పంతు: చెప్పు నాయనా? సంకోచం దేనికి?

సుబ్బా: సుబ్రహ్మణ్యానికి మంచి ఆశయాలున్నాయి.

సుబ్ర: వీళ్ళు... వీళ్ళు.

రామ: సుబ్రహ్మణ్యానిది చాలా విశాల హృదయం.

పంతు: చెప్పు నాయనా.

సుబ్ర: మీరు... మీరు.

రామా: అవునండోయి. ఇన్నాళ్ళూ అటలేదు. ఇంకేం? సుబ్రహ్మణ్యం వున్నాడుగా.

అందరూ: అవును. వున్నాడుగా.

పంతు: రేపు మంచిరోజు.

సుబ్బా: పెళ్ళి చూపులు.

ముకుం: అలా వెర్రిచూపులు చూస్తావేం?

పంతు: చెప్పు నాయనా? మీ కులమేమిటి? గోత్రమేమిటి? మీ తండ్రిగారి పేరేమిటి?

రామా: (చెప్పాడు)

పంతు: క్షేమ. ఇంకేం లక్షణంగావుంది.

సుబ్బా: అందులో ఆశయపరుడు.

పంతు: మరి నాకు అర్జంటుపని వుంది గాని, రామారావు రేపు తప్పకుండా... సాయంత్రం ఒకసారి కనబడు. వస్తానురా.

సుబ్బా: పోయాడు.

రామ: బిలు యివ్వటం మరిచిపోయి నట్టుగా వెళ్ళిపోయాడు.

సుబ్ర: మీరింతనాటక మాడతారా? మీకు బుద్ధిలేదూ?

శేఖ: ఊరికనే, తమాషాకి, ఏడిపించాలని.

సుబ్ర: ఎవరిని?

శేఖ: వాడిని.

సుబ్బా: పాగు కాఫీలాచ్చి పాడుచేశాయట. వీడు చేసిందేమిటి.

శేఖ: కనబడిన ప్రతివాడికీ పిల్లను అంటగడదామను కుంటున్నాడు.

రామ: అంత వేవర్సుగా ఎవరున్నారిక్కడ?

సుబ్బా: ఓహో. అమోఘమైన మాట నేశావు.

శేఖ: హలో ప్రతాప్... మీరు మాట్లా




INFANTONE

★ వెళ్ళిపోయే వ్యక్తులు ★

చూస్తూండండి. ఇప్పుడే వస్తా.

సుబ్బా: మరొకడిని పట్టాడు.

రామా: ఇందాక మన దగ్గరకు వచ్చి వట్లు.

రాము: ఇంక మనదగరకు రాడు.

సు|బ: కొత్తగావచ్చిన వాళ్ళ దగ్గరకు 'హలో' అంటూ పనివున్నట్లు పోతాడు.

రాము: చేవర్సుగా ఎన్నిసార్లు తాగుతాడో కాఫీ.

సుబ్బా: ఓహో అమోఘమైన మాట చేశావు.

రామా: మీకు తెలుసా? మన ముకుందం నాటకశాఖలో రీసెర్చి చేస్తున్నాడు.

సుబ్బా: ఏమిటి?

సు|బ: ఏమి టేమిటి?

ముకుం: ఏదో కొంచెం.

సుబ్బా: రీసెర్చి అంటే?

ముకుం: అంటే మనకు నాటకాల థియేటరు ఎక్కువ కావాలంటే ఏమిచేయాలీ, పౌరాణిక నాటకాలనీ, చరిత్రాత్మక నాటకాలను ఎలా సంస్కరించాలీ, ఒక పద్యాన్ని ఎన్ని రకాలుగా పాడాలీ.

రామా: ఏదీ? ఆ పలనాటి కోడిపుంజు అన్న పద్యం మెల్లగా పాడు.

ముకుం: పా...లా...నా...టి...కో...డి...పుం...జు.

సుబ్బా: ఓహో వహ్వా.

ముకుం: ఇలాకూడా పాడవచ్చండీ.

సు|బ: అద్భుతం...అమోఘం.

ముకుం: మరి నేను వస్తానండీ. ఉద్యోగం వస్తుందో లేదో భగవంతుడి దయ.

సుబ్బా: పలనాటి కోడిపుంజుదయ.

రామా: చవటాయి. పదిరూపాయలు సంపాదించటం చేతకాదు. రీసెర్చి చేస్తున్నాడుట రీసెర్చి.

రాము: నాటకాలలో!

రామా: వీడు చూడని నాటకంలేదు.

రాము: చేవర్సుగా.

సుబ్బా: ఓహో వహ్వా.

సు|బ: ఎవరా అమ్మాయి?

రాము: అవును. ఎవరా అమ్మాయి?

రామా: అవునవును. ఎవరా అమ్మాయి?

సుబ్బా: మెడికల్ కాలేజి స్టూడెంటు.

రామా: కాఫీ తాగకుండా ఎవరికోసం చూస్తోంది?

సుబ్బా: పుంజుకోసం.

రాము: పలనాటి కోడిపుంజు.

రామా: పాడు చదువు లొచ్చి పాడు చేస్తున్నాయి.

సుబ్బా: ఆడవాళ్ళని.

రామా: మా యింటిదగర ఒక అమ్మాయుంది.

సుబ్బా: చెప్పొద్దు.

సు|బ: అసలు ఆడవాళ్ళకు చదువెందుకంట?

రామా: ఇదిగో. యిందుకే.

రాము: మగవాళ్ళంతా సిగ్గుతోక అభ్యాసిస్తాంటే.

సు|బ: ఈసారి పేవార్సు మాట ఉపయోగించటానికి వీలు కుదరలేదా?

సుబ్బా: ఓహో. వహ్వా?

రామా: టైమెంతయింది?

రాము: తొమ్మిది.

రామా: అరరె. మా సిస్టర్కి ఫిజిక్సు పుస్తకం తీసుకు వస్తానని చెప్పాను. వెళ్లాలి. తరువాత కలుస్తా. వస్తా.

సుబ్బా: వెళ్ళిరా.

రామా: ఇడియట్. చదువులొచ్చి పిల్లల్ని పాడుచేస్తున్నాయట. వీడి సిసర్ సంగతి. వీళ్ళింటి దగ్గర ఒక అమ్మాయుందని చెప్తున్నాడు. వీడి యింట్లో అమ్మాయో?

రాము: హహహహహ

సు|బ: అదిగో పుంజు వచ్చాడు.

రాము: మీలో ఎవరైనా ఒక అయిదు రూపాయలుంటే ఇస్తారూ?

సుబ్బా: అరరర.

సు|బ: సారీ. సారీ.

సుబ్బా: ప్రొద్దున్న పది రూపాయలుంటే ప్రభాకరం పట్టుకెళ్ళాడు.

సు|బ: నేనే ఒక అయిదు రూపాయలు అడుగుదామనుకుంటున్నా.

రాము: పర్వాలేదు. ఏంచేస్తాం? వస్తారా? కాసేపు కూర్చుంటారా?

సుబ్బా: ఒక పదినిముషాలు కూర్చుని వస్తాం.

సు|బ: వస్తాం అను.

రాము: సరే. సాయంత్రం పబ్లిక్ గార్డెన్స్కు వస్తారుగా.

ఇద్దరూ: ఓ-కే.

రాము: అబ్బా-వస్తా.

సుబ్బా: ఎందరి దగ్గర యిలా తేరగా డబ్బులు లాగుదామని చూస్తాంటాడో.

సు|బ: వాడే ఒక పేవార్సు. అంటాన్ని అంటాడు.

సుబ్బా: ఓహో-వహ్వా.

సు|బ: నీ సలహా కావాలోయ్.

సుబ్బా: అదేమిటి? ఒక్కసారి ఆముదం త్రాగిన మొహం పెశావు.

సు|బ: ప్రేమించానోయ్.

సుబ్బా: ఎవరిని?

సు|బ: ఒక పిల్లను.

సుబ్బా: యింకా నయం. కోతి పిల్లనన్నావు కాదు.

సు|బ: ఏం చేయమంటావు?

సుబ్బా: పెళ్ళాడు.

సు|బ: బాబోయి. పెళ్ళి.

సుబ్బా: అవును. పెళ్ళి.

సు|బ: నాకు ప్రేమించటం వచ్చుగానీ పెళ్ళాడటం రాదే.

సుబ్బా: నాకు తోచింది చెప్పా.

సు|బ: సరే. ఆలోచిస్తా.

సుబ్బా: ఇంక వెడదామా?

సు|బ: ఇంక వెడదాము.

సుబ్బా: సరే. వస్తా.

సు|బ: వస్తా మరి.

సుబ్బా: (పోతూ) ప్రేమింతాడుట ప్రేమించాడు. నిక్షేపంలా కట్నం పుచ్చుకుని పెళ్ళిచేసుకోకుండా ప్రేమట ప్రేమట. హుస్సేన్‌సాగర్ లో దూకమను.

సు|బ: (పోతూ) కోస్తాడు. వీడా ఇమ్మనేది? ప్రొద్దున్న ప్రభాకరంగాడికి పది ఇచ్చాడుట. గ్యాసుగాడు.

కాఫీ హౌస్‌లోని మనుషులు: ఎవరో వీళ్ళు. వట్టి జిడ్డుగాళ్ళలా వున్నారు. ★

ఆధునిక శస్త్రచికిత్స

(గతసంచిక తరువాయి)

ఒక రోగి శస్త్ర చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చాడంటే ఆ రోగి వ్యాధిని గురించి నేటి శస్త్ర వైద్యులు, పాతకాలపు శస్త్రవైద్యులకంటే శీఘ్రగతిని బాగా గ్రహించగలరు. రోగ నిర్ణయానికి సంబంధించిన ఎక్స్‌రేలాంటి, సాధనసంపత్తి 1930 నాటికే ఉన్నది. అయితే నాటినుంచి నేటివరకు ఆ పరికరాలను వినియోగించే పద్ధతుల్లో బహుళమైన మార్పులు వచ్చినవి. గుండెలోని అరలదగ్గరనుంచి, మస్తిష్కంలోని ఉపభాగాలు మొదలు-కాలివేళ్ళలోని రక్తనాళాలవరకూ, శరీరంలోని ఏ భాగంలోనైనా పరిశీలనలు జరపవచ్చు. శస్త్ర చికిత్సకు ముందుగానే లోపం ఏదో ఖచ్చితంగా నిర్ణయించవచ్చు. ఆ విధంగా రోగి ఆపరేషన్ టేబుల్ పైకిరాగానే చికిత్సవలన ఫలితం ఏమో తానేమి గ్రహిస్తాడో, డాక్టరు ముందుగానే తెలుసుకోగలడు.

చాలామంది రోగులు, ముఖ్యంగా ఉదర రోగానికి సంబంధించిన శస్త్రచికిత్స అవసరమైనవాళ్ళు వాళ్ళవ్యాధిలతు కాలనుబట్టి అతి బలహీనంగా ఉంటారు. ఆహారలోపంవలన బలహీనపడిన రోగులకు శస్త్రచికిత్స చేయుటం కష్టంతో గూడుకొన్న విషయమని అనుభవరీత్యా గ్రాహ్యమౌతున్నది. అంచేత ఆహారశాస్త్రంలో ప్రత్యేక ఆహారం దగ్గరనుంచి నరాలలోకి ఎక్కించే ఆహారంవరకూ-అన్ని విధాల ఆహారంతో రోగికి ఆపరేషన్‌కు ముందుగా బాగా పుష్టి చేకూర్చాలి. ఇలాంటి పద్ధతివలన, ఆపరేషన్‌కు అర్హులు కారనుకున్న వేలాది రోగులు ప్రాణాలు రక్షించబడ్డాయి.

25 ఏండ్లక్రితం — ఒకరోగి ఆపరేషన్ గదిలోనికి వచ్చాడంటే అతడికి ఘాటుగా మత్తుమందు ఇచ్చేవారు. అనేక ఆపరేషన్లలో రోగికి స్పర్శజ్ఞానం లేకుండా చేయాలంటే అప్పట్లో యీ మత్తుమందు ఇవ్వటం మినహా వేరేమార్గం లేకపోయింది. ఈనాడు రోగికి నొప్పి లేకుండా చేయటానికి యీ మత్తుమందు కనిష్ఠావసరం మాత్రమే. హ్యా

రేక్ వంటి మందులే స్పర్శజ్ఞానం తొలగిస్తున్నవి. ఈనాడు అనెస్తీషియాకు బదులు ఎన్నో మత్తుమందులు వాడకంలో వున్నవి. అనెస్తీషియాకు సంబంధించిన ఎలాంటి మందైనా ఆపరేషన్ అవసరమైన వ్యాధిగ్రస్తునకుగానీ, శుతగాత్రునకుగానీ ఉపద్రవకరమైన పదార్థాలు. అందుచేత యీ మతుమందును అరుదుగా వాడుతున్నారు. అదీ ప్రత్యేక జాగ్రత్తలతో, ప్రత్యేకమైన పరికరాలతో, ఒకవేళ ఎదైనా ఉపద్రవం సంభవిస్తే దాని ఉపశమనానికి ప్రత్యామ్నాయమైన ఔషధాలను, రోగికి కావలసిన ప్రాణవాయువు మొదలయినవాటిని జాగ్రతలో ఉంచుకొని వాడుతున్నారు.

[లీనార్డ్ ఎంజెల్]

రెండవది : ఈనాడు అభివృద్ధి అవుతున్న పద్ధతులు, ఔషధాలదృష్ట్యా అనెస్తీషియాను కూడా ప్రతిరోగికీ, ప్రతి ఆపరేషన్‌కూ వినియోగించేవిధంగా తయారుచేసికోవచ్చు. ఆవిధంగా అతిమాత్రవ్యాధికి ప్రత్యేక పద్ధతులు వున్నవి. (ఈథరు సహించలేనివారికి) గుండె ఆపరేషన్‌వంటి క్రొత్తవాటికి అది ఉపయోగిస్తారు.

ఈనాడు ఆపరేషన్ గదుల్లో (డాక్టర్ హాల్‌సైడ్ ఆపరేషన్ గదిలోవలెనే) రక్తం ఎక్కువగా నష్టంకాకుండా రక్తనాళాలు నొప్పికలిగించేటంతగా ముడుచుకు పోతవి. అయితే నేటి శస్త్రవైద్యుడు, ఆయన సహాయకులు నష్టమైపోతున్న రక్తాన్ని ఒక సక్షన్ నాళం సహాయంతో కొలతగ్లాసులో నింపుతున్నారు. తిరిగి ట్రాన్స్‌ఫ్యూజన్ ద్వారా పోయినరక్తాన్ని నింపుతున్నారు. గాయంలో శ్వేదంద్వారా పోయినటువంటి ఆవిరైపోయినటువంటి ద్రవాన్ని కూడా తిరిగి సమకూర్చుతున్నారు.


వ్యాధి, శస్త్రచికిత్స, అనెస్తేషియావలన రక్తంలో కలిగిన రసాయనిక మార్పులను, మరింత కేవిధంగా ఏర్పడిన మార్పులను కనిపెట్టటం సాధ్యం అవుతున్నది. ఒకప్పుడు ఆపరేషన్ అనేది భయంకరంగా తోచేది ఇప్పుడది మామూలైపోయింది. తీవ్రవ్యాధిగ్రస్తులై ఆపరేషన్ అంటే హడలె పోయే రోగులకు కూడా ఇప్పుడు నిత్యమూ శస్త్రచికిత్స చేస్తున్నారు.

ఏకధ్ఛందీగా ఉంతే ఆపరేషన్ గదుల్లో అంటురోగాలు సంభవించకుండా నిరాకరించటానికి సంప్రదాయసిద్ధమైన పద్ధతి ఒకటున్నది. రోగిగాయాన్ని తాకే ప్రతివస్తువునూ వేడినీళ్ళలో వేసి శుభ్రపరచడమే ఆ పద్ధతి.

క్రిమిసంహారక ఔషధాలు శక్తివంతమైన రక్షణ. ఓషధులు ఈ ఔషధాలు శస్త్రచికిత్సలో బాగా ఉపయోగపడుతున్నవి. మాస్టాయ్ డెక్టిమీ (ఒకప్పుడు ప్రతి శీతాకాలంలోనూ పిల్లల ఆపరేషన్ వార్డుల్లో నిలబడిఉండే) వంటి ఆపరేషన్లు ఇప్పుడు అరుదుగా జరుగుతున్నవి. పెనిసిలిన్, దాని ఉప ఉత్పత్తులువచ్చి మాస్టాయ్ డిటిస్‌గా పరిణామం చెందే చెవి అంటు వ్యాధుల్ని నిరోధించినవి.

ఎముకలకు సంభవించే అంటువ్యాధులు లాంటి వాటి ఆపరేషన్లను ఆంటీబయోటిక్స్ అత్యంత సులభతరం చేసినవి. అంతేకాకుండా అంతకుముందు అసంభవమైన ఆపరేషన్లనుకూడా సంభవనుయేటట్లు చేసినవి. ఇందుకు ఉదాహరణ క్షయవ్యాధిసోకిన ధాతువులను ఊపిరితిత్తి నుంచి తీసివేయటం. ఈవిధానంవలన వేలాది క్షయరోగుల వ్యాధి నయమై, శీఘ్రగతిని కోలుకొని ఆరోగ్యవంతులౌతున్నారు. అలాంటి ఆపరేషన్లను క్షయక్రిములు శరీరంలో ఇతరభాగాలకు సోకకుండా నిరోధించేనిమిత్తం స్ట్రెప్టోమైసిన్, ఐసోనియాజిడ్ వాడకుండా ప్రయత్నించటం ప్రమాదహేతువౌతుంది. అంతే కాకుండా ఆపరేషన్ పరికరాలను ఎంత జాగ్రత్తగా శుభ్రపరిచినప్పటికీ కొన్ని ఆపరేషన్లలో అంటురోగాలు సంభవిస్తూనే ఉంటవి. ఇలాంటి వాటికి శస్త్రచికిత్సవిధానంలో అంటురోగాలను నిరోధించటానికి ఆంటీబయోటిక్స్ అమూల్య సాధనంగా ఉపయోగపడుతున్నది.

శాస్త్ర చికిత్సావిధానంలో పురోగమన మంతా-ప్రపంచం యావత్తూ అన్నిటి విజయంగా గుర్తించిన గుండె ఆపరేషన్‌లోని



శస్త్రచికిత్స జరుగుతున్నప్పటి దృశ్యం

భాగాలే. ఇతర ముఖ్యమైన కొత్తరకం ఆపరేషన్ల విజయానికి కారణం-మానవయంత్రం పనిచేస్తున్న విధానం క్షుణ్ణంగా అవగాహన చేసుకోగలిగిన శక్తి పెంపొందటమే.

గుండెలోపలి భాగాలను మరమ్మతు చేయటానికి మిన్నెసోటా విశ్వవిద్యాలయం తాలూకు డాక్టర్లు సి. వాల్టన్‌లిలీహై రిచర్డ్ ఎల్. వార్కో, మేయోవైద్యశాల తాలూకు డాక్టర్ జాన్ డబ్ల్యు కిర్క్లిన్ ప్రభృతులు 10 లేక 15 నిమిషాలు మొదలు ఒకగంట, అంతకుపైగా కాలం గుండెను విడదీసి ఉంచారు. ఇది ఎలా సాధ్యమైందంటే—గుండెను విడదీసిన సమయంలో - ఒక గుండె - ఊపిరితిత్తి యంత్రం (హార్ట్ - లంగ్ మెషీన్) రోగికి ప్రాణవాయువు సరఫరా చేస్తూ, రక్తాన్ని పంపుచేస్తూ ఉంటుంది. మిన్నెసోటా శస్త్రవైద్యులకు మిన్నెసోటాలోనే రూపొందించిన ఒక "హార్ట్ - లంగ్" యంత్రం ఉన్నది. డాకర్ కిర్క్లిన్, ఫిలడల్ఫియాలోని జఫర్‌సన్ మెడికల్ కాలేజి తాలూకు డాక్టర్ జె. హెచ్. గిబ్బన్ తయారుచేసిన యంత్రాన్ని ఉపయోగిస్తున్నాడు.

ఈ "హార్ట్-లంగ్"యంత్రాలను ఫీజియాలజీ లేబొరెటరీ తయారు చేస్తున్నది. ఇది వైద్యచరిత్రలో - శరీర శాస్త్రం, ఓషధీ శాస్త్రం, శస్త్రచికిత్సలకు గల అవినాభావ సంబంధానికి గల మహత్తర దృష్టాంతాలలో ఒకటి. అవి విజయవంతంగా రూపొందించబడటానికి కారణం డాకర్ లిలీహై, ఆయన సహచరులు, డాక్టర్ గిబ్బన్ ప్రభృతులకు గుండెను గురించి, అందులో రక్తప్రసార విధానాన్ని గురించి సమగ్రమైన జ్ఞానదృష్టి, ఉండటం అంటే హార్ట్-లంగ్ యంత్రం ఎట్లా పని చెయ్యాలి అనే విషయం విస్పష్టంగా గ్రహించటం అన్నమాట.

శస్త్రచికిత్స అయిన అనంతరం తీసుకొనవలసిన జాగ్రత్తల విషయంలో శస్త్రవైద్యం గమనార్హమైన విజయాలను సాధించింది. అలాంటివి ఎన్నో ఉన్నవి. అన్నిటికంటే ముఖ్యమైంది రికవరీ రూమ్‌లో అభివృద్ధి. ఇది ఆపరేషన్ గదుల ప్రక్కన వుండే చిన్నవార్డు. ఈ గదిలో అనెస్థీసియాలజిస్టు, సర్జన్ ఆదేశాల ప్రకారం, ఆపరేషన్ అయిన తర్వాత రోగికి తొలి క్లిష్టమైన ఘడియల్లో సంభవించే అత్యవసర పరిస్థితుల్ని తట్టుకొనేందుకు క్షణాల మీద జరగవలసిన వ్యవహారాలకు సంబంధించిన అన్ని బందోబస్తులూ అందులో ఉంటవి.

అమెరికాలో దాదాపు అన్ని పెద్దఆస్పత్రులలోనూ, అనేక చిన్న ఆస్పత్రులలోనూ, ఆపరేషన్ జరిగిన రోగులందరూ (కదిలే అపాయం సంభవించేవాళ్లు మినహా) రికవరీ రూములో 24 గంటలు, లేదా అపైన కొంచెంసేపు గడుపుతూఉండటం పరిపాటి. మొట్టమొదట్లో 1940 ఆరంభంలో ఆస్పత్రులలో అలాంటి రూములు కట్టటానికి అవసరమైన స్థలం, డబ్బుకు ఎన్నో ఇబ్బందులు పడటం జరిగింది. ఎన్నో జీవితాలు రక్షింపబడటంవలన వాటివల్ల ఎంతో ప్రయోజనమున్నదని రుజువయింది.

ఇటీవల శస్త్రచికిత్స క్రమక్రమంగా సాముదాయిక కార్యక్రమంగా పరిమార్పు చెందుతున్నదనేది స్పష్టం. ఒక పెద్ద ఆపరేషన్‌లో డజను, డజనున్నర మంది శస్త్రవైద్యులు నిమగ్నులు కావటం జరుగుతున్నది. ఆపరేషన్ ముందుగానీ, ఆపరేషన్ అనంతరంగానీ రోగి విషయంలో జాగ్రత్త తీసుకోవటానికి మరి ఇరవైమందివరకూ పని చేస్తున్నారు.

★



భద్రాద్రి

(4-వ పేజీ తరువాయి)

పచ్చలపతకము, కలికితురాలయి, బిళ్ళల మొలత్రాడు, గజ్జెలందెలు, రవ్వలకుండలాలు గల నీలాల చెవిపోగులు, నీలాల ముత్యాల చెవిపోగులు, చిన్న కిరీటములు, గొలుసు, మంగళసూత్రములు, కొప్పుజడ, గోలకొండనుంచి తెచ్చిన రెండు బంగారు మాడలు, ఇతర భక్తులు చేయించినవగలు ఆలయంలో ఈ నాటికి భక్తులు తనివితీర చూడవచ్చు.

రామదాసు రచించిన కీర్తనల్లో "ఏడనున్నాడో, కోదండరామ, కోదండరామ" "నన్ను బ్రోవుమని చెప్పవే సీతమ్మతల్లీ", "ఏ తీరుగ నను దయజూచెదవో-ఇనవంశోత్తమ రామా", "ఏమిరా రామ", "ఎటుబోతివో రామా", "రామ నీ దయ రాదుగా", "పాహిమాం శ్రీరామయంటే పలకవైతివి", "పలుకే బంగారమాయెనా", "ఇక్ష్వాకుల తిలక ఇకనైన పలుకవా", "రామచంద్రులు నాతో చలముచేసినారు సీతమ్మ చెప్పవమ్మ" మున్నగు రామదాసు కీర్తనలు ఎంతో ప్రశస్తి గాంచినవి.

రామదాసుగారి అనంతరం వరద రామదాసు, తూము లక్ష్మీనరసింహదాసుగారలు ఆలయాభివృద్ధికి ఎంతో కృషిచేశారు. వారి అనంతరం శ్రీ చందూలాల్ హసనాబాద్ పరగణానుంచి వచ్చే ఆదాయానికి మారుగా భద్రాద్రి రామాలయానికి రు. 13400/- ఇతర ఆలయాలకు 5100/- అని స్వామివారి పేర సనదు వ్రాయించి ఇచ్చారు. ఇప్పటికీ అదే మొత్తాన్ని 12 భాగాలుగాచేసి ప్రభుత్వం వారిస్తూ ఉంటారు. ఈ మధ్యకాలంలో వరవరహా నరసింగరావు, వెలిదండ్ల రంగారావు, దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు, శ్రీనివాసరావు ప్రభృతులు ఆలయంలో వివిధ సౌకర్యాలకు యథాశక్తి కృషి చేసిన భక్తులలో ప్రముఖులు.

భద్రాచలం దగ్గర గోదావరిపై వంతెన నిర్మాణం త్వరగా జరిగితే భద్రాచల క్షేత్రానికి యాత్రికులు అధికంగా వెళ్ళడానికి సౌకర్యం ఏర్పడుతుంది. మరి ఎందుకోగాని ఏ మంత్రి దృష్టి భద్రాచల ఆలయం జీర్ణస్థితిలో ఉంటున్నా ఉద్ధరించాలనే చూపు పడలేదు. గర్భాలయం గూడా కురుస్తుందని చెబుతారు. మరి ఈ జీర్ణాలయ ఉద్ధరణకు గూడా శ్రీరామనవమికి చేరు భక్తులు కంకణం కట్టుకుంటారా? ప్రభువులకు ప్రజలకు అట్టి శక్తిని పరమేశ్వరుడు ప్రసాదించుగాక!

"శ్రీరామచంద్ర శ్శ్రితపారిజాతః
సమస్త కళ్యాణగుణాభిరామః,
సీతా ముఖాంభోరుహ చంచరీకః
నిరంతరం మంగళ మాతనోతు."

—పి. వి. ఆర్. శర్మ.



[కేవలం వినోదంకోసం, కాలక్షేపం కోసం వ్రాయబడిన యీ కథలోనిపాత్రలు, సన్నివేశాలు అన్నీ ఊహాకల్పితాలు. ఎవ్వరికీ ఏవిధంగాను సంబంధించినవి కావు-రచయిత]

హోండిపార్టుమెంటు సెక్రటేరియేట్ లో గుణశేఖర్ ఒక జూనియర్ గుమాస్తా. ఒక రోజున తన, ఆఫీసు కాగితాలు చూసుకొంటూ, ఒక 'రిఫరెన్సు ఫైలు' కావలసి వచ్చి 'రికార్డు రూమ్' లోకి వెళ్లాడు. రికార్డుబీరువాలోనుంచి తనకు కావలసిన ఫైలు తీసుకొంటూ వుండగా, దానికిందనే వున్న మరొక ఫైలును చెదపురుగులు తినటం చూసి బేజారెత్తిపోయాడు. ఈ విషయాన్ని వెంటనే తన హెడ్‌గుమస్తాతో చెప్పాడు. హెడ్‌గుమాస్తా చెదతినేసిన ఫైలును అటూ యిటూ తిప్పి చూసి ఆవిషయం రిపోర్టు రాసి పంపమన్నాడు గుణశేఖర్ ని. గుణశేఖర్ యిల్లా రాశాడు:

"ఇవాళ రికార్డురూమ్‌లో నా సెక్షన్‌కు సంబంధించిన కాగితాలు కొన్ని చూసుకొంటూవుండగా ఒక ఫైలుకు చెదపట్టటం చూశాను. ఈఫైలు నా సెక్షన్‌కు రిఫరెన్సు కోసం యిదివరలోనే నాదగ్గరికి వచ్చింది. రికార్డులను జాగ్రత్త చేయటానికి రికార్డు గుమాస్తా వేరేవున్నాడు.

గుణశేఖర్.
8-8-52
క్లార్క్."

రికార్డు గుమాస్తాను కూడా సంజాయిషీ యివ్వమనటంవల్ల యిల్లా రాశాడు అతను-

"నేను రికార్డు రూమ్ పర్యవేక్షణలో నే వున్నాను. కాని, చెదపురుగులు ఆ బీరువాలో ప్రవేశించటం సంగతి నాకు యింతవరకూ తెలియనే లేదు. రికార్డు బీరువాలన్నీ ఎప్పుడూ శుభ్రంగానే వుంచటంవల్ల, తలుపులన్నీ గట్టిగా తాళాలు వేయటంవల్ల. యీ చెదపురుగులు బీరువాలోకి ఎల్లా ప్రవేశించాయో నేనేమి చెప్పలేను.

చంద్రమౌళి
9-8-52
రికార్డు కీపర్."

హెడ్ గుమాస్తా యీ యిద్దరి గుమాస్తాల సంజాయిషీలను కలిపి, ఆఫీసు సూపరింటెండెంటుగారికి పంపి తన విధిని నిర్వర్తించారు.

"ఎకౌంట్ సెక్షన్‌లో కొన్ని కాగితాలు చెదపురుగులు తినేశాయి. గుమాస్తాల సంజాయిషీలు తీసుకొన్నాను. తరువాత తీసుకోవలసిన చర్య వివరించవలసినది:

ప్రసాద్
13.8.52
హెడ్ క్లార్క్."

ఆఫీసు సూపరింటెండెంటుగారు ఈ కాగితాలు చూసి యీ విషయం డిప్యూటీ సెక్రటరీగారికి తెలియటం చాలా అవసరమనుకొన్నారు. ఇల్లా రాసి ఆయన బాధ్యత నెరవేర్చారు.

"ఎకౌంట్ సెక్షన్‌లో కొన్ని కాగితాలు చెదపురుగులు తినేశాయి. గుమాస్తాల సంజాయిషీలతో పంపడమైనది. తగినచర్య ఆర్డరు వేయవలసినది.

రామ్‌చంద్ భట్టాచార్.
20.8.52
ఆఫీసు సూపరింటెండెంటు."

డిప్యూటీ సెక్రటరీగారు ఏదైనంత తొందర

★ ఆఫీసర్లు ★

రలో యీ ఫైలును చూసి యిల్లా ఆర్డరు చేశారు:—

"ఇందులో బాధ్యులైన గుమాస్తాలను వెంటనే 'సస్పెండు' చేసి 'చార్జస్ ఫ్రేమ్' చెయ్యండి. విచారణచేసి వివరాలు నాకు తెలియపర్చండి. ఎన్ని చెదపురుగులు రికార్డు రూమ్‌లోకి వెళ్ళాయి? ఇంతవరకు ఎన్ని ఫైల్సు పాడుచేశాయి! ఇంకా ఎన్ని ఫైల్సు పాడుచేయగలవు?

ఎస్. ఆర్. జగన్.
18.10.52
డిప్యూటీ సెక్రటరి."

ఫైలుక్రిందకు దిగటం ఆరంభమయింది. ఆఫీసు సూపరింటెండెంటుగారు ఫైలును హెడ్ గుమాస్తాకు పంపుతూ యిల్లా రాశారు:—

"డిప్యూటీ సెక్రటరిగారి ఆర్డరు ప్రకారం చేయవలసినది. పాడైనదానిని బాగు చేయించటానికి ఎంతడబ్బు ఖర్చుఅవుతుంది? ఎంతకాలం పడుతుంది?

రామ్‌చంద్ భట్టారకా
30-10-52
ఆఫీసు సూపరింటెండెంటు."

హెడ్‌గుమాస్తా, డిప్యూటీ సెక్రటరిగారి ఆర్డరు ప్రకారం గుణశేఖర్‌ని, చంద్రమౌళిని సస్పెండు చేశాడు. చెదపురుగులను లెక్కకట్టటానికి రోజుకూలి పద్ధతిమీద రెండువారాలపాటు ఒకరిని ఏర్పాటు చేశాడు. తర్వాత రిపోర్టు యిలా రాశాడు:-

"డిప్యూటి సెక్రటరిగారి ఆర్డరు ప్రకారం, క్లార్కు గుణశేఖర్‌ని, రికార్డుకీపరు చంద్రమౌళిని 1-11-52 నుంచి సస్పెండు చేశాను. రెండువారాలపాటు రోజు 1కి రు. 3-8-0 చొ॥న రోజుకూలి పద్ధతిమీద మహమ్మద్ అబ్దుల్ రహిమాన్ అనే అతనిని చెదపురుగులను లెక్కకట్టటానికి నియమించాను — అటీరువాలో 896 బతికినవి — 28 చచ్చిపోయినవి — చెదపురుగులు వున్నాయి. ఇంతవరకు ఒక ఫైలుమాత్రమే తినేశాయి. ఈ చెదపురుగులు అన్నీ కలిసి రికార్డురూమ్ ఫైల్సు అన్నీ పాడుచెయ్యాలనుకొంటే పాడు చేయగలశక్తి గలవి. పాడైన ఫైలును బాగుచేయటానికి, నలుగురు గుమాస్తాలను ప్రత్యేకంగా యీ పనికి వినియోగిస్తే సుమారు నెలరోజులలో యీ పని నిర్వర్తించగలరు. మహమ్మద్ అబ్దుల్ రహిమాన్ జీతము రు. 49-0-0 మంజూరు కోరవలసినది.

ప్రసాద్
18-11-52
హెడ్ క్లార్కు."

ఆఫీసు సూపరింటెండెంటుగారు హెడ్ గుమాస్తా రిపోర్టు చూసి, డిప్యూటీ సెక్రటరిగారికి పంపుతూ యిల్లా రాశారు.

"ఈ విషయంలో తగిన చర్య హెడ్ గుమాస్తా తీసుకొన్నాడు. చిల్లర ఖర్చుల





పూర్వీకుల తలపాగా పద్ధతులు

చిత్రాలు: చెరుకూరి సురవయ్య నాయుడు.

క్రింద రు. 49-0-0 మంజూరు చేయవలసినది. ఈ డబ్బు తాత్కాలికంగా నియమింపబడిన మహమ్మద్ అబ్దుల్ రహిమాన్‌కు యివ్వాలి.

రామ్‌చంద్ భట్టారకా.
28-11-52
ఆఫీసు సూపరింటెండెంటు."

డిప్యూటి సెక్రటరిగారు యీ ఫైలునంతా చాలా జాగ్రత్తగా చదివి చూశారు. ఇంతవరకు యీ విషయం సెక్రటరీగారికి తెలియకపోవటం చాలా పొరపాటయిందనుకొన్నారు. వెంటనే ఫైలును సెక్రటరీగారికి పంపుతూ యిల్లా రాశారు:

"కొద్ది రోజులక్రిందట ఎక్కౌంట్ సెక్షన్‌లో కొన్ని కాగితాల్ని చెదపురుగులు తినేశాయి. ఒక విచారణకూడా చేయించాను. ఈ చెదపురుగులు ఏదారిగుండా బీరువాలోకి ప్రవేశించాయో ఎవరికీ తెలియదు కాబట్టి యిందుకు బాధ్యులు ఎవరో నిర్ణయించలేం! మన సిబ్బంది చెదపురుగుల విషయంలో తర్ఫీదు పొందినవారు కాకపోవటంచేత యీ విషయంలో యింతకన్నా వివరాలు రాయటం సాధ్యంకాదు.

ఎస్. ఆర్. జగన్.
20-12-52
డిప్యూటి సెక్రటరి."

సెక్రటరీగారి దగ్గరకి వందలకొద్దీ ఫైల్సు వస్తాయి-దురదృష్టవశాత్తు యీ ఫైలు "అర్జంటు" మార్కు వేయించుకోకుండా వెళ్ళిపోయింది. అందుచేత నాలుగు నెలలదాకా దీనిమీద దృష్టి పడలేదు. సెక్రటరీగారికి ఫైలంతా చదివిచూసి యిల్లా రాశారు:

"ఎంక్వయిరీ పూర్తిగాలేదు. చెద పురుగులు-రికార్డురూమ్‌లోకి ఎల్లా వచ్చాయి? ఇంకా ఏయే జంతువులు రికార్డు రూమ్‌లోకి రావటానికి అవకాశముంది.?

డబ్ల్యు. జె. జార్జి బ్రూక్.
26-4-53
సెక్రటరి.

ఫైలు మళ్ళీ క్రిందకు దిగింది. వరసక్రమంగా-హెడ్ గుమాస్తాని వారం రోజులలో రిపోర్టు పంపాలన్నారు.

చెదపురుగులు రికార్డు రూమ్‌లోకి ఎల్లా వచ్చాయో తెలుసుకొనేందుకు విశ్వప్రయత్నం చేశాడు హెడ్ గుమాస్తా. కాని ఫలించలేదు. చివరకి యిల్లా రాశాడు...

"ఇందుకు ఎవరు బాధ్యులో, ఎల్లా యీ చెదపురుగులు బీరువాలో ప్రవేశించాయో ఎవరూ చెప్పలేరు.

పాలీళ్ళు, బల్లులు, ఎలుకలు, మిడతలు, పిచ్చుకలు, పావురాలు, కుక్కలు, నక్కలు మొదలైనవి కూడా రికార్డు రూమ్‌లోకి

రావటానికి అవకాశాలున్నాయి. లోపలికి రాకూడదనే ఉత్తరువును ఉల్లంఘించి, ఓండ్రపెడుతూ ఓ గాడిద కూడా రికార్డు రూమ్ లోకివచ్చింది ఒకరోజున. కాని మన గుమాస్తాలు, చాలా సామర్థ్యంతోను తెలివితోను దానిని బయటికి పంపించేశారు!

ప్రసాద్.
15-5-53,
హెడ్ క్లార్క్."

ఫైలు మళ్లీ పైకి వెళ్లటం ఆరంభమయింది. కాని యీసారి అదృష్టవశాతూ సెక్రటరీ గారి దృష్టి తొందరగానే పడింది.

పరిస్థితి అంతా ఆమూలాగ్రంగా ఆలోచించి యీ విషయం మంత్రిగారికి తెలియకపోతే ఏదో పెద్ద "డేంజరు" సంభవిస్తుందని భావించి, ఫైలును మంత్రిగారి దగ్గరకి పంపుతూ యిల్లా రాశారు:—

"అతి ముఖ్యం! గౌరవనీయులైన మంత్రిగారు పరీక్షించాలి! డిప్యూటి సెక్రటరి అభిప్రాయంతో నేను ఏకీభవిస్తున్నాను. ఆఫీసు రికార్డులు ఏ విధంగాను కూడా పాడైపోకుండా వుండటానికి తగిన రక్షణ చేయాలనేది నిస్సందేహం. ప్రస్తుతం అర్జంటుగా మూడు డజనులు చెదపురుగులను తినే కాజు పిట్టలను కొనటం మంచిది. అందువల్ల రికార్డు రూమ్‌లో ప్రస్తుతం స్థావరం ఏర్పరచుకొన్న చెదపురుగులు నశించిపోతాయి. లేదా కొన్ని చెదపురుగులనుపట్టి, క్రిమికీటకాది పరిశోధనాలయ డైరక్టరుకు పంపి వాటిని అంతరింపచేసే మార్గం తెలుసుకోవచ్చు!

ఈ ఖర్చుకు మీరు అంగీకరించగలిగితే డబ్బుకోసం ఆర్థికశాఖను మంజూరు కోరగలము.

డబ్ల్యు జె. జార్జిబ్రూక్.
24-7-53.
"సెక్రటరి."

గౌరవనీయులైన మంత్రిగారికి అసలు తీరుబడేవుండదు! ఆయన పార్టీపని—ఆ పార్టీ సిద్ధాంతాలు, ఉపన్యాసాలు, ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనోత్సవాలు, ఎగిబిషనులు, సినిమాల శతదినోత్సవాలు, మళ్లీ వచ్చే ఎన్నికలనాటికి తన పదవికోసం ప్రచారం—ఒకటేమిటి — యిల్లాగే ఆయనకు ఎన్నో పనులు! ఆఫీసుఫైల్సు చూడటానికి ఆయనకు తీరుబడి ఎక్కడ వుంటుంది?

ఆర్నెల్లతరువాత "మన" ఫైలుకు మంత్రిగారు చూడగలిగే భాగ్యం లభించింది!

ఆయన ఒక్కటే వాక్యం రాసిపంపేశారు సెక్రటరీకి—స్వయంగావచ్చి మాట్లాడవలసినది.
రాజామార్గబంధు
10-1-54.
"హోంమంత్రి."

సెక్రటరీ యీ విషయాన్ని మాట్లాడటానికి వచ్చినపుడు మంత్రిగారు నరసింహావతారం దాల్చారు.

'మన ఆఫీసు రికార్డులు చిత్తుకాగితాలు కాదని నీకు తెలుసు! మన డిపారుమెంటు చరిత్రాత్మకంగా ఎంత ముఖ్యమయింది? మనం యిక్కడ నిద్రపోతూంటే, పురుగులు, జంతువులూ రికార్డులను తినేస్తూంటే దేశానికి ఎంత నష్టం సంభవిస్తుంది? నా ఉద్దేశ్యంలో ఇదంతా నా ప్రతిపక్షం తెచ్చే ఒక రాజకీయ విప్లవం! నా డిపార్టుమెంటు వ్యవహారాలన్నీ పాడుచేసి నన్ను అవమానం చేయటానికి పన్నిన కుట్రయిది! పోలీస్ యిన్‌స్పెకర్ జనరల్‌కు యీ విషయాన్ని వెంటనే తెలియపర్చి నలుగురు సి. ఐ డి లను నియమించి, విచారణ చేయించి రిపోరు పంపమను.

నెక్‌స్టట్ — ఆఫీషియల్‌గా విచారణ చేయటానికి హెడ్‌గుమాస్తా ఏం పనికొస్తాడు! నాన్సెన్స్! వెంటనే ఒక కమిటీని నియమించి తరవాత మాట్లాడు వెళ్లు! ముందు. అర్జంటుగా యీ పని చూడు!"


మంత్రిగారు చెప్పినట్లు ఆర్డర్లు జారీ చేశాడు సెక్రటరి:

"తక్షణం మూడు డజనుల కాజు పిటలను కొనండి. ఈ ఖర్చూ, తాత్కాలికంగా నియమింపబడిన మహమ్మద్ అబ్దుల్ రహిమాన్ జీతమూ-హెచ్. ఆర్. యం. యస్-హోం డిపారుమెంటు-రికార్డులు-చిల్లర ఖర్చులు-కొత్తక్రింద వ్రాసి-ఆర్థిక శాఖను మంజూరు కోరండి. కాజు పిట్టలను రికారురూమ్‌లో వదలి, తలుపు లన్నీ మూసివేసి, లోపలకు ఎవరూ వెళ్ళకుండా, రికారు రూమ్ సీలు చేయండి!

కాజుపిటల పెంపకాన్ని గురించి చదివేందుకు ఒక గుమాస్తాను ఆస్ట్రేలియాకు, చెదపురుగుల నాశనానికి 'క్రిమిసంహార శాస్త్రం' చదివేందుకు మరొక గుమాస్తాను అమెరికాకు పంపించండి! గుమాస్తాల పేర్లు సెలెక్టు చేసి పంపవలసినది—అర్జెంట్!
డబ్ల్యు. జె. జార్జిబ్రూక్
22-1-54
సెక్రటరి"

పోలీస్ ఇన్‌స్పెక్టరు జనరల్ యీ విషయంలో దర్యాప్తు చేయటానికి నలుగురు సి. ఐ. డి. లను నియమించాడు. విదేశాల నిపుణులను పిలిపించి ఆఫీషియల్ కమిటీని నియమించటానికి శాసనసభ అనుమతి తీసుకొన్నారు. విదేశనిపుణులకుఆహ్వానాలు పంపబడ్డాయి. ఆస్ట్రేలియానుంచి ఒకరిని, చైనానుంచి ఒకరిని, రష్యానుంచి ఒకరిని, అమెరికానుంచి ఒకరిని-పిలిపించారు.


ఈలోపుగా పెద్ద అల్లరి చెలరేగింది. ప్రభుత్వం చేస్తున్న యీ ప్రయోజనాత్మక కార్యాన్ని అమాయక ప్రజలు అర్థం చేసుకోలేకపోయారు. ఈ వార్త పత్రికాలయాలకు కూడా దారితీసింది. పెద్ద పెద్ద అక్షరాలతో పత్రికలు ఘోషించాయి. సస్పెన్షన్‌లో పెట్టబడిన గుమాస్తాలు హైకోర్టులో దావా వేశారు. ప్రభుత్వంమీద న్యాయమూర్తులైన "జస్టిస్ రెట్", జస్టిస్ ఫైర్"లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు చెబుతూ, ఆ గుమాస్తాలను వెంటనే ఉద్యోగాలలో చేర్చుకోవాలని, యిన్నాళ్ళనుంచీ ఆపుచేసినవాళ్ళ జీతాలు వెంటనే యిచ్చివేయాలని ఉత్తర్వు జారీచేశారు.



సాటిలేని శ్రేష్ఠతకు అద్భుతమైన పనితనమునకు

రెండు దివ్యమైన నేషనల్-ఎక్కో మోడలులు!


ఇవిగో, మీరు రేడియో ప్రసారములను దివ్యముగా విని ఆనందించుటకు చక్కగా పనిచేసే, అత్యంత శ్రేష్ఠమైన రెండు నేషనల్-ఎక్కో మోడలులు! అవి 'మాన్‌సూనైజ్' చేయబడినవి మరియు వాటితో ఒక సంవత్సరము గ్యారంటీ యివ్వబడుతుంది. మీ దగ్గరలోనున్న నేషనల్-ఎక్కో వ్యాపారిని వాటిని పెట్టమని నేడే చెప్పండి!



మోడలు 717: బంగారు రంగు తాపడములతో, మరూన్ రంగు ప్లాస్టిక్ క్యాబినెట్. మోడలు యు-717: 5 వాల్వులు, 3 బ్యాండులు; 230 వోల్టుల కరెంటు మీద పనిచేసే ఏసి/డిసి సెట్. మోడలు బి-717: 4 వాల్వులు, 3 బ్యాండులు; డ్రై బ్యాటరీ సెట్!

రు. 250/-

అన్ని ధరలూ నెట్;
స్థానిక పన్నులు అదనము



మోడలు 187: 6 వాల్వులు, 8 బ్యాండులు, అందమైన కర్ర క్యాబినెట్. మోడలు ఎ-187 ఏసి సెట్; మోడలు యు-187 ఏసి/డిసి సెట్ రు. [illegible]/-

నేషనల్-ఎక్కో రేడియోలు శ్రేష్ఠమైనవి - అవి

మాన్‌సూనైజ్

చేయబడినవి

జెనరల్ రేడియో & అప్లయన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్

ఒపేరా హౌస్, బొంబాయి 4 • 3 మదన్ స్ట్రీట్, కలకత్తా 13 • 1/18 మౌంట్ రోడ్, మద్రాసు
36/79 సిల్వర్ జూబ్లీ పార్క్ రోడ్, బెంగుళూరు • [illegible] కాలనీ, చాందినీ చౌక్, ఢిల్లీ

ఆఫీసర్లు

మంత్రిగారికి మతిలో మతిలేదు! ఆయన వెంటనే పత్రికా ప్రతినిధుల సమావేశం ఏర్పరచి తన ఆఫీసర్లు చేసిన పని సమర్థించారు. పత్రికా విలేఖరులు, మంత్రిగారు చెప్పిన దానిమీదకన్నా, ఆయన యిచ్చిన ఫలహారపానీయాలమీద ఎక్కువగా శ్రద్ధ చూపించారు.

శాసనసభలో ప్రతిపక్షసభ్యులు యిటువంటి సంఘటనలకోసం ఎప్పుడూ కాసుకొని కూర్చొంటారు!

ఒక రోజు సమావేశంలో, ప్రశ్నోత్తర సమయంలో ప్రతిపక్ష సభ్యులు మంత్రిగారిని, నిర్దాక్షిణ్యంగా అవస్థపెట్టేశారు.

"ఖచ్చితంగా ఎన్ని ఫైల్సు పోయి పోయాయి! అవి బాగుచేయించటానికి ఎంత డబ్బు ఖర్చుఅయింది"—ఒక సభ్యుడు అడిగాడు.

"ప్రజాశ్రేయస్సుదృష్ట్యా యిందుకు సమాధానం చెప్పలేను" మంత్రిగారిజవాబు.

"అందుకు బాధ్యులైన వారిమీద ప్రభుత్వం చర్యతీసుకొందా?"-యింకో సభ్యుడుఅడిగాడు.

"ప్రభుత్వం తీసుకొన్న చర్య ప్రజలకు యిదివరకే తెలుసు"—మంత్రిగారు జవాబిచ్చారు.

"అసలు యీ చెదపురుగులు ఎక్కణ్ణించి వచ్చాయి?" మరో సభ్యుడడిగాడు.

"అందుకనే-యీ విషయాన్ని అమూలాగ్రంగా పరిశీలించేందుకే ఒక కమిటీని నియమిస్తున్నాం"—మంత్రిగారు వినుగ్గా సమాధానమిచ్చారు.

"ఇటువంటి పిచ్చిపనులు యింకేమైనా కూడా కమిటీకి చెప్పదలచుకొన్నారా?" యింకో సభ్యుడు అడిగాడు.

ఇది విని సభలోని సభ్యులందరూ గొల్లున నవ్వారు. మంత్రిగారు మాట్లాడలేదు—

"ఇతర డిపార్టుమెంటులలో కూడా యిటువంటివి జరుగుతున్నాయా?" మరో సభ్యుడు అడిగాడు.

"సమాధానానికి అవకాశం కావాలి" అన్నారు మంత్రిగారు.

అంతటితో ఆ నాటికి సభ ముగిసింది.

విదేశ నిపుణులు, భారతదేశానికి వచ్చి, ముందు తీరుబడిగా, యాత్రా స్థలాలు, చరిత్రాత్మకప్రదేశాలు, చూస్తూ ఒక నెల విశ్రాంతి తీసుకొన్నారు. ఆ తర్వాత ఆఫీసుకు వచ్చారు. సమాస్తాలతోనూ, ఆఫీసర్లతోనూ, చర్చలు జరిపి, కొన్ని ఫోటోలు తీసుకొని, ఆఫీసుచుట్టూ కొంత మట్టి శాంపిల్సుకూడా తీసుకొని, చివరకి ఒక వేసవి విడిదికివెళ్ళి కూర్చొన్నారు వారి రిపోర్టు వ్రాయటానికి.

మొదట్లో అమెరికానిపుణుడు, రష్యా నిపుణుడు కొన్ని విషయాలలో ఏకీభవించలేదు. వారిద్దరూ ఏకీభవించేటప్పటికి రిపోర్టు చాలా ఆలస్యమయిపోయింది. చిట్టచివరకి వారు 30-10-54 నాటికి రిపోర్టు ప్రభుత్వానికి సమర్పించారు.

ప్రభుత్వం వాళ్ళకి కృతజ్ఞత తెల్పుతూ సాధారణ ఖర్చులకింద వాళ్ళకి కేవలం నాలుగులక్షలమాత్రం సమర్పించుకొంది.

వాళ్ళు కూడా భారతీయుల ఉదార స్వభావాన్ని మెచ్చుకొంటూ వారి వారి దేశాలకు వెళ్ళిపోయారు.

ఆ నిపుణుల కమిటీవారు వారి రిపోర్టులో యిల్లా రాశారు:



అక్కా - చెల్లెలు

—ఫోటో: ఎ. కె. ఎస్. రావు, కలకత్తా.

1. ఈ ఊరు వాతావరణంవల్ల చెదపురుగులు యిక్కడ చాలా ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. అందుచేత రికార్డురూమ్‌లో వున్న రికార్డులన్నీ యిక్కడికి కనీసం 200 మైళ్ళ దూరంలో వున్న మరొక ఊరుకు వెంటనే మార్పివేయాలి.

2. కొత్త రికార్డురూమ్‌లో గాలిచొరని యినుపబీరువా లుంచాలి. వారానికి ఒకసారి రికార్డురూమ్ అంతా క్రిమినాశకాఔషధాలతో "స్ప్రే" చేయిస్తూవుండాలి.

3. ప్రస్తుతం వున్నగదికూడా రికార్డ్ రూమ్‌కు పనికిరాదు. ఎందుచేతంటే అది తూర్పువైపుంది. రికార్డురూమ్‌లు ఎప్పుడూ పశ్చిమంవైపే వుండాలి!

4. ప్రస్తుతపుఆఫీసు భవనం కూడా పనికిరాదు. ఎందుచేతంటే యిందులో కర్రస్తంభాలు కర్రదూలాలే వున్నాయి. రాతికట్టడం వుండటం మంచిది.

5. ఇక్కడ నేల చెదపురుగులు పెరగటానికి చాలా అనుకూలంగా వుంది.

ఈ రిపోర్టు, చదివిన తర్వాత, కొత్త భవనం కట్టించి, రికార్డులను మరొక ఊరు మార్చటానికి నిశ్చయించింది ప్రభుత్వం.

కొత్త భవనము రెండేళ్ళలోనే అంటే 18-11-56 నాటికి తయారవటానికి, ఖర్చు కూడా చాలా తక్కువగానే అయిదు లక్షలయింది!

ఇదివరలో సస్పెండు చేయబడిన గుమాస్తాలను మళ్ళీ ఉద్యోగాలలో చేర్చుకోవలసి వుండటంచేత వారి జీతాల కింద 18,000 మాత్రం యివ్వవలసి వచ్చింది!

విదేశాలకు పంపబడినగుమాస్తాల కింద యాభైవేలు మాత్రం ఖర్చు చేసింది ప్రభుత్వం!

ఆ కొత్త భవనాన్ని తెరవటానికి ఒక మహారాజాగార్ని రప్పించి, వారి సన్మానానికి పదివేలు మాత్రం ఖర్చుచేసింది ప్రభుత్వం!

పాతవూరునుంచి కొత్తవూరుకు రికార్డులను మార్చమని ఉత్తరువు జారీ చేసింది. ప్రభుత్వం ఇదివరలో సెక్రటరీగారి ఆర్డరు ప్రకారం రోజా పిటలను అందులో వదలి సీలుచేసిన రికార్డు రూమ్ ఆనాడు తెరచిచూసేసరికి ఆఫీసర్లందరూ తెల్లబోయారు!

అందులో మూడు డజనుల రోజా పిట్టల ఎముకల గూళ్ళు తప్ప యింకేమిలేవు! ఇదివరలో ఆగదిలోనే స్థావరం ఏర్పరచుకొన్న చెదపురుగులు తమ జాతిని బాగా అభివృద్ధి చేసుకొని ఆ గదిలోవున్న రికార్డులన్నింటినీ తినేయటంతోటే వదలకుండా బీరువాలను కూడా తినేశాయి.

ఇంత తతంగానికి, నూతన భవన నిర్మాణానికి కారణభూతమైన "మన" ఫైలు అసలు హోండిపార్టుమెంటుకు సంబంధించినదే కాదని, ఆడిపారుమెంటుకు ఒక రిఫరెన్సుకోసం మరొకడిపార్టుమెంటు నుంచి వచ్చిందనీ, దానిని చించివేయ వలసినదిగా ఏనాడో ఆర్డరు వేయబడిందని తేలింది ఆనాడు! ★

పప్పులో విషం

(గతసంచిక తరువాయి)

"నువ్వు ఈ రీచవటలా ఉన్నావబ్బాయ్.

"మీదృష్టిలో నేను చవటనై ఉండచ్చు. అంతమాత్రంచేత మీ అమ్మాయి వాసంతిని నేను ప్రేమించాననే వాస్తవాన్ని మీరెలా కాదనగలరు ?"

భీమారావు ఉగ్రుడై 'ఏమిటీ, అన్నావ్?' అన్నాడు.

"ఎప్పుడు?" అని ఎదురు ప్రశ్నించాడు మావాడు.

"ఇప్పుడే—మీ అమ్మాయి వాసంతి... అంటూ ఏదో కూశావ్"

"అదా? ఒక అమ్మాయి ఉందిలెండి—విశాలమైన నల్లటి కళ్ళు, ఒడ్డూ పొడుగూ సమానంగా ఉంటుంది. పొడుగుపాటి ఒంపులు తిరిగిన జుట్టు. ఆ అమ్మాయి పేరు వాసంతిలెండి. మేం పెళ్లి చేసుకోబోతున్నాం. ఆమె తండ్రి ఒప్పుకోడ మొక్కటే తరువాయి."

"హుఁ" అంటూ భీమారావు ఒక్కసారి హుంకరించాడు.

"అందులో నే ఉందబ్బాయి కిటుకంతా"

"అంటే మీ రొప్పుకోరన్న మాట!"

"ఒప్పుకోను. ముమ్మాటికీ ఒప్పుకోను."

"అంతే నంటారా?"

"ఆహా. అంతే."

"దెబ్బతో మా బలరాం ఉత్సాహమంతా చచ్చిపోయింది. వాడు నిలువునా నీరైపోయి వచ్చినట్లే వచ్చి తన గదికి చేరుకున్నాడు. ఇంతలో హఠాత్తుగా ఒక సంగతి గుర్తొచ్చి వాడి హృదయం ఒక్కసారిగా ఉప్పొంగింది. ఏది ఎలా పోయినా, "పప్పులో విషం" ఇంకా మూడువంతులు చదవడం మిగిలే ఉంది.

రైలు విల్లివాకం స్టేషన్కి చేరుకునేటప్పటికి మా బలరాం సరిగా డిటెక్టివ్ సోమదత్ భోజనాలగదిలో ఫ్రిజిడేరీ తెరిచి లోపలికి తొంగి చూసే ఘట్టందాకా వచ్చాడు. డిటెక్టివ్ అలాచూసి ఒక్కసారిగా గుడ్లు పెద్దవిచేసి నోరు వెళ్ళబెట్టి మూర్ఛపోయే పర్యంతం అవుతాడు 'వాలకాన్ని బట్టిచూస్తే నవల చాలా అద్భుతంగా ఉండేట్లా ఉంది' అయితే తను పుస్తకం రైల్లో మరిచిపోయిన సంగతి వాడికి వెంటనే గుర్తొచ్చి నిలువునా నీరైపోయాడు. అప్రయత్నంగా వాడి లోంచి ఒక పెద్ద నిట్టూర్పు వెలువడింది.

విరహాగ్నిదుఃఖాన్ని గూర్చి మన కవులు నిజంగా తమ కావ్యాల్లో అత్యద్భుతంగా వర్ణించారు. తల్లిదండ్రుల్ని పోగొట్టుకున్న వాళ్ళు—ప్రేయసుల్ని ఎడబాసినవాళ్ళు—పిల్లల్ని గోల్పోయినవాళ్ళు-డబ్బునీ, కీర్తినీ, కుక్కపిల్లల్నీ, గొడుగుల్నీ, చెప్పుల్నీ, ఆఖరికి ఫౌంటెన్ పెన్నుల్ని పోగొట్టుకున్న అభాగ్యులు, ఎంతటి మహాదుఃఖసాగరంలో మునకవేస్తారో మన కళ్ళకి కట్టినట్టుగా వర్ణించిన మహాకవులు మనకున్నారు. అయితే, ఒక ఉత్సాహవంతుడైన యువకుడు సగంవరకు చదివి, మిగిలిన సగం రాత్రి పూర్తిచేద్దామనే ఉద్దేశ్యంతో తీరా చూసుకోగా తన డిటెక్టివ్ నవల ఏ రైల్లోనో, బస్సులోనో పోగొట్టుకున్న విషయం బయటపడగా ఆ యువకుడు పడేబాధనీ, యాతననీ వర్ణించిన కవి ఒక్కడూ మనకి కనిపించడు.

మా బలరాం ఎదుట ఒక దీర్ఘమైన రాత్రి అలా వ్యాపించిపరుచుకుని ఉంది.

నరసింహ

అయితే సుఖనిద్రతో దాన్ని హాయిగా ఉపయోగించుకోవచ్చుననే ఆలోచనే వాడికి తట్టలేదు. వాడు ప్రక్కమీద పడి యిటూ అటూ దొర్లసాగాడు. మా వాడికి వచ్చిన బాధల్లా ఒక్కటే. డిటెక్టివ్ సోమదత్ విచిత్ర ప్రవర్తన ఎంత తలపగలకొట్టుకున్నా వాడికి అర్థంకావడంలేదు. మరి "స్వర్ణమేఖల" వంటి ప్రసిద్ధ రచయితమీద అందరు పాఠకులులాగే మా బలరాంకి కూడ అచంచల విశ్వాసం ఉందాయె. ఏదో పెద్ద ఆశ చూపించి మళ్ళీ అంతలోనే తన పాఠకుల్ని ఒక్కసారిగా నిరుత్సాహపరిచేసే రచయిత కాదతను. తన భార్య పోస్టు చెయ్యమని ఇచ్చిన ఉత్తరం సంగతి హఠాత్తుగా జ్ఞాపకమొచ్చి సోమదత్ అలా తెల్లపోయి చూశాడని చప్పగా ముగించే రకం కాదు. "స్వర్ణమేఖల" స్వయంగా సృష్టించిన డిటెక్టివ్ సోమదత్ భోజనాలగదిలో ఫ్రిజిడైరీ తెరిచి లోపలికి చూసి అలా కంగారు పడ్డాడంటే అందులో తప్పక ఏదో అద్భుత రహస్యం ఇమిడి వుంటుంది. అందులో ఏ తెగిపోయిన పాత్రల్ని, ఏ తలకాయలేని శవమో నిస్సందేహంగా అతనికి కనిపించి వుండాలి.

మా బలరాం ఏదో చెప్పలేని బాధతో ఒక పెద్ద మూలుగు మూల్గాడు. ఇప్పుడు కర్తవ్యమేమిటి? ఏం చెయ్యడం? పోనీ "పప్పులో విషం" బదులు ఇంకో డిటెక్టివ్ నవలేమన్నా చదువుదామన్నా అటువంటి దానికేం ఆస్కారం లేదు. జమీందారు లైబ్రరీలో వుండే పుస్తకాలన్నీ గాలించి చూసినా ఒక్క డిటెక్టివ్ నవల దొరికే ఆశ లేదు. హరిప్రసాద్ గారి దగ్గర ఏటువంటి పుస్తకాలుంటాయో మా వాడికి బాగా తెలుసు. ఆంధ్రపత్రికా గ్రంథమాల వారి అనువాదాలు, తెలుగు భాషా సమితి వారి సర్వస్వం సంచికలు ఇంకా ఇటువంటివే ఆంధ్ర గ్రంథాలు ఉంటాయి తప్ప ఆ పుస్తకాల వరసల్లో పొరబాటున కూడా నేటి అర్థరూపాయి నవలలు చేరతాయనే ఆశ మా బలరాంకి ఎన్నడూ లేదు.

అందుకే 'ప్రస్తుత కర్తవ్య మేమిటి?' తిరిగి తిరిగి అదే ప్రశ్న వాణ్ణి బాధించసాగింది.

అకస్మాత్తుగా, అనుకోనిదే మా వాడి బుర్రలో ఒక అద్భుతమైన ఆలోచన మెరుపులా మెరిసింది. వాడి ప్రశ్నకి సమాధానం అతి సులభంగా దొరికింది.

అప్పటికే చాలా రాత్రయింది. ఈపాటికి భీమారావు తప్పక పడుకునిఉంటాడు. అతని ప్రక్కనే టేబిల్ మీద "పప్పులో విషం" పడిఉంటుంది. మావాడు చెయ్యవలసిందల్లా మెల్లిగా అతని గదిలోకి దూరి దాన్ని కొట్టుకురావడమే.

ఆలోచించినకొద్దీ మావాడికి ఈ ఆలోచన చాలా అద్భుతంగా కనిపించింది. వాడింకొక్క క్షణం వ్యర్థపుచ్చలేదు. వెంటనే గదిలోంచి బైటి నడవలోకి వచ్చేశాడు. గబగబా అంగలు వేసుకుంటూ భీమారావు గదికేసి నడిచాడు.

వెనుకముందులు చూడకుండా చటుక్కున గదిలోకి వెళ్ళి లోపలినుంచి మెల్లిగా తలుపులు మూసేశాడు. అతిపరిచితమైన స్థలంలో ఉన్నప్పుడు మనస్సులో కలిగే విచిత్ర భావాలు కదిలించేస్తూండగా వాడు ఒక్క క్షణం అలా నుంచునిపోయాడు. గది అంధకారంగా ఉంది. అయితే ఆగదిలో టేబిల్ ఎక్కడుందో కళ్లుమూసుకునే మా

వాడు చెప్పగలిగే పరిస్థితిలో ఉండడంవల్ల జంకూ గొంకూ లేకుండా తిన్నగా బల్లదగ్గరికి వెళ్ళిపోయాడు.

వాడు చటుక్కున పుస్తకంతీసి జేబులో పెట్టుకున్నాడు. కాని తిరిగి వచ్చేసే తొందరలో టేబిల్ లాంపుకి కనెక్ట్ చేసిఉన్న వైరు వాడి కాలికి తగిలింది. దెబ్బతో టేబిల్ మీది లాంపు ఒకసారిగా పైకెగిరి క్రిందపడిపోయింది. వందప్లేట్లు పగిలిపోయిన చప్పుడుతో లాంపు ముక్కముక్కలై పోయింది.

దోమల్ని చంపడానికి ఎత్తిన రెండు చేతులూ అలా విడివిడిగా ఉండగానే బ్రహ్మాండమైన ఆ చప్పుడుకి భీమారావు చటుక్కున లేచాడు. వెంటనే స్విచ్ వేశాడు.

మా బలరాం ఊరికే కంగారు పడ్డాడని మాత్రం చెప్పి ఊరుకోడం వాస్తవానికి దూరమే అవుతుంది. వాడికి పదకొండో యేడు దాటిన తర్వాత ఇంతవరకూ ఇటువంటి మహాఘోరం జరగలేదు: పదోయేట గావును వాడోసారి వాళ్ళమ్మ ఉట్టిమీద దాచిన జున్ను దొంగిలించే ప్రయత్నంలో వరసగా ఉట్టిలోఉన్న పెరుగుగిన్నె—పాలచెంబూ—జున్ను తప్పేలా మొదలైన పాలుగైరు పాత్రల్ని అమాంతం క్రింద పడేశాడు. అప్పటి ఆ అనుభవంతో నేటి అనుభవం కొంతవరకూ సరిపోయినట్లు మా వాడికి అనిపించి ఉంటుందనడంలో ఏం అతిశయోక్తి లేదు.

భీమారావు ఆ పరిస్థితుల్లో హఠాత్తుగా మాబలరాంనిచూసి కొంచెంకంగారుపడ్డాడు. ఆశ్చర్యాన్ని వ్యక్తపరిచే కంఠస్వరంతో "నువ్వా?" అన్నాడు.

మావాడు కొంచెం చిరునవ్వు ముఖంలోకి తెచ్చుకుంటూ, "ఏమండోయ్" అని పలకరించాడు. ఏ బజారులోనో అకస్మాత్తుగా ఏ చిరపరిచితుణ్ణో కలుసుకున్న వాడిలా.

"హరిప్రసాద్ గారు నాకీ గది ఏర్పాటు చేస్తూ," ఇందులో దయ్యాలు తిరుగుతూంటాయని పుకారు ఉందండోయ్" అంటే నేను లక్ష్యపెట్టలేదు. అయితే నువ్వు ఇన్నిసార్లు ఇలా ఈ గదిలోకి వస్తూ పోతూ ఉంటావని నాకు తెలిసిఉంటే నేను వస్తే ఈగది పుచ్చుకునేవాణ్ణికాను."

మా బలరాం నోరెత్తకుండా ఈ విమర్శని స్వీకరించాడు_

"నేను ఒప్పుకుంటాను. నా ప్రవర్తన మీకు అనుమానాస్పదంగా కనిపించడంలో ఆశ్చర్యమేమీ లేదు. అయితే నా ప్రత్యేక పరిస్థితినిపట్టి మీరు నన్ను క్షమించాలి. నేనిప్పుడు మళ్ళీ మీ గదిలోకి రావడానికి కారణం నేను మీ అమ్మాయిని పెళ్ళాడే విషయాన్ని గూర్చి మళ్ళీ మీతో ఒకసారి చర్చించదలచుకోడమే. మీరు మా వివాహం జరగడానికి వీలులేదు అంటున్నారు. "ఎందుకు వీలులేదు?" అని మిమ్మల్ని నేనిప్పుడు అడుగుతున్నాను. చెప్పండి. ఏం చెబుతారో?"

భీమారావు అతి గంభీరంగా ముఖంపెట్టి అన్నాడు-"నా కూతురుపెళ్ళికి సంబంధించిన వేరే అభిప్రాయాలు నాకు ఉన్నాయి. వానంతి పెళ్ళి చెయ్యవలసి వస్తే ధైర్యసాహసాలులేని-పిరికి పందలైన ఈ కాలపు నాజూకు నాగరికులకి ఎంతమాత్రం దాన్ని



జలక్రీడ
ఫొటో: బి. గంగానాథ్-సికింద్రాబాద్

ఇవ్వను. ధైర్యసాహసోపేతుడైనదృఢకాయుడైన, మగతనంగల, మంచి కుర్రాడికిస్తాను. నీమనస్సుని కష్టపెట్టడం నాకిష్టం లేదు-కాని నీవిషయంలో కన్నదాన్నీ, విన్నదాన్నీ బట్టి నేనర్థంచేసుకున్న దేమంటే నువ్వొక 'బుర్ఖదిల్'వని"

మాబలరాం అతి తీవ్రంగా ప్రతిఘటించాడు: "ఆ ప్రయోగం మీరు వెంటనే విత్ డ్రా చేసుకోవాలి-అయినా ఈ 'బుర్ఖదిల్' శబ్దానికి అర్థంకూడ నాకు తెలియదు."

"బుర్ఖదిల్" అంటే. చప్పబడిపోయిన, చల్లారిపోయిన హృదయం గలవ్యక్తి. సంకోచస్వభావం, పనికిమాలిన చచ్చు అభిప్రాయాలు కలవ్యక్తి. తనచుట్టూ ఇరుకు గోడలు కట్టుకుని ఆ మధ్యనున్నదే ప్రపంచం అనుకుంటూ బాహ్య ప్రపంచంతో ఏం సంబంధం లేకుండా
పరం వచ్చినప్పు
చూపించి, విపరీ
వాతావరణం తో
ఉండదు. హఠాత్తు
సింహాన్నో, పెద్దపులిని
ఏంచెయ్యాలో వాళ్ళకి
ఉన్నావు. ఆఫీసునుంచి ఇ.
ఉంటావనుకో, ఆకలిగొన్న భయంకరమైన తోడేలు అమాంతం మీదపడి నిన్ను చీల్చుకుతినెయ్యడానికి సిద్ధపడుతుందనుకో, అప్పుడు నువ్వేం చేస్తావు?"

"నేను ఆఫీసులో ఎక్కడా పని చెయ్యడం లేదు కనుక ఇటువంటి సమస్యకే ఇక్కడ తావులేదు"

"అయితే ఇంకోకలా అనుకుందాం. నువ్వు భద్రాచలం దగ్గర పాపికొండల సౌందర్యాన్ని తిలకించడానికి వెళ్ళావనుకో, బాలకవులు అటువంటి పిచ్చిపనులు చేస్తూనే ఉంటారు కదూ. పాపికొండల దగ్గర ఏ అడవిలోనో నువ్వు ఉంటావు, గోదావరి పాయ ఒకటి వరదరోజులు కనుక అతివేగంగా ప్రవహిస్తూ ఉంటుంది. నువ్వు ఇవతలినుండి అవతలికి వెళ్లాలి. తాటిదూలాలతో కట్టిన వంతెన ఒకటుంటుంది. నువ్వు వంతెనమధ్యకి చేరుకుంటావు. హఠాత్తుగా అవతలి వేపునుంచి ఒక పెద్దపులి నీవేపుకివస్తూ కనిపిస్తుంది. వెనక్కిచూస్తే అదే సమయంలో ఇద్దరు కోయదొరలు విల్లెక్కుపెట్టి పెద్దపులి కొట్టబోతూ కలిపిస్తారు. క్రిందికి చూస్తే ఒక పెద్ద మొసలినోరు తెరచుకుని నీకేసి చూస్తూ గుటకలు వేస్తూ ఉంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితిలో నువ్వేంచేస్తావో చెప్పు చూద్దాం."

మా బలరాం ఆ క్లిష్టపరిస్థితిని అతి నిశితంగా పరిశీలించాడు. వాడు ఒప్పుకోక తప్పలేదు. "నిజానికి అతి భయంకరమైన పరిస్థితే. చాల కంగారుపడవలసే ఉంటుంది. ఆ కంగారులో కాలుజారి క్రిందపడిపోడం కూడా తటస్థిస్తే ఏం ఆశ్చర్యం లేదు."

భీమారావు వికటాట్టహాసం చేస్తూ "ఆఅలా త్రోవలోకిరా. అటువంటి క్లిష్ట పరిస్థితిలో ఏం చెయ్యాలో మా మురళీధర్ కి బాగా తెలుసు" అన్నాడు.

"మీ మురళీధరా? ఆ ఇన్‌స్పెక్టర్ సంగతా మీరనేది?" "అతనే, మా వాసంతికి కాబోయే భర్త. రాత్రి భోజనం కాగానే అతను నా సమ్మతిని కోరాడులే."

మా బలరాం క్రుంగిపోయాడు. అనుకోందే వచ్చిపడ్డ పిడుగులాంటి ఈ వార్తకి వాడొక్కసారిగా భూమిలోకి దించుకుపోయాడు. ఈ సంగతి ఇంతకి ముందే తను ఊహించి ఉండవలసింది. ఈ మిలిటరీ వాళ్లు పోలీసువాళ్లు ఎంతలేదన్నా ఒక

ప్పులో విషం ★

టిత్రో ఒదిలిపెట్టలేదు

పరిస్థితుల్లో మా మురళీధర్ [illegible] తెలుసా? గబుక్కున వంతెన మీంచి క్రిందికి దూకేస్తాడు. మొసలి తన దగ్గిరికి రాగానే తన చేతిలో ఉన్న కర్ర దాని నోట్లో దూర్చేస్తాడు. జేబులోంచి కత్తితీసి దానిరెండు కళ్లూ పొడిచేస్తాడు. తరువాత ప్రవాహం వాలులో కొట్టుకు పోయి ఒక సురక్షిత స్థలానికి జేరుకుంటాడు. అదుగో—అటువంటి పుత్రాడు నా అల్లుడుగా ఉండడానికి తగినవాడు.”

మా బలరాం మళ్ళీ కిమ్మనలేదు. వెంటనే ఆ గదిలోంచి బయటికి వచ్చేశాడు. తన జేబులో “పప్పులో విషం” సురక్షితంగా ఉందన్న సంగతి కూడా వాడి నిరాశా హృదయాన్ని వెలిగించ లేక పోయింది. తిన్నగా తన గదికి వచ్చేసి జేబులోని పుస్తకం తీసి టేబిల్ మీద విసిరి పడేశాడు. గదిలో ఇటూ అటూ పచార్లు చెయ్య సాగాడు. వాడు రెండు మూడు రౌండ్లు తిరిగాడో లేదో ఇంతలో వాడిగదితలుపులు హఠాత్తుగా తెరుచుకున్నాయి.

పుస్తకం పోయిన సంగతి చూసుకుని భీమారావు తన వెనువెంటనే వచ్చి ఉంటాడని మా వాడు భ్రమపడ్డాడు. తను తెలివి తక్కువగా పుస్తకం టేబిల్ మీద ఎదురుగుండా పడేసినందుకు వాడు పశ్చాత్తాప పడసాగాడు. అయితే గదిలోకి వచ్చింది. భీమారావు కాదు—ఇన్స్పెక్టర్ మురళీధర్!

వచ్చే రావడంతో మురళీధర్ మా వాడి ముఖంలోకి తీవ్రంగా చూశాడు—“ఏం, ఆ నగలూ సొమ్ము ఇలాపడేయ్” అన్నాడు.

మా బలరాం బిక్క చచ్చిపోయాడంటే నమ్మండి!

“ఏం నగలూ? ఏం సొమ్ము?”

“ఏం నగలేమిటి? నీవు తీసిన నగలే.”

“అంటే? మీ మాటలు నాకేం అర్థం కావడం లేదు.”

ఇన్స్పెక్టర్ మురళీధర్ విసుగాఅన్నాడు “ఆనగ లేమిటో ఆ సొమ్మేమిటో నీకే తెలియాలి. జమీందారుగారి ఇంట్లో పేసా అయిఉండాలి. లేక భీమారావుగారి పెట్టిలో పేసా ఐఉండాలి. నువ్వు ఎవరి గదిలోంచి బయటికి వచ్చావో నేను సరిగ్గాచూడలేదు.”

మా వాడికి ఇప్పుడిప్పుడు కొంచెం అర్థం కాసాగింది:

“ఓహో - నేను గదిలోంచి బయటికి వస్తూండగా చూశారా మీరు? అలా చెప్పండి!”

“ఏదో బ్రహ్మాండమైన చప్పుడైంది. నేను బాగా నిద్రలో ఉండి లేచాను. లేచి ఇంటి చుట్టూ తిరిగి చూశాను. ఎవరూ కనిపించ లేదు. లోపలికి వచ్చి మళ్ళీ నా గదికి వెళ్ళి పోతూండగా నడవలో నువ్వు కనిపించావు. ఏ గదిలోంచి వచ్చావో నాకు సరిగ్గా తెలియదు.”

“నేను జరిగిన విషయం చెబుతాను, వినండి. అత్యవసరమైన ఒక వ్యక్తిగత విషయాన్ని గూర్చి మాట్లాడడానికి భీమారావు గారి గదికి వెళ్ళాను. మాట్లాడడం కాగానే వచ్చేశాను చోరీ ఏదో జరిగిందని మీరు అనవసరంగా భయపడుతున్నారు.”

“మీరు చెప్పేది నిజమేనా?”

“అవును. మేం సింహాలు, పెద్దపులులు, మొసళ్లు, వాసంతి, అడవులు, కొండలూ ఇత్యాది అనేక విషయాల్ని గురించి చాలా రాత్రిదాకా బాతాఖానీ వేశాం. ఇప్పుడిప్పుడే నేను గదికి జేరుకున్నాను.”



ఆడుతూ, దొగాడుతూ...

—ముద్దులొలికేచిట్టిపాప.

మురళీధర్ కి అనుమానం ఇంకా పూర్తిగా తీరలేదు. అతను, “సరే - ఉదయం ఇంట్లో ఏమన్నా పోయిందని తెలిస్తే ఏంచెయ్యాలో నాకు తెలుసులెండి” అన్నాడు.

ఇంతలో మురళీధర్ దృష్టి హఠాత్తుగా టేబిల్ మీది పుస్తకంమీద పడింది. అతను అత్యుత్సాహంతో టేబిల్ దగ్గరికి వెళ్లాడు. “అరే! ‘స్వర్ణమేఖల’ క్రొత్త రచన! దీనికోసమే నేను చూస్తున్నాను. అద్భుతమైన డిటెక్టివ్ నవల. పత్రికల్లో చక్కని విమర్శనలుకూడ పడ్డాయి” అలా అంటూనే అతను “పప్పులో విషం” తీసుకుని చకచకా గదిలోంచి బెటికి వెళిపోయాడు.

మా బలరాం ఏంచెయ్యలేక నోరు వెళ్ళ పెట్టుకునిచూస్తూ ఉండిపోయాడు. రెండు మూడు నిమిషాలయాక కాని వాడికి ఒళ్లు తెలియలేదు. వాడు పెదఆవేశంతో వెంటనే వెళ్ళి తన ఆస్తిని తిరిగి హస్తగతం చేసుకుందామనే ఉద్దేశ్యంతో లేవబోయాడు. కాని ఎట్టఎదుట ఇంకొక వ్యక్తి ఆకారాన్ని చూసి చటుక్కున ఆగిపోయాడు.

ఆక్షణంలో భీమారావు ఉగ్రస్వరూపం మావాడికి ప్రత్యక్షమైంది. పట్టరానికోపంతో అతను ఆపాదమస్తకం కంపించిపోతూన్నట్టు స్పష్టంగా కనిపిస్తోంది. గగ్గయ్య పోలికకీ దొమ్మేటి పోలికకీ తోడు రంగారావుపోలిక కూడ మావాడికి భీమారావులో కనిపించింది.

అతనుగర్జిస్తూ “దుర్మార్గుడా, నాడిటెక్టివ్ నవల ఇస్తావా లేదా?” అన్నాడు.

మావాడు అతిప్రయత్నంతో తనలోని బుర్ఖుదిల్ నాన్ని అణచుకొని కలిగాడు. వాడేం ఎరగనివాడిలా ఏం చలించకుండా, “నవల ఏమిటి?” అని అడిగాడు.

“నా గదిలోంచి నువ్వెత్తుకుపోయిన “పప్పులో విషం””

““పప్పులో విషం” పోయిందా? ఆశ్చర్యంగా ఉందే!”

"ఇస్తావా లేదా?" భీమారావు మళ్ళీ గర్జించాడు.

"ఆఁ, ఇప్పుడు తెలిసింది - మురళీధర్ మీ పుస్తకం తీసి ఉంటాడు."

"అబద్ధం—శుద్ధ అబద్ధం."

"నిజం, నామాట నమ్మండి. నిస్సందేహంగా అతనే తీశాడు. నేను మీ గదిలోకి వస్తూండగా మురళీధర్ దొంగలా లోపలి నుంచి బయటికివస్తూ కనిపించాడు అదంతా ఎందుకు? అతనిగదికి వెళ్ళిచూస్తే తేలిపోతుందిగా ఎవరు తీసిందీనీ."

భీమారావుకి నమ్మకం కలగలేదు—"అసంభవం! అతను అంతనీచత్వానికి ఒడిగట్టే రకంకాదు. వేటలో పెద్దపులిని తుపాకితో కాల్చి చంపగల మురళీధర్ ఇటువంటి పని ఎన్నటికీ చెయ్యడు."

"అతని నీచత్వం మీకేం తెలుసు. అతనితో ఘనిష్ట పరిచయంవున్న నాబోటివాళ్లని ఎవర్నడిగినా చెప్తారు."

"వాసంతి నిస్తానని మాటకూడా ఇచ్చానే! సరే వెళ్ళిచూస్తే తేలిపోతుంది కదా. నీమాటే నిజమైతే ఇంక ఆ నీచుడికి నా పిల్లని..."

ఇద్దరూ మురళీధర్ గదికి వెళ్ళారు. గది కిటికీలోంచి వెలుతురు కనిపించింది. లోపల ఇన్‌స్పెక్టర్ మురళీధర్ పడుకునే "పప్పులో విషం" చదువుతున్నాడు.

భీమారావు ఛళ్లున తలుపులు తోసుకుని లోపలికి వచ్చేశాడు. మురళీధర్ దగ్గిరికి ఒక్క గంతేసి అతని చేతిలోంచి పుస్తకం లాగేసుకున్నాడు.

"ఇదా సంగతి?" భీమారావు ఉరిమాడు.

"ఇదా సంగతి?" మావాడు కూడా ఉరిమాడు.

"నా డిటెక్టివ్ నవలని దొంగిలించిన దొంగ!" భీమారావు రిమార్కు చేశాడు.

మురళీధర్ తెల్లబోయాడు. "మీ డిటెక్టివ్ నవలా?," అన్నాడు.

"బలరాంగారి నడిగి తెచ్చుకున్నాను." అని వివరించబోయాడు.

"ఎంత పచ్చి అబద్ధాలో చూశారా? నా పుస్తకం రైల్లోపోయిన సంగతి మీకు తెలుసు కనుక సరిపోయింది."

"ఇదిగో, అబ్బాయి — ఇంక అనవసరమైన మాటలతో మనకి పనిలేదు. నిన్ను పోయిన నాతోటి సహా పట్టుకున్నాను. ఒక ముఖ్యమైన సంగతి నీతో చెబుతున్నాను— ఇంత నీచత్వాని కొడిగట్టిన తర్వాతకూడ నీకు నేను పిల్లనిస్తానని ఆశ ఉంటే వెంటనే దాన్ని వదులుకో."

"పూర్తిగా మనస్సులోంచి తుడిచి పారేసుకోండి."

"కాని-ఒక్క సంగతి—".

"ఇంక నేనేం వినక్కర్లేదు. రా, బలరాం మనం వెడదాం" ఇద్దరూ వచ్చేస్తూండగా మావాడన్నాడు, "అమ్మయ్య! పెద్ద గండం తప్పిందికాదూ!"

"ఎవరికి?"

"ఇంకా ఎవరి కేమిటండి? మన వాసంతి కండీ ఇటువంటి నీచుడికి ఆమెని అంటగడితే ఏమయేదో ఆలోచించండి కొంచెం! మర్యాదగా బ్రతికే ఒక బాల రచయిత మీ. అమ్మాయికి భర్త కాబోతున్నాడన్న విషయం నిజంగా మీకు ఎంత ఆనందదాయకమో చూడండి."

భీమారావూ, మావాడూ సరిగ్గా మావాడి గది గుమ్మందాకా వచ్చారు. భీమారావు ఆగాడు! మావాడికేసి చూశాడు! కనుబొమలు కుంచించాడు.

"ఈ జరిగినదాని ఫలితంగా వాసంతిని నీకిస్తానని ఆశిస్తున్నావన్నమాట!"

"ఏం? ఇవ్వడం లేదా?"

"ఎంతమాత్రం లేదు."

మా బలరాంని హఠాత్తుగా ఏదో మొండి ధైర్యం ఆవహించింది. ఒక్కసారిగా అగ్గిరాముడైపోయాడు.

"అలాగా!" అని ఒకసారి హుంకరించాడు. చటుక్కున భీమారావు చేతిలోంచి "పప్పులో విషం" అతి విసురుగా లాక్కున్నాడు. వెంటనే తనగదిలోకి పరుగెత్తాడు. తలుపులు లోపల వేసుకుని గడియ బిగించేశాడు.

"ఇదిగో-బలరాం-"బైటినుంచి భీమారావు బ్రతిమాలుకోసాగాడు. తన చేతిలోంచి ఈ విధంగా "పప్పులో విషం" జారిపోవడం అతనికి చాలా నిరుత్సాహం కలగజేసింది.

లోపలినుంచి మావాడు సంతృప్తిగా అట్టహాసం చేశాడు. భీమారావుని ఎలాపడితే అలా ఆడించకలిగే స్థితిలో ఉన్నాడు వాడిప్పుడు.

"ఇదిగో-బలరాం, నా "పప్పులో విషం" నాకివ్వవూ?" భీమారావు బయటినుంచి ప్రాధేయపడుతున్నాడు.

"ఇచ్చేందు కెంత మాత్రం వీలులేదు. నేను చదవాలి. పత్రికలన్నీ అద్భుతమైన డిటెక్టివ్

పప్పులో విషం

నవలని పొగిడిపారేస్తున్నాయి, ఒక పత్రిక దీన్ని గురించి ఏం రాసిందో తెలుసా? "హృత్తంత్రుల్ని కదిల్చిపారేసే సన్నివేశాలు ప్రాణాల్ని స్తంభింపజేసే పరిశోధనలు"

తలుపు బయటనుంచి నిరాశా నిస్పృహలతో కూడిన నిట్టూర్పు మావాడికి వినిపించింది. వాడన్నాడు, "అయితే ఒకటి-మామగారూ మామగా రడుగుతేమాత్రం నేను లేదన లేను సుమండీ. ఆయనమాట నాకు వేద వాక్కు కాదూ?"

బయట ఒక క్షణంవరకు నిశ్శబ్దం. తర్వాత, "సరేలేవోయ్," భీమారావు గొంతు వినిపించింది.

"అంటే, నా కోరికని మన్నిస్తారన్న మాటే కదూ?"

"అన్నమాటే మరి."

మా బలరాం వెంటనే గడియతీశాడు.

"రండి, మామగారూ, "పప్పులో విషం" మనిద్దరం కలిసి చదువుదాం. నా గదిలో కూర్చుందాం, రండి."

భీమారావు ఇందాకటి షాక్ నుంచి ఇంకా సరిగా కోలుకోలేదు. "నేను ఈ నిర్ణయం విషయంలో ఏం పొరపడలేదనే అనుకుంటాను."

"మీరు పొరపడ్డమా? ఎంతమాట!"

"నువ్వు వాసంతికి అన్నివిధాలా తగిన భర్తగా ఉంటావనే నే నాశిస్తున్నాను."

"ఉత్తమమైన ఆదర్శ భర్తగా ఉంటా వనడంలో మీరేం అనుమానించక్కర్లేదు."

ఓడిపోయిన వాడిలా ముఖం పెడుతూ భీమారావు, "నువ్వు నిజంగా ఆదర్శ భర్తవుగా ఉండకపోయినా నిజానికి నేను చెయ్యగలిగిందేం లేదు. "పప్పులో విషం" చదవకుండా నేనీరాత్రి నిద్రపోవడమనేది కల్లోని వార్త. డిటెక్టివ్ సోమదత్ తలకాయలేని రాక్షసుడి గుహలో బంధించబడడం వరకూ చదివాను. ఆ తరవాత ఏం జరిగిందో తెలుసుకోలేకపోతే నాకు ఈ రాత్రి నిద్ర పట్టదు."

మా బలరాం ఉత్సాహాతిరేకంతో గట్టిగా అరిచాడు, "ఏమిటి? నిజంగా తలకాయలేని రాక్షసుడు వస్తాడా, ఇందులో?"

భీమారావు అన్నాడు, "ఇందులో తలకాయలులేని రాక్షసులు ఇద్దరు వస్తారు."

"ఆశ్చర్యంగా ఉందే! రండి-కూర్చోండి-దీన్ని వెంటనే పూర్తిచేస్తేగాని నామనస్సు స్థిమితపడదు."

"ఇస్తావా లేదా?" భీమారావు మళ్ళీ గర్జించాడు.

"ఆఁ, ఇప్పుడు తెలిసింది – మురళీధర్ మీ పుస్తకం తీసి ఉంటాడు."

"అబద్ధం—శుద్ధ అబద్ధం."

"నిజం, నామాట నమ్మండి. నిస్సందేహంగా అతనే తీశాడు. నేను మీ గదిలోకి వస్తూండగా మురళీధర్ దొంగలా లోపలి నుంచి బయటికివస్తూ కనిపించాడు అదంతా ఎందుకు? అతనిగదికి వెళ్లిచూస్తే తేలిపోతుందిగా ఎవరు తీసిందీనీ."

భీమారావుకి నమ్మకం కలగలేదు— "అసంభవం! అతను అంతనీచత్వానికి ఒడిగట్టే రకంకాదు. వేటలో పెద్దపులిని తుపాకితో కాల్చి చంపగల మురళీధర్ ఇటువంటి పని ఎన్నటికీ చెయ్యడు."

"అతని నీచత్వం మీకేం తెలుసు. అతనితో ఘనిష్ట పరిచయంవున్న నాబోటివాళ్లని ఎవర్నడిగినా చెప్తారు."

"వాసంతి నిస్తానని మాట కూడా ఇచ్చానే! సరే వెళ్ళిచూస్తే తేలిపోతుంది కదా. నీమాటే నిజమైతే ఇంక ఆ నీచుడికి నా పిల్లని..."

ఇద్దరూ మురళీధర్ గదికి వెళ్ళారు. గది కిటికీలోంచి వెలుతురు కనిపించింది. లోపల ఇన్స్పెక్టర్ మురళీధర్ పడుకునే "పప్పులో విషం" చదువుతున్నాడు.

భీమారావు భళ్ళున తలుపులు తోసుకుని లోపలికి వచ్చేశాడు. మురళీధర్ దగ్గిరికి ఒక్కగంతేసి అతని చేతిలోంచి పుస్తకం లాగేసుకున్నాడు.

"ఇదా సంగతి?" భీమారావు ఉరిమాడు.

"ఇదా సంగతి?" మావాడు కూడా ఉరిమాడు.

"నా డిటెక్టివ్ నవలని దొంగిలించిన దొంగ!" భీమారావు రిమార్కు చేశాడు.

మురళీధర్ తెల్లపోయాడు. "మీ డిటెక్టివ్ నవలా?," అన్నాడు.

"బలరాంగారి నడిగి తెచ్చుకున్నాను." అని వివరించబోయాడు.

"ఎంత పచ్చి అబద్ధాలో చూశారా? నా పుస్తకం రైల్లోపోయిన సంగతి మీకు తెలుసు కనుక సరిపోయింది."

"ఇదిగో, అబ్బాయి — ఇంక అనవసరమైన మాటలతో మనకి పనిలేదు. నిన్ను పోయిన సొత్తుతో సహా పట్టుకున్నాను. ఒక ముఖ్యమైన సంగతి నీతో చెబుతున్నాను— ఇంత నీచత్వాని కొడిగట్టిన తర్వాతకూడ నీకు నేను పిల్లనిస్తానని ఆశ ఉంటే వెంటనే దాన్ని వదులుకో."

"పూర్తిగా మనస్సులోంచి తుడిచి పారేసుకోండి."

"కాని–ఒక్క సంగతి—"

"ఇంక నేనేం వినక్కర్లేదు. రా, బలరాం మనం వెడదాం" ఇద్దరూ వచ్చేస్తూండగా మావాడన్నాడు, "అమ్మయ్య! పెద్ద గండం తప్పిందికాదూ!"

"ఎవరికి?"

"ఇంకా ఎవరి కేమిటండి? మన వాసంతి కండీ ఇటువంటి నీచుడికి ఆమెని అంటగడితే ఏ మయేదో ఆలోచించండి కొంచెం! మర్యాదగా బ్రతికే ఒక బాల రచయిత మీ అమ్మాయికి భర్త కాబోతున్నాడన్న విషయం నిజంగా మీకు ఎంత ఆనందదాయకమో చూడండి."

భీమారావూ, మావాడూ సరిగ్గా మావాడి గది గుమ్మందాకా వచ్చారు. భీమారావు ఆగాడు! మావాడికేసి చూశాడు! కనుబొమలు ముంచించాడు.

"ఈ జరిగినదాని ఫలితంగా వాసంతిని నీకిస్తానని ఆశిస్తున్నావన్న మాట!"

"ఏం? ఇవ్వడం లేదా?"

"ఎంతమాత్రం లేదు."

మా బలరాంని హఠాత్తుగా ఏదో మొండి ధైర్యం ఆవహించింది. ఒక్కసారిగా అగ్గిరాముడైపోయాడు.


"అలాగా!" అని ఒకసారి హుంకరించాడు. చటుక్కున భీమారావు చేతిలోంచి "పప్పులో విషం" అతి విసురుగా లాక్కున్నాడు. వెంటనే తనగదిలోకి పరుగెత్తాడు. తలుపులు లోపల వేసుకుని గడియ బిగించేశాడు.

"ఇదిగో–బలరాం–"బైటినుంచి భీమారావు బ్రతిమాలుకోసాగాడు. తన చేతిలోంచి ఈ విధంగా "పప్పులో విషం" జారిపోవడం అతనికి చాలా నిరుత్సాహం కలగజేసింది.

లోపలినుంచి మావాడు సంతృప్తిగా అట్టహాసం చేశాడు. భీమారావుని ఎలాపడితే అలా ఆడించగలిగే స్థితిలో ఉన్నాడు వాడిప్పుడు.

"ఇదిగో–బలరాం, నా "పప్పులో విషం" నాకివ్వవూ?" భీమారావు బయటినుంచి ప్రాధేయపడుతున్నాడు.

"ఇచ్చేందుకింత మాత్రం వీలులేదు. నేను చదవాలి. పత్రికలన్నీ అద్భుతమైన డిటెక్టివ్



పప్పులో విషం

నవలని పొగిడిపారేస్తున్నాయి, ఒక పత్రిక దీన్ని గురించి ఏం రాసిందో తెలుసా? "హృత్తంత్రుల్ని కదిల్చిపారేసే సన్నివేశాలు ప్రాణాల్ని స్తంభింపజేసే పరిశోధనలు"

తలుపు బయటినుంచి నిరాశా నిస్పృహలతో కూడిన నిట్టూర్పు మావాడికి వినిపించింది. వాడన్నాడు, "అయితే ఒకటి-మా కాబోయే మామగా రడుగుతేమాత్రం నేను లేదనలేను సుమండీ. ఆయనమాట నాకు వేదవాక్కు కాదూ?"

బయట ఒక క్షణంవరకు నిశ్శబ్దం. తర్వాత, "సరేలేవోయ్," భీమారావు గొంతు వినిపించింది.

"అంటే, నా కోరికని మన్నిస్తారన్నమాటే కదూ?"

"అన్నమాటే మరి."

మా బలరాం వెంటనే గడియతీశాడు.

"రండి, మామగారూ, "పప్పులో విషం" మనిద్దరం కలిసి చదువుదాం. నా గదిలో కూర్చుందాం, రండి."

భీమారావు ఇందాకటి షాక్ నుంచి ఇంకా సరిగా కోలుకోలేదు. "నేను ఈ నిర్ణయం విషయంలో ఏం పొరపడలేదనే అనుకుంటాను."

"మీరు పొరపడ్డమా? ఎంతమాట!"

"నువ్వు నాసంతికి అన్నివిధాలా తగిన భర్తగా ఉంటావనే నే నాశిస్తున్నాను."


"ఉత్తమమైన ఆదర్శ భర్తగా ఉంటాననడంలో మీరేం అనుమానించక్కర్లేదు."

ఓడిపోయిన వాడిలా ముఖం పెడుతూ భీమారావు, "నువ్వు నిజంగా ఆదర్శ భర్తవుగా ఉండకపోయినా నిజానికి నేను చెయ్యగలిగిందేంలేదు. "పప్పులో విషం" చదవకుండా నేనీరాత్రి నిద్రపోవడమనేది కల్లోని వార్త. డిటెక్టివ్ సోమదత్ తలకాయలేని రాక్షసుడి గుహలో బంధించబడడం వరకూ చదివాను. ఆ తరవాత ఏం జరిగిందో తెలుసుకోలేకపోతే నాకు ఈ రాత్రి నిద్రపట్టదు."

మా బలరాం ఉత్సాహాతిరేకంతో గట్టిగా అరిచాడు, "ఏమిటి? నిజంగా తలకాయలేని రాక్షసుడు వస్తాడా, ఇందులో?"

భీమారావు అన్నాడు, "ఇందులో తలకాయలులేని రాక్షసులు ఇద్దరు వస్తారు."

"ఆశ్చర్యంగా ఉందే! రండి-కూర్చోండి-దీన్ని వెంటనే పూర్తిచేస్తే గాని నామనస్సు స్థిమితపడదు."



[ఉ ద్యో గ ప ర్వం ను ం డి]

మ. సుతువాఁడై వినయంబు సేకొనక యేచొప్పం దగం జెప్ప గా
ధృతరాష్ట్రుం డవినీతిఁ జేసినను సంధింపంగ రా దంచు వే
గ తెగం బొఱకు తెంపు సేయునెడ లోకం బెల్ల మెచ్చం బ్రకా
శితధర్మస్థితి నొంది మా మనము నిశ్చింతంబు గాఁ జేయుమీ.

ఆ. ఇన్ని సంకటముల నిబ్భంగి నెంతయు, నొగులు చిత్తవృత్తి నొవ్వ దీర్ప
వెజ్జ వీవ కావె వేయేల యేగతి, నడపఁ దలఁచి తదియ నాకుఁ బ్రియము

వ. అని చెప్పి తలంచుకొని వెండియు నిట్లనియె.

క. నీవు సుయోధనుపాలికిఁ, బోవఁగ వలదనియు నొక్కబుద్ధి వొడమెడుఁ
గోవింద యతఁడు మంత్రులుఁ, గావరములు చక్క వినరు కార్యవచనముల్.

తే. కుటిలమతు లవినీతులుఁ, గ్రూరకర్ము, లట్టి నీచులకడకు ని న్ననుపఁ జా
నివు సంకటపడియెదు దేవపదవి, యైన నే నొల్ల నొంటి యం దరుగు టుడుగు.

చ. అనవుడుఁ గృష్ణుఁ డిట్లనియె నా ధృతరాష్ట్రుఁడు నట్టివాఁడ త
త్తనయుఁడ యేల నీపలుకు తథ్యము నితలఁ పే నెఱింగితి
న్మనమున శంక దక్కుము వినర్ వలతే విను మేను నిక్క మ
ల్గిన నచటం గలండె రణకేళిని మార్కొన నొక్కఁ డేనియున్.

క. పనుపుము కౌరవసభ కేఁ, జను టెల్లను మేల యర్థసంసిద్ధి యగుఁ
మన కొకటం బాపము రా, కునికిఁ గత మైనపలుకులొండెను గలుగున్.

వ. అని పలికిన యుధిష్ఠిరుం డిట్లనియె.

ఆ. మేలు గాక నీకుఁ బోలినట్లయిన నం, దరిగి యేము వారు నర్థిఁ బొంది
యుందునట్లు గాఁగ నొడఁబాటు గావింపు, మెల్లభంగి మనకు నిదియ లెస్స.

క. మ మ్మెఱుఁగు దెదిరి నెఱుఁగుదు, నెమ్మి యెఱుఁగు దర్థసిద్ధినెఱి యెఱుఁగుదు వా
క్యమ్ముల పద్ధతి నెఱుఁగుదు, వా మ్మెవ్వఁడ నేను నీకు బుద్ధులు సెప్పన్.

కృష్ణుఁడు ధర్మరాజుతోఁ గౌరవుల దుర్నయంబు సెప్పుట

సీ. అనిన ముకుందుఁ డిట్లనియె సంజయుని మాటలును నివన్న పల్కులును వింట
నీమది ధర్మైకనిష్ఠమై యున్నది వైరంబు విడువరు వారు ద్రోణ
భీష్ములు గల రని బిరుదులై యున్నవా రగుటని రాజన్యుల కడఁగి కుడువ
నక్లేశవృత్తి రాజ్యము చవి గొన్నవా రేల యిత్తురు నీకుఁ బాలు సెపుమ

తే. ధార్తరాష్ట్రులు నడికి నధర్మమునకు, నలుక రెన్నఁడు విడువు దైన్యంబు పొడువు
కయ్య మరివర్గజయమునఁ గలుగు నిహప, రములుఁ జిరకీర్తియును పాండురాజ తనయ.

మ. గురుభీష్మాదులు సూచుచుండ సభ మీకుం గీడు నాఁ డట్లు ము
ష్కరులై చేసిరి యంత సేసియును బశ్చాత్తాపముం బొంద రో
శర వారెన్నఁడు నట్టిచోటఁ గృపయుం బంధుత్వముం దక్కు నె
వ్వరు గోపింపరె యా దురాత్మకుల గర్వక్రౌర్యముల్ సూచినన్.

వ. కపటపు నెత్తంబు నెపంబుగా మిమ్ము వెడలనడచునప్పుడు దుర్యోధన దుశ్శాసన శకుని సూతనందనులు పుయిలోట దక్క కలకల నవ్వుచుం బలికినపలుకు లుగ్గడింపవచ్చునే వాని విని సమస్తజనంబులు ధృతరాష్ట్రు నిందించుచు మీరు బలవంతులరయి యుండియు సత్యంబు పాటించి యూరకపోక సూచి యచ్చెరువాటుతో నుమ్మలించుచుండిరి తిట్టువాట్లం బోయెడువారు దైవోపహతులై మున్న చెడియుండుదురు గావున వారలం జెఱుపనుం జాలుకన క్రూరాత్ములగు కౌరవు లెల్లవారికి వధ్యులు గాఁ దగుదురు నీ కేల యవధ్యులైరి పాపాత్మకు లగు హింసకులం బాముల నెట్లట్ల నిర్విచారంబుగా వధియించుట కర్తవ్యంబు.

క. మీతండ్రికి భీష్మునకుం, జేతోముద మొదవ భక్తి సేయున తగు నీ
కాతలకు నేనుఁ జని వి, ఖ్యాతంబుగ నీదు వినయ మభివర్ణింతున్.

క. చెలులుం జుట్టలు దేశం, బులరాజులు వినఁగ నీదు పుణ్యచరిత్రం
బులు నీవు ధర్మమార్గము, దలఁచుటయుం దెలియఁ బలికెదం గురుసభలోన్.

వ. దానికి దుర్యోధనుం డియ్యకొనక తెఱంగుమాలిన మాటలాడుటయుఁ దండ్రి యతని వారింప నేరమికిఁ దోడుపేక్షకుం దగుటయుఁ జూచి మీ తొల్లింటిపాట్లునుం దలంచి యెల్లవారును వారిన గర్హింతు రింతియ కాక మనకు నొందేమి వలయు నాయోపినంతయుఁ బెక్కుభంగుల సంధియ గావింపం జూచెద నవ్విధంబు సిద్ధించిన మేలు గాదే యట్లుగాక తక్కిన నచ్చోటి యుత్సాహంబుచందంబును నందుఁ జేయం గలవారి వర్తనంబులుఁ గొలందులు నెఱింగి నీకు విజయం బగువిధంబునం జనుదెంచెద.

తే. ఆ సుయోధనుముక్కున నావి గలుగఁ, బుడమి నీ కీఁడు గావునఁ బోర కలుగు
నేను గయ్యపుశకునంబు లెన్నియేనిఁ, గంటి నీ వనుత్సాహివి గాఁగ వలదు.

వ, చతురంగబలంబుల నాయితంబు గావించుచు దొరలం బురికొల్పికొనుచు నాలస్యంబు లేక సమరంబునకు సన్నాహంబు సేయుచుండవలయు నని పలికిన విని వృకోదరుండు దామోదరున కి ట్లనియె.

క. సమరంబు గలుగు ననుచును, మము వెఱపింపంగ వలదు మాధవ నీ వా
కుమతి యగు ధార్తరాష్ట్రుఁడు, శమించు కార్యంబు నడపు సౌజన్యమునన్.

వ. అని వెండియు.

శా. పాపాత్ముండు మదాంధుఁ డాతులువ నీపం పెట్లునుం జేయఁగా
నోపం డడ్డము సెప్ప రెవ్వరును మానోద్రేకముం గర్వముం
గోపంబుం దనుఁ ద్రిప్ప నాప్తజనులం గుందించుటం బోయిన
ట్లే పో నిత్తురు గాన నిన్నతఁడు జాలిం బెట్టెడుం జూడుమీ

ఉ. చొచ్చిన చోన చొచ్చి తెగఁజూచెద నంచుఁ గడంగుచుండు న
స్మచ్చఁడు బాహుగర్వమున నీచు సుయోధనుఁ డట్టివానితోఁ
బొచ్చెము లేక కూడి మనఁ బోవక పోవఁగ రాదు నాకు వి
వ్వచ్చుఁడు రాచవారుఁ గురువంశముచేటున కోపకుండుటన్.

ఉ. పాండవకౌరవుల్ గలసి పాలును నీరును బోలె నెమ్మిమై
నుండఁగఁ దుష్టచేష్టల సుయోధనుఁ డింతలు సేసె నాతఁ డొ
క్కండ కులక్షయంబునకుఁ గారణ మండ్రది దప్పదైన ని
వొండన నేల యాబిరుదు నోపినయంతయు, దీర్పు నేర్పునన్.

చ. తన పౌరిపోవునంతకు నుదగ్రతయుం గపటంబు మాన నే
ర్చునె ధృతరాష్ట్రసూనుఁడు యశోభరితం బగు భారతాన్వయం

బున కొక నింద వచ్చు ననుబుద్ధి దురాత్మున కేల కల్గు నా
యన మెయిఁబోయి హీనగతి నైన ఘటించిన నెంత యొప్పవో.

వ. మాకును వారికిఁ బితామహుం డగు భీష్ముండు వినుచుండ సుయోధనుతోడం గురుకులేశ్వరు నా స్థానంబున నావత నంబులుగా నిట్లనుము.

తే. అన్నదమ్ములమై యుండి యకట మనల
నొరులు దలయెత్తి చూడ నొండొరులతోడఁ
బెనఁగ నేటికి నీ నేల పెద్దవారి
బుద్ధి విని పంచి కుడుచుట పోలదొక్కొ.

క. అని యెవ్విధమున నైనను, వనజోదర సంధి సేయ వలయుఁ దగఁ జే
మును వారును గలయుట భూ, జనులకు నెల్లను హితంబు సౌఖ్యకరంబున్.

చ. అనుటయుఁ బిన్ననవ్వు నగి యంబుజనాభుఁడు పల్కె నెన్నఁడున్
విననివి భీముపాలఁ గడు వింతలు వింటిమి మాట లగ్గి చ
ల్ల నగుట భూరిభూధరము లాఘవ మొందుట గాదె యివ్విధం
బున నితఁ డిష్టు మార్దవముఁ బొందుట యింకిటఁ జెప్ప నేటికిన్.

శ్రీ కృష్ణుఁడు భీమసేనునిఁ గౌరవులతోడి యుద్ధమునకుఁ బురికొల్పుట

తే అని సహోదరు లాజి నాయాసపడుట
కోర్వమియుఁ గౌరవులఁ జంప నొల్లమియును
గలుగు నెయ్యంబు పెంపునఁ గరుణ నార్ద్రుఁ
డైన పవనజుఁ బురికొల్ప నాత్మఁ దలఁచి.

వ. మురమర్దనుం డతనితో ని ట్లనియె.

ఉ. యుద్ధముమీఁది వేడ్కయు మహోగ్రవిరోధుల నల్కఁ జేయు ద
ర్పోద్ధతియున్ సుయోధనుని యున్నతి సైఁపనియేపు రాజ్యసం
సిద్ధి నిజాగ్రజన్మునకుఁ జేయుతలంపును గల్గు నీ వనం
బద్ధములైన వాక్యములు పల్కుట యొప్పునె కీచకాంతకా.

వ. అని యంత నిలువక.

క. వెఱ పెట్టిదియో యెన్నఁడు, నెఱుఁగని నీయట్టివాని కెవ్వరొకో యీ
పిఱికితన మింత యలవడఁ, గఱపినవా రనుచు శౌరి గలకల నవ్వెన్.

వ దానికి దరహసితవదనుం డగుచు భీమసేనుండు వసుదేవసూనున కి ట్లనియె.

ఉ. బంటుతనంబు మాటలకుఁ బొఱకు పాండునృపాలుపాలు నై
కొంటయ చాలు నన్న నృపకుంజరుపల్కుల కడ్డ మాడ రా
కుంట యెఱుంగవే మును సుయోధనుచందముఁ జూపి యప్ప డే
మంటి యుపేంద్ర నన్ని రణాగ్రమునన్ నిను మూదలించెదన్.

క. నాకొలఁది విచారింపక, నీ కి ట్లనఁ దగునె మిన్ను నేలయు నిమ్మెఁ
గాక తిరుగంగఁ బడినం, బోకే ముంజేతు లొడ్డి పోవఁగఁ ద్రోతున్.

ఉ. నావుడు నవ్వుటాల కనినం బవనాత్మజ యింత యేటికిం
గేవలయోధవే పరులకిల్బిషముల్ దలపోయ కిమ్మెయిన్
జావడ మైనఁ జూచి యిది చందము గాదని యంటిఁ గాక నీ
చేవయు లావు నీవు మును చేసినభంగులు నే నెఱుంగనే.

వ. అని చెప్పి మాధవుండు మఱియును.

ఉ. పార్థుఁడు పోరఁ దేరు గడపం దనకున్ ననుఁగోరి యెంతయుం
బ్రార్థన సేసి దాని కనురాగము వొందితి నేను గాన యు
ద్ధార్థుల మైన మాకు నిను నానపడం దగదే యశంబు నా
నార్థములున్ విరోధివిజయంబునఁ దక్కఁగ నొంటఁ గల్గునే.

వ అనవుడు.

శా. ఏమీ పార్థుఁడు నీవు దండిమగలై యీవచ్చు కౌరవ్యసం
గ్రామక్షోభము బాహుదర్పమునఁ దీర్పం బెద్దమిట్టెక్కి మి
మ్మే మెల్లన్ వెఱఁ గంది చూచెదము గా కీసారెకుం బోయి రా
భీముం డిత్తఱి రిత్తమాటలకుఁ గోపింపండు సూ పెంపఱన్.

వ. అని పలికి యివ్విధంబున గోపాలదేవు మేలంపు మెయివడి కార్యవచనంబులకుం దగం దానును దోర్త్రో సరసం బాడుటయ కా మఱుమాట లాడి యంతటఁ దనివోవక బకమర్దనుం డతనితో ని ట్లనియె.

ఉ. కయ్యము గల్గి న ట్లయిన గంధగజప్రకరంబుకుంభముల్
వ్రయ్యఁ దురంగపంక్తులు ధరం బడఁ దేరిగముల్ బడల్పడన్
డయ్యమి కీవు వెక్కసపడన్ గదపండువు సేయఁ గోరునా
దయ్యము నెత్తికోలు దుది దాఁకుట గాదె భుజంగభంజనా.

చ. అన విని దేవకీతనయుఁ డాతని కి ట్లనుఁ జెప్పెనంతకం
టెను మిగులంగఁ జేయుదు గడిందిమగండవు నిన్నుఁ దెప్పగాఁ
గొని బలుమాఱు నాపదలకున్ భయ మొందక దుఃఖవార్ధి లీఁ
దిన మము నెల్ల నిక్కాఁఅఁత దీర్చి సుఖాత్ములఁ జేయు పావని.

క. ఇదె పోయెదఁ గౌరవ్యులఁ, బదనికి రాఁ బలికి సంధి వాటించెద నా
కది యొప్పదె కాని తుదిం, గుదు రింతకు నీవ కావె గుణరత్ననిధీ.

అర్జునుఁడు శ్రీకృష్ణునితోఁ దన యభిప్రాయంబు సెప్పుట

వ అనిన వాసుదేవున కర్జునుం డి ట్లనియె.

తే. చెప్పఁ గలయంతవట్టును జెప్పె, నీ క,జాతశత్రుండు వింటి వీ వా తెఱంగు
మాకు నెల్లను బలుకంగ మాట లొండు, గలవె యైనను జెప్పెదఁ గన్నయంత.

మ. ధృతరాష్ట్రుం డతిలోభదూషితుఁడు ధాత్రీభాగ మీ నేర్చునే
సుతుఁడుం గష్టుఁడు సంధియేల యగు సంచున్ మున్న కై పెక్కస
ట్టి తలం పచ్యుత నీకు గల్గినది గాండీవంబు దివ్యాస్త్రసం
తతియుం బెట్టినయట్ల యుండ మముఁ జింతం బావ రాదో కదే.

ఉ. నీ వొనరింపఁ బూనినపనిం గమలోదర కీడు వుట్టునే
కా వనిసట్ల యుండి యవుఁ గార్యము ల ట్లగుటం బ్రయత్న సం
భావన సేఁత పౌరుషముపద్ధతి తత్ఫలసిద్ధి వొందుచో
దైవము దోడ్పడన్ వలయుఁ దథ్యము రెండును నీ వినోదముల్.

ఉ. వేరిమి ధర్మజుం బరిభవించిన ద్రోహులు వధ్యు లన్న నె
వ్వారికిఁ బోలదే సుజనవత్సల నీ విటులంట వారు మ
మ్మారస మెత్తి కీడ్పఱిచి యింతలు సేసినదాన నీమదిం
గూరిన నొవ్వుసొంపునను గోపము పెంపునఁ గాదె యారయన్.

సినిమా

★ సినీ పనివారి శ్రేయోభివృద్ధికి... ★

చలనచిత్ర పరిశ్రమలో పనిచేస్తున్న వారి బాగోగులు విచారించి, వారి పరిస్థితులను చక్కబెట్టే విషయమై ప్రభుత్వం శ్రద్ధతీసుకుని, అందుకు తగు ప్రయత్నాలు చేయడం అవసరమని గత సోమవారం నాడు మద్రాసులో జరిగిన సినీ టెక్నీషియన్ల మహాసభలో తీర్మానం చేశారు. ఇందుకై ప్రభుత్వం ఒక విచారణ సంఘాన్ని నెలకొల్పాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం ప్రారంభమైన మహాసభలు సోమవారం సాయంత్రం ముగిశాయి. ఆఖరుసభకు, మద్రాసు ఆర్థిక విద్యాశాఖల మంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు.

ప్రభుత్వానికి పెద్ద ఎత్తున పన్నులు వచ్చే వాటిలో ఫిలిం పరిశ్రమ ఒకటి కాబట్టి, దాని క్షేమస్సుపట్ల, పురోభివృద్ధి పట్ల, ప్రభుత్వం సహజంగానే శ్రద్ధ తీసుకుంటుందని మంత్రి అన్నారు. ఈనాడు ఈ పరిశ్రమకు కావలసిన పరికరాల్లో, ముఖ్యమైన ముడి ఫిల్ము ఇక్కడ తయారుకానందువల్ల నూటికి 90 పాళ్ళు విదేశాలనుండి దిగుమతి చేసుకోవలసి వస్తున్నదనీ, ఇంత పెద్ద పరిశ్రమ ఈ స్థితిలో ఉండడం శోచనీయమనీ, కేంద్ర ప్రభుత్వం ఫిలింపరికరాల, ముడిఫిలిం ఫ్యాక్టరీలు త్వరగా నెలకొల్పడానికి ఏర్పాటులు చేస్తుందని ఆశిస్తున్నామనీ, మంత్రి సుబ్రహ్మణ్యం గారు అన్నారు.

మహాసభకూడా ఈ విషయమై కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తిచేస్తూ తీర్మానాలు ఆమోదించింది.


* * *

వీటిలో మరొక ముఖ్యాంశం విదేశీ నిర్మాతలు మనదేశంలో చిత్రం తీసినపుడు ఇక్కడి టెక్నీషియన్లనే నియమించాలన్న షరతు ప్రవేశపెట్టాలన్నది.

నిజానికి ఈనాడు మన టెక్నీషియన్లు ఇతర దేశాలవారికి తీసిపోమని ఋజువు చేసుకొన్నారు. అంతగా 'ప్రత్యేక ప్రవీణులే

(34- వ పేజీ చూడండి)

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్‌వారి 'వీరప్రతాప్'లో పద్మిని, శివాజీ గణేశన్.



చిత్రసమీక్ష

ఈగిల్ ఫిలింస్‌వారి 'ముజ్రిమ్'

విరహోత్కంఠిత ఒక్కొ విధపువంటి విన్యాసాలు పోగుచేసి కూర్చిన నృత్యాలు, 'ముజ్రిమ్' (ఈగిల్ ఫిలింస్) చిత్రంలో ముఖ్యాకర్షణ. నృత్యాలను సోహన్‌లాల్, హీరాలాల్ కూర్చారు. రాగిణి, పద్మిని, గీతాబాలి ప్రదర్శించారు. నేపథ్యగీతాలను గీతారాయ్, ఆశాభోంస్లే, రఫీ పాడారు. ఎటొచ్చీ సంగీత దర్శకుడు ఓ. పి. నయ్యర్ వాళ్ళచేత దాదాపు పాతపల్లవులనే (ఏమంత బాగుండనివి) పాడించాడు. అవి ఓ మోస్తరుగా ఉన్నా, ఒకటి రెండు చాలా బాగున్నా ఆ ప్రజ్ఞ పాడినవాళ్ళది.

ఇవన్నీ కాక, రాగిణి, పద్మిని బృందం చేసిన భాంగ్రా డాన్సు, ప్రత్యేకాకర్షణ. రాగిణి నృత్యాలు కొన్నిటికి స్టుడియో సెట్లు ఏర్పాటు చేసినా కొన్నిటికి ఆ అవధులు దాటి ఔట్‌డోర్‌లో కొండచరియల మీద, వనాలలోనూ తీశారు. అక్కడ కూడా భువీ దివీ కూడా చాలవన్నంత చైతన్యంతో, ఆ ప్రదేశపు సరిద్దులను దాటిన ఉత్సాహంతో, రాగిణి డాన్సు చేసింది. (శివరాం మాలవీయ) కెమెరా కూడా ఆమెతో సమానంగా నర్తించి, కొన్ని మనోహరమైన దృశ్యాలను వెండితెరమీద వెలిగించింది. అలాగే గీతాబాలి, రెండు డజన్ల 'ఆర్కెస్ట్రాలూ' చేసిన డాన్సువంగులు, దానికి ఆలంబనంగా గీతారాయ్, నయ్యర్ల సెక్సపీల్ కంఠ, స్వరాలూకలిసి ఎక్స్ట్రార్డినరీ డాన్సుగా రూపు ధరించాయి ఇదంతా నాలుగైదేళ్లుగా హాలీవుడ్ నుండి బొంబాయికి దిగుమతి అవుతున్న "కల్చరల్ ఇంపోర్ట్" (!)ఫలితం.


మొత్తంమీద 'ముజ్రిం' సంగీత నృత్య ప్రధానచిత్రం.

ఇది కాక, ఇందులో కొన్ని అమెరికన్ క్రైమ్ పిక్చర్ సన్నివేశాలూ, వాటితోపాటు హాలీవుడ్ చప్పట్లూ, పోలీసు మోటారుసైకిళ్లూ జీపులూగట్రా ఉన్నాయి. ఇవన్నీ కాక, ఒక సినీ నీతికథకూడా ఉంది. కొస్త జానీవాకర్, ఒక్కరవ్వ 'టున్‌టున్' ఉన్నారు.

ఇదీకంకర (షమ్మీకపూర్) అనే ఒక దొంగ కథ. అతను నగలూ అవీ దొంగిలించే చిన్నరకం ఆసామి. అయినా హాలీవుడ్ సినిమాలు చాలా చూసినందువల్ల, పెద్దపెద్ద దోపిడీలు, ఖూనీలూ చేసినవాళ్లకిమల్లె పోజులు పెడతాడు. నయ్యర్ నేపథ్యవాద్య సంగీతం, పోలీసు ఇన్‌స్పెక్టరు కమల్‌కపూర్, ఇతన్ని పెద్దదొంగగా పరిగణించి శ్రద్ధగా తరమడం మొదలైన కారణాలవల్ల మరీ రెచ్చిపోతాడు పోజుల్లో. అదృష్టవశాత్తూ, ఖూనీ చెయ్యక

(30-వ పేజీ చూడండి)

కాశీనాథ్ ప్రొడక్షన్స్‌వారి 'రామాంజనేయ యుద్ధం'లో శ్రీరాముడుగా అమర్‌నాథ్, సీతగా శ్రీరంజని.





సంగీతా ప్రొడక్షన్స్‌వారి 'ఇంటిగ

ఉత్తమ డాక్యు

★ నాగార్జు

సాటి దేశాలవారికి సగర్వంగా చూపించుకోతగ డాక్యుమెంటరీ చిత్రం ఒకటి మొన్న మద్రాసులో విడుదల అయింది. 18వందల ఏళ్ళనాడు ఆసియా అంతటికీ బౌద్ధ ధర్మనిలయంగా, విద్యాపీఠంగా, లలితకళాలయంగా కృష్ణానదీ తీరాన విలసిల్లిన నాగార్జున క్షేత్రానికి ఈ చిత్రం నీరాజనం.

బుద్ధ భగవానుడి కథను శిల్ప, చిత్రాల మీదుగా చెబుతూ 1956లో బిమల్ రాయ్ తీసిన "గౌతమబుద్ధ" చిత్రానికి ఉపసంహార వాక్యం అనతగ్గ చిత్రకావ్యంగా ఇప్పుడిది రూపొందింది. అది, తథాగతుడి కథ. సంక్షుభిత వసుధకు ఆయన ప్రసాదించిన సుధ. "వర్తమాన మానవ గాధ, మంచిదారినపడి నడవడానికి, ఈ నాడు బుద్ధ సంస్మరణ ఆగత్యము" అని జయంత్యుత్సవాల వేళ పెద్దలు



చిత్రంలో రామారావు, సావిత్రి.

టరీ చిత్రం

కొండ ★

ఖ. రాజ్ హంస్ ఖన్నా దర్శ
తయారైన బిమల్ రాయ్ చిత్రం
బుద్ధ' సామాన్య ప్రేక్షకులతో పాటు
ద్దలను కూడా ముగ్ధుల్ని చేసింది. అం
ల్పచిత్రాలకు సలీల్ చౌదరి సంగీతం
సందర్భాలలో విపరీత 'రీతు'లు
, బర్కిలీహిల్ కథనంతో డై, గౌత
ను వర్తమానంలోకి తెచ్చాయి; లేదా
వాన్ని గతంలోకి తీసుకువెళ్లేయి.
వా, ప్రేక్షకులను సమ్మోహితులను
టికీ నేటికీ మధ్య వ య్యేళ్ల వడ
న్న పరిహద్దును తుణకాలంపాటు
యి. వైదిక ధర్మ నిలయం
సిలో బుద్ధుని ధర్మావిష్కరణంతో
ద్దం, ఈనాడు మాతృదేశంలో
(55-వ పేజీ చూడండి)

సినిమా వార్తలు

ఒంగోలు కాలేజికి భానుమతి విరాళం

ఒంగోలు సి. ఎస్. ఆర్. శర్మ కళాశాలకు, దర్శకనిర్మాత శ్రీ పి. ఎస్. రామకృష్ణ, నటి, రచయిత్రి శ్రీమతి భానుమతి పదివేల రూపాయలు విరాళం ఇచ్చారు.

కళాశాలలో 'సైన్సుహాల్' నిర్మాణానికి ఈ మొత్తాన్ని వినియోగించవలసిందని సూచించారు.

కళాశాల పాలకవర్గం గతవారం సమావేశమై, రామకృష్ణ దంపతులకు కృతజ్ఞత తెలుపుతూ తీర్మానించారు.

కొత్తగాకట్టే సైన్సు హాలుకు, భానుమతి తండ్రి కీ. శే. బొమ్మరాజు వెంకట సుబ్బయ్యగారి పేరు పెడతారు.

కొంతకాలంక్రితం మద్రాసు కేసరి విద్యాలయానికి రామకృష్ణ దంపతులు నాలుగువేలు విరాళం ఇవ్వడం విదితమే. ★

* * *

అన్నపూర్ణావారి కొత్త చిత్రం నిర్మిత కార్యక్రమం ప్రకాశం చురుకుగా తయారవుతోంది. నాగేశ్వరరావు, సావిత్రి, రంగారావు, కన్నాంబ, రేలంగి, సూర్యకాంతం, రాజసులోచన, రమణమూర్తి, రాధిక మొదలుకువారు నటిస్తున్న ఈ చిత్రానికి ఆదుర్తి సుబ్బారావు దర్శకుడు. మాటలు ఆత్రేయ వ్రాశారు. పాటలు శ్రీశ్రీ ఆత్రేయ కొసరాజు వ్రాశారు. సంగీత దర్శకుడు వేణు.

వీరప్రతాప్

ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి 'వీరప్రతాప్' ఏప్రిల్ రెండో వారంలో విడుదల కాగలదనుకుంటున్నారు. శివాజీ గణేశన్, తంగవేలు, నంబియార్, పద్మిని, కన్నాంబ, రాగిణి, హెలెన్ మొదలుకువారు ఇందులో పాల్గొన్నారు. దర్శకుడు తాతినేని ప్రకాశరావు. మాటలూ పాటలూ శ్రీ శ్రీ వ్రాశారు. సంగీత దర్శకుడు టి. చలపతిరావు.


'రామాంజనేయ యుద్ధం'

కాశీనాథ్ ప్రొడక్షన్సు వారి పౌరాణికం 'రామాంజనేయ యుద్ధం' చురుకుగా తయారవుతోంది. ఏప్రిల్ నాలుగోవారంలో విడుదల కావచ్చును. గౌరీనాథశాస్త్రి మృతివల్ల ఇందులో ఆంజనేయపాత్రను, నటుడు రాజనాలకు ఒప్పగించారు. సీతారాములుగా శ్రీరంజని, అమర్‌నాథ్, నటిస్తున్నారు. ఇతర నటులు ముక్కామల, సూరిబాబు, రఘురామయ్య, కె. వి. ఎస్. శర్మ, కాంతారావు, సూర్యనారాయణ, శంగర, మిక్కిలినేని, సంధ్య, పి. హేమలత, దేవి చంద్రకళ. దర్శకుడు ఎస్. ఎస్. ఆచార్య, రచయిత కొవ్వలి. సంగీతం జంధ్యాల లక్ష్మీనారాయణ.

అప్పుచేసి పప్పుకూడు

విజయావారి హాస్య ప్రధాన చిత్రం 'అప్పుచేసి పప్పుకూడు' కూడా ఏప్రిల్ లోనే విడుదల కాగలదని తెలుస్తుంది. ఎల్. వి. ప్రసాద్ దర్శకత్వాన తయారైన ఈ చిత్రంలో సావిత్రి, జమున, గిరిజ, రామారావు, రంగారావు, రేలంగి, జగ్గయ్య, సి. యస్. ఆర్., శివరావు, మొదలుకువారు నటించారు. సంగీతం ఘంటసాల. ★

'మహాభినిష్క్రమణం'... నాగార్జునకొండవద్ద త్రవ్వకాలలో దొరికిన శిల్పం





'రాగిణి' చిత్రంలో పద్మిని, అశోక్‌కుమార్

సినిమా వార్తలు

శ్రీ శారదా ప్రొడక్షన్స్‌వారి 'జయభేరి' పుల్లయ్యగారి దర్శకత్వాన విజయా లో తయారవుతోంది. నటవరం నాగేశ్వరరావు, అంజలీదేవి, నాగయ్య, రేలంగి. రచయిత మల్లాది రామకృష్ణశాస్త్రి. సంగీతం పెండ్యాల.

రాజనందిని

శాస్త్రిగారు మాటలూ పాటలూ రాస్తున్న మరో చిత్రం జలరుహావారి 'రాజనందిని' ఇందులో రామారావు, అంజలీదేవి నటిస్తున్నారు. సంగీతం టి. వి. రాజు. దర్శకుడు వేదాంతం రాఘవయ్య.

ఇంటిగుట్టు

సంగీతా ప్రొడక్షన్స్ వారి 'ఇంటిగుట్టు' అగ్రశేణి తారాగణంతో తయారవుతోంది. ముఖ్యులు రామారావు, రేలంగి, గుమ్మడి అర్. నాగేశ్వరరావు, సావిత్రి, పుష్పవల్లి, సూర్యకాంతం. రచన మల్లాది రామకృష్ణశాస్త్రి. సంగీతం ఎం. ఎస్. ప్రకాష్. దర్శకుడు వేదాంతం రాఘవయ్య.

రాజమకుటం

వాహినీవారి ద్విభాషా జానపద చిత్రం 'రాజమకుటం' బి. ఎన్. రెడ్డిగారి దర్శకత్వాన వాహినీలో తయారవుతోంది. రామారావు, రాజసులోచన, గుమ్మడి, రాజనాల, పద్మనాభం పాల్గొంటున్నారు. రచన డి. వరస రాజు. సంగీతం వేణు.

'ముజ్రిమ్'

పోయినా, చేశాడనిపించే సన్నివేశంలో పాల్గొని, చచ్చిపోయిన ఒక నాటకరచయిత ఆనంద్ లాగూ, డైలాగూ తను పుచ్చుకుని ఊరిమీదపడతాడు. తను డాకూ శంకర్‌గా ఉన్నపుడు వర్తకి ఉమను ప్రేమిస్తాడు. ఆనంద్ అవతారం ధరించాక, అతగాడి ప్రేయసి (సుభాఖోటే)ని కూడా అవసరం కొద్దీ భరించాల్సివస్తుంది. ఇలా వాళ్లతో డాన్సులు చేస్తూచేస్తూ 14 వేల అడుగులు బద్ధకంగా కాలక్షేపంచేసి, చివరికి దొరికిపోయి కోర్టులో నిలబడి సంఘాన్ని మొహంవాచేలా చివాట్లేసి చక్కాపోతాడు విధిలోకి. ఇదీ కథ. నేరస్థులు సంఘాన్ని కొప్పడితే, ఖైదు చెసద ఉండదు. ఇది నీతి.

*　　*　　*

దానిరీతి : 'జో కుఛ్ తుం దేఖ్ తీహో వో సచ్ హై; మగర్ జో కుఛ్ తుం సమఝ్‌తీ హో, వో సచ్ నై' అంటాడు 'ముజ్రిమ్' (దోషి) శంకర్; కినిసిన ప్రేయసి ఉమ (రాగిణి)ను సముదాయిస్తూ.

ఆ అమ్మాయీ ఇతనూ హృదయాలు పరటా ఇచ్చుకున్నారు. అయినా, కొన్ని తప్పనిసరి పరిస్థితులవల్ల అతను ఇంకో అమ్మాయి (సుభాఖోటే)తో కూడా ఒకటీ అరా డ్యూయెట్లు పాడి, 'అంఖేఁ మే అంఖేఁ' పెట్టి, ప్రేమసంభాషణకు, తన తొలి ప్రియురాలు దూషణకు పడికడతాడు. వర్తకి ఉమ అతనిచేతలు లాంగ్ షాట్‌లో చూసి, మాటలు క్లోజప్‌లో విని అలిగి వెళ్ళిపోతుంది.

'నువ్వుచూచినది నిజమేకాని దానిని బట్టి అర్థం చేసుకున్నది తప్పు' అని అతడు సంజాయిషీ ఇస్తే ఆమె సరేనని ఇంకో మంచి పాటపాడి డాన్సుచేస్తుంది.

వలచి వలపించుకున్న పిల్లకాబట్టి ఆమె, అతన్ని అర్థంచేసుకున్నా అపార్థంచేసుకున్నా ఎవరు ఏమీ అనరాదు. అది వాళ్ళ సొంత వ్యవహారం.

అయితే ముజ్రింశంకర్ ఈ సూత్రాన్నే శిక్షాస్మృతికి కూడా పట్టించమనడం ఈగిల్ ఫిలింస్‌వారి ముజ్రిమ్ కోర్టులో జడ్జిగారు ఈ ఊహా భేషుగా ఉందని మెచ్చుకుని సమాజం తరఫున అతనికి క్షమాపణ చెప్పుకోడంమటుకు భేషుగ్గా లేదు.

ఇంతకీ ఈశంకర్ దొంగతనాలూ, మోసాలూ ఎందుకు చేశాడు? ఆకలితో మాడుతున్నవాడు, సంఘంలో ఏఒకరూ తనను ఆదుకోలేదు. తరిమికొట్టారు. చేర తీసిన ఒక్కడూ బలవంతాన, ఇతన్ని దొంగగా తరిఫీదు చేశాడు. అదీసంగతి. అందువల్ల "నేను చేస్తున్నదీ, మీరు చూస్తున్నదీ దొంగతనమైనా, నా మనసులో ఉన్నది మంచిభావమే. చెడ్డపనులు చెయ్యడానికి క్రూరసంఘమే కారణం" అని తేలుస్తాడు–'ఆవారా' 'వాక్ ఆన్ ఎనీడోర్' సినిమాలు చూసిన శంకర్ ఉరఫ్ ఆనంద్. న్యాయమూర్తి కూడా నాలిక్కరచుకుని, పొరబాటే (సంఘానిది) అనుకుని, "నిజమైన పశ్చాత్తాపంపడ్డ దోషుల్ని సమాజం క్షమిస్తుంది. పైపెచ్చు ప్రేమిస్తుంది కూడా" అని ప్రపంచించి, "వెళ్ళి రాగిణిని పెళ్ళిచేసుకు డ్యూయెట్లు పాడుతూ సుఖంగా ఉండవలసిందని, డాకూ శంకర్‌ని వదిలేస్తాడు. ఈ



డి. డబ్ల్యు. గ్రిఫిత్ 1916 లో నిర్మించిన చలనచిత్ర కళాఖండం 'ఇన్‌టాలరెన్స్'లో ఒక సన్నివేశం

అమెరికన్ చలనచిత్రకళ పరిణామాల కథ

(గతవారం తరువాయి)

1894 వ సంవత్సరం ఏప్రిల్ 14 వ తారీకున న్యూయార్క్‌లో తొలిసారిగా కైనెటో స్కోపులద్వారా చలనచిత్రం ప్రదర్శించాడు- ఎడిసన్. అలాగాక, తెరమీద చలనచిత్రాలను ప్రొజెక్టు చేయటం లాభసాటిగా ఉంటుందని, ఎడిసన్ భాగస్వాము లందరూ అభిప్రాయ పడ్డారు.

సరిగ్గా రెండుసంవత్సరాలైనతర్వాత కోసర్ అండ్ బెల్ మ్యూజిక్ హాలులో "ఎడిసన్ విటాస్కోప్" ద్వారా వెండి తెరమీద చలన చిత్రాలు ప్రదర్శింపబడ్డాయి. న్యాయంగా ఆలోచిస్తే ఆప్రొజెక్టరును కనిపెట్టిందిథామస్ ఆర్మాట్. ఆయన వాషింగ్టన్ నగరంలో పరిశోధనలు చేస్తూండేవాడు. కైనెటోస్కోప్ యొక్క డిస్ట్రిబ్యూటర్ల కృషినీ, వాటిద్వారా ప్రదర్శితమౌతున్న చలనచిత్రాలనూఆర్మాట్ చూసి ముగ్ధుడై, తాను కనిపెటిన ప్రొజెక్టరుపై ఎడిసన్ పేరు వేసుకొని నిర్మించుకొనే టందుకు అనుమతినిచ్చాడు.

ప్రొజెక్టర్లు

ఆలోపుగా అమెరికాలోనిపరిశోధకుల్లో మరికొందరుకూడా ప్రొజెక్టర్లు కనిపెట్టారు. ఉదాహరణకు ఒకరి సంగతి చెబుతాను. 1894 వ సంవత్సరం ఫిబ్రవరిలో న్యూయార్క్ నగరంలో జీనీ ఆక్మీరాయ్ కొంతమందిముఖ్యులకు ప్రయోగపూర్వకముగ ఒక ప్రొజెక్టరును ప్రదర్శించాడు. ఒక సంవత్సరంగడిచినతర్వాత అమెరికాలో అనేకనగరాల్లో బహిరంగప్రదర్శనలుఇచ్చాడు. అమెరికాలోనూ, యూరప్‌లోనూ చాలామంది కెమెరాలనూ, ప్రొజెక్టర్లనూ నిర్మించారు కానీ ఎడిసన్,ఆర్మాట్, లూమియర్ తయారు చేసినవాటి అంతస్తు అందుకోలేకపోయారు.

ముడి ఫిల్ము


ఎడిసన్ అన్నివిధాలా గొప్పదైన కెమెరా నిర్మించటమేగాక, అందరూ అనుసరించే రీతిగా వెడల్పు నిర్ణయించి ముడిఫిలిం తయారు

లెక్కని, నేరంచేసిన ప్రతిఆసామీ బోనులోనించుని, దర్శక రచయిత ఒ. పి. రాల్హాన్ ఇచ్చిన డైలాగులి వల్లించి, తనకి దుర్బుద్ధి పుట్టడానికి సంఘమే కారణమని, దాన్ని మొహంవాచేలా చివాట్లేస్తే, లాయర్లను పెట్టుకోనక్కరలేదు. మున్ముందు జైళ్ళసిబ్బందిని కూడా తగ్గించి ఖర్చు పొదుపుచెసుకోవచ్చు.

ఇవన్నీ గిటకనే కాబోలు సెన్సారు వారు, జడ్జిమెంటు సన్నివేశంలో నాలిక్కరచుకుంటున్న న్యాయమూర్తి వాక్యంలోని ఈ ట్రిక్కు అందరికీ తెలిసి పోతుందని కాస్తంత కత్తిరించినట్లు కనబడు తుంది.

ఎటొచ్చీ, 'జో కుచ్ తుమ్ దేఖ్ తే హో, వో సచ్ హై; మగర్ జో కుచ్ తుమ్ సమఝ్ తే హో, వో సచ్ నై, అన్న వాక్యం గుర్తుకు వచ్చి కాబోలు, సెన్సారింగు సంసార పక్షంగా చేశారు.

ఊహామంచిదేగదా. ★



చలనచిత్రానికి శబ్దాన్ని జోడిస్తూ ఎడిసన్ రూపొందించిన కైనెట్‌స్కోప్

★ చలనచిత్రకళ పరిణామాల కథ ★


చేశాడు. ఫిలిం వెడల్పు 35 మిల్లీమీటర్లు ఉంటే బాగుంటుందని, దాని ప్రకారం కెమెరాలు, ప్రొజెక్టర్లూ, ఎడిటింగ్ పరికరాలు తయారుచేయడం మంచిదని ఆయన ప్రకటించాడు. అదే కొలత 60 సంవత్సరాల నుంచీ అమలులో ఉన్నది. ఆవిధంగా ఎడిసన్ ఫిల్మ్ రంగానికి అపారమైన సేవ చేశారని చెప్పవచ్చును. న్యూయార్క్‌కు కొన్ని మైళ్ళ దూరాన ఎడిసన్ ఒక స్టూడియో తయారు చేశాడు. దానికి చక్రాలు తగిలించాడు. వర్తులాకారంలో రైలుపట్టాలు వేసి, వాటి మీద ఆ స్టూడియోను ఎక్కించి నటీనటుల ముఖాన సూర్యరశ్మి అన్ని వేళలా పడేటట్టు దానిని పట్టాలమీద గుండ్రంగా త్రిప్పుతూండేవాడు. దానిని నల్లతారు పూతపూసిన కాగితంతో కప్పేసి "బ్లాక్ మేరియా" అని పేరు పెట్టాడు. కళ్ళకు దగ్గరగా పెట్టుకొని చూచే కైనటోస్కోపుల ద్వారా, తాను వందలాదిగా తయారుచేసిన చిన్న చిన్న చిత్రాలను ప్రదర్శించాడు.

35 మిల్లీమీటర్లువెడల్పుగల ఫిల్మ్‌యొక్క ప్రతి 'ఫ్రేము' కు నాలుగు స్ప్రాకెట్ కంతలను (చక్రాలమీద పట్టు తప్పకుండా నడవడానికి గాడి) ఏర్పాటుచేసింది కూడా ఎడిసనే. అందుచేత ఆయన నిర్మించిన చిత్రాలు ప్రదర్శించేటందుకు తగిన ప్రొజెక్టర్లను, అమెరికాలో యూరప్‌లో చాలామంది తయారుచేశారు. ఎడిసన్ నిర్ణయించినఫిల్మ్ వెడల్పునే—అంటే 35 మిల్లిమీటర్లనే, లూమీర్ కూడా అనుసరించాడు కాని ఒక్కొక్క ఫ్రేముకూ ఒక్కొక్క స్ప్రాకెట్ కంతచొప్పున ఉంటే చాలునను కొన్నాడు. కాని కొన్నాళ్ళకు ఎడిసన్ పద్ధతిని నాలుగు కంతలుంటేనే ఎక్కువ సుఖమని గ్రహించి, దానినే అనుసరించాడు.

వార్నర్ బ్రదర్సు

ఇరవయ్యో శతాబ్దం ఉదయించింది. యంత్రాల్లో ఏమీ మార్పులు కనిపించలేదు, చివరకు 1926 వ సంవత్సరంలో వార్నర్ బ్రదర్స్ టాకీయుగ వైతాళికులయారు. ఫిలిం ప్రొజెక్టరునూ, ఫోనోగ్రాఫ్ రికార్డింగ్‌ను ముడిపెట్టి "ఇంటర్—లాక్" విధానంలో టాకీ చిత్రాలు ప్రదర్శించారు. అది మూకీ, టాకీ యుగాల సంధికాలం. విటాఫోన్ పద్ధతి పాతదనే చెప్పొచ్చు. ఎందుకంటే 1889—1914 సంవత్సరాల మధ్య ఎడిసన్, టాకీవిషయమై అనేక ప్రయోగాలు చేశాడు. 1900 సంవత్సరంలో పారిస్‌లో మూడు ప్రదర్శనలు కూడా ఇచ్చాడు. పెద్ద పెద్ద థియేటర్లలో టాకీ ప్రదర్శనలు ఇవ్వటానికి శబ్దంయొక్క తీవ్రత హెచ్చించాలి, అది ఎలక్ట్రానిక్ పరికరాల ద్వారాగాని సాధ్యం కాదు. అవి 1906 వ సంవత్సరంలో లీ.డి. ఫారెస్ట్ కనిపెట్టినవాక్యూమ్ ట్యూబ్ విధానంమీదఆధారపడి ఉన్నాయి. కాని వాటి విషయమై 15 సంవత్సరాల వరకూ తగినఅభివృద్ధి జరగలేదు. రికార్డకంటే, ఫిల్మ్‌మీదనే శబ్దాన్ని రికార్డుచేసిప్రదర్శిస్తే అత్యుత్తమంగా ఉంటుందని నిరూపింపబడింది. అంతటితో 'విటాఫోన్' పూర్తిగా పాతబడి, ప్రొజెక్షన్ కాబిన్దగ్గర సెలవు తీసుకున్నది.

(ఇంకా వుంది)



1889 అక్టోబరు 6 వ, థామస్ ఎ. ఎడిసన్ తొలిసారిగా చలనచిత్రాన్ని ప్రదర్శించిన 'స్టుడియో.' ఇది న్యూజెర్సీ, వెస్ట్‌ఆరెంజ్‌లోని 'ఎడిసన్ లేబరేటరీ' ఆవరణలో నిర్మించబడింది. వెలుగు లోపలికి చొరబడకుండా చుట్టూరా తారుపూసిన కాగితాలు అంటించివేశారు.



నేషనల్ ఆర్ట్ థియేటర్స్ వారి 'పాండురంగ మాహాత్మ్యం' మొన్న విజయవాడలో శతదినోత్సవాలు జరుపుకొంది. అతిథులు శ్రీ గోపాల రెడ్డి నిర్మాత శ్రీ త్రివిక్రమరావు, ఇందులో పాల్గొన్న కళాకారులు, శతదినోత్సవకేంద్రాలలోని థియేటర్ల అధిపతులు, డిస్ట్రిబ్యూటర్లనూ ఇందులో చూడవచ్చు.

నటీనటులకు సన్మానం

ఉగాదిపండుగనాడు మద్రాసులో ఆంధ్ర మహాసభవారు చలనచిత్ర కళాకారులు ఆరుగురిని సన్మానించారు. వారు: శ్రీయుతులు బి. ఎన్. రెడ్డి, ఎన్. టి. రామారావు, ఎస్. వి. రంగారావు, రేలంగి వెంకట రామయ్య, శ్రీమతులు కె. సావిత్రి, జి. వరలక్ష్మి. ఆరోజు సభకు మద్రాసు మేయరు శ్రీమతి తారాచెరియన్ అధ్యక్షత వహించారు. సభకు దాదాపు పదిహేను వందల మంది తెలుగుపౌరులు వచ్చారు. శ్రీయుతులు వి. వి. శేషయ్య, ఎం. గురునాథం, పి. బి. వి. రమణరావు, జి. శంకరం, శ్రీమతి కమలా చంద్రబాబు ఆయాకళాకారులకు, సన్మాన పత్రాలను చదివి సమర్పించారు. శ్రీయుతులు తాపీ ధర్మారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, నటుడు కె. జగయ్యగారలు సన్మానితుల ప్రతిభాసంపత్తిని ప్రశంసించారు.

పండుగకు ముందర నాలుగురోజులు సభ ఆధ్వర్యాన నాటికోత్సవాలు జరిగాయి. తెనాలి, విజయవాడ, నెల్లూరు పట్టణాల నుండి వచ్చినవారూ, నగరంలోని నాటక బృందాలూ కలసి మొత్తం 11 నాటికలు వేశారు.

సులేమాన్ మిత్రసమాఖ్యవారు ప్రదర్శించిన 'గాలిదోపిడీ' నాటికకు ప్రథమ బహుమతి, ఆంధ్ర కళామండలివారి 'మానవుడు' నాటికకు ద్వితీయబహుమతి, తెనాలి అభ్యుదయకళాసమితి (సమర్పణ)కి ప్రత్యేక బహుమతి లభించాయి.

ఉత్తమనటులుగా శ్రీ రేపల్లె కృష్ణమూర్తి, వేదాంతం శివానందం, కుమారి రాధారాణిలను ఎన్నికచేశారు. సంగీతంలో కుమారికృష్ణవేణిని ఎన్నికచేశారు. వీరందరికీ శ్రీమతి తారాచెరియన్ బహుమతులు ఇచ్చి అభినందించారు. ★

నిర్మాత మైకెల్ టాడ్ మృతి

ప్రముఖ హాలీవుడ్ చిత్ర నిర్మాత, మైక్ టాడ్ మార్చి 22 న విమాన ప్రమాదంలో మృతి చెందాడు. తన స్వంత విమానంలో పశ్చిమ న్యూమెక్సికోమీదుగా పోతూ ఉండగా, విమానం హఠాత్తుగా పేలిపోయి, నిప్పంటుకుని పేలిపోయింది. ప్రసిద్ధ హాలీవుడ్ చిత్ర రచయిత ఆర్. కోహెన్ కూడా ఈ ప్రమాదంలో మరణించాడు.

మైకెల్ టాడ్ దాదాపు హఠాత్తుగా అద్భుత విజయం సాధించి గణుతికెక్కిన నిర్మాత. జూల్స్ వెర్న్ నవల "అరౌండ్ ది వరల్డ్ ఇన్ ఎయిటీ డేస్" (80 రోజులలో భూప్రదక్షిణం)ను టాడ్, పెద్ద ఎత్తున చిత్రంగా నిర్మించాడు. అది ఏడాది నుండి అమెరికాలోనూ, యూరప్‌లోనూ విశేషంగా డబ్బు గడిస్తోంది. ఆ చిత్రం నిర్మాణంలో, ప్రదర్శనంలో మైకెల్ టాడ్ ఖర్చుపెట్టిన డబ్బు, చేసిన తమాషాలూ, గారడీలూ అమెరికాలోనే కాక, ఇంగ్లండ్‌లోకూడా పెద్ద సంచలనం కలిగించాయి. టాడ్ వయసు 49 ఏళ్ళు.

చిత్రనిర్మాణంలో మైకెల్ టాడ్ చూపిన ప్రజ్ఞను, ఉత్సాహాన్ని ప్రశంసిస్తూ, ప్రముఖ నిర్మాతలు శామ్యూల్ గోల్డ్విన్, జాక్ వార్నర్, ఫాక్స్ సంస్థ అధిపతి బడ్డీ అడ్లర్, పారమౌంట్ అధిపతి ఫ్రాంక్ ఫ్రీమన్, 'అరౌండ్ ది వరల్డ్' చిత్రంలో నటించిన డేవిడ్ నివెన్ ప్రభృతులు ప్రకటన చేశారు.

మైకెల్ టాడ్, దాదాపు ఏడాదిక్రితం, ప్రముఖ హాలీవుడ్ తార ఎలిజబెత్ టేలర్‌ను వివాహం చేసుకొన్నాడు. టాడ్ మరణ వార్త తెలియగానే ఎలిజబెత్ టేలర్ స్మృతితప్పి పడిపోయింది. ★

శ్రీ శ్రీ గృహప్రవేశం

ప్రముఖ రచయిత శ్రీ శ్రీ, మద్రాసు రాజా అన్నామలైపురంలోని కెనాల్ బాంక్ రోడ్‌లో ఇల్లు కట్టించుకొన్నారు.

మార్చి 30 ఆదివారం ఉదయం 9-17 గంటలకు గృహప్రవేశం జరిగింది. నగరంలోని శ్రీ శ్రీ అభిమానులూ, రచయితలూ, చలనచిత్ర ప్రముఖులూ పలువురువచ్చి ఆయనను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

వార్తలు

1957-58 సంవత్సరాలలో, కేంద్ర సెన్సారుబోర్డు లెక్కప్రకారం, ఈ దేశంలో విడుదలఅయిన చిత్రాలలో వినరాని మాటలూ, కనతగని దృశ్యాలూ కలిపితే మొత్తం 73,165 అడుగుల ఫిలిం అవుతుంది.

ఏడాది మొత్తంమీద వీరు చూచి అనుమతి పత్రాలు ఇచ్చిన చిత్రాలపై ప్రభుత్వం అధికార నివేదికలో ఈ వివరాలు ఉన్నాయి.

మొత్తం 2951 చిత్రాలలో, 2802 చిత్రాలకు 'యు' సర్టిఫికెట్లు (పిల్లలుకూడా చూడతగినవి) 101 చిత్రాలకు 'ఏ' సర్టిఫికెట్లు (పెద్దలుమాత్రమే చూడతగ్గవి) ఇచ్చారు. మరి 67 చిత్రాలు పెద్దలు కూడా చూడరానివి అన్నారు.

* * *

విజ్ఞానశాస్త్రంలో సోవియట్ రష్యా, ఇతరదేశాలూ సాధించిన ప్రగతిని చూపుతూ రాకెట్ ప్రయోగం, ఉపగ్రహాలు, శాంతి ప్రయోజనాలకు, నిర్మాణాత్మక కార్యాలకు అణుశక్తిని వినియోగిస్తున్న విధానాలూ మొదలగు వాటిపై రష్యా మూడువందల డాక్యుమెంటరీ చిత్రాలు నిర్మించబోతోంది.

"స్పుత్నిక్"పై సోవియట్ రష్యా తీసిన ఒక డాక్యుమెంటరీ ఇటీవలే బొంబాయిలో విడుదల అయింది

* * *

బొంబాయి సినిమాకళాకారులు అంతా తమ తమ శాఖలను బట్టి, ప్రత్యేక సంఘాలు కట్టుకుంటున్నారు. సినీమా యజమానుల సంఘం ఒకటి, 'కారెక్టర్ యాక్టర్'ల సమితి ఒకటి కొత్తగా ఏర్పడినవి.

హాలీవుడ్ ఆస్కార్‌లు

1958 అమెరికన్ చిత్రాలలో, 'ది బ్రిడ్జ్ ఆన్ ది రివర్ క్వాయ్' ఉత్తమచిత్రంగా ఎన్నిక అయి, మోషన్ పిక్చర్ అకాడమీ 'ఆస్కారు'ను అందుకుంది. ఈ చిత్రం దర్శకుడు డేవిడ్ లీన్ ముఖ్యనటుడు అలెక్ గినెస్‌లకు 'కాబిరియా' ప్రత్యేక బహుమతులు ఇచ్చారు. ఈయిద్దరూ బ్రిటిష్ కళాకారులే. ఈ చిత్రానికి మరి ఐదు ఆస్కార్‌లుకూడా లభించాయి. అవి స్క్రీన్‌ప్లే (పియరీ బౌల్) సంగీతం (మాల్కొం ఆర్నాల్డ్) ఛాయాగ్రహణం (జాక్ హిల్) ఎడిటింగ్ (పీటర్ టేలర్)లకు ఇచ్చారు.

'టాడ్-ఏఓ' ప్రాసెసు కనిపెట్టిన, ప్రముఖ నిర్మాత మైకెల్ టాడ్‌కు (ఈయన 'దిసీజ్ సినేరామా' చిత్రంలో ముఖ్యభాగాలు తీశాడు) ప్రత్యేక బహుమతి ఇచ్చారు. టాడ్ గతవారమే న్యూమెక్సికోలోని గ్రాంట్ నగరంవద్ద విమానప్రమాదంలో మరణించారు.

ఉత్తమ విదేశీయచిత్రంగా 'నైట్స్ ఆఫ్ ఇటలీ' అనే ఇటాలియన్ చిత్రం ఎన్నిక అయింది. ఈ పోటీకే 'మదరిండియా' మరి మూడు భారతీయుల చిత్రాలూ పంపబడడం విదితమే.



ఉగాది పండుగనాడు "కళోదయ" (మద్రాసు)వారు సెంట్ మేరీస్ హాలులో "పతిసక్కుబాయి" నాటకం ప్రదర్శించారు. ఎడమనుండి: శ్రీయుతులు ఆర్. నారాయణస్వామి, రాజగోపాల్, లక్కరాజు, ఎస్. కృష్ణస్వామి, డా॥ ఎం. వి. రావు, అన్నపూర్ణ, గంగారత్నం.

సినీ పనివారి శ్రేయోభివృద్ధికి...

(27 వ పేజీ తరువాయి)

రావాలి, తమ దేశీయులే కావాలి' అని ఆయా దేశీయ నిర్మాతలు అనుకునే పక్షంలో, అక్కడినించి వచ్చే సినిమాటోగ్రాఫర్, సౌండ్ ఇంజనీర్‌లకు సమానమైన ప్రతిపత్తితో ఇక్కడివారినికూడా నియమించి, వీరిని ప్రత్యామ్నాయ ఉద్యోగులుగా నియోగించాలో చెప్పవచ్చునని కూడా మహాసభ సూచించింది.

ఇటలీ, జపాన్ ప్రభృతి దేశాలలో ఈ పద్ధతి అమలులో ఉంది. విదేశీయులు అక్కడ చిత్రం తీయడానికివస్తే, టెక్నిషియన్‌లలోను, నటీనటులలోనూ (ముఖ్యనటులు ఒకరిద్దరు మినహా) నూటికి ఇంతమంది ఈ దేశీయులను నియమించాలని ఆయా ప్రభుత్వాలు నిబంధనలు ప్రవేశపెట్టాయి. "వార్ ఎండ్ పీస్"వంటి చిత్రాల నిర్మాణం అంతా వీటికి అనుగుణంగానే జరిగింది.

* * *

కొత్త సంవత్సరానికి అఖిల భారత సినీ టెక్నిషియన్‌ల మహాసభకు శ్రీ బి. ఎం. శాశా అధ్యక్షులుగానూ, శ్రీయుతులు ముదిగొండ లింగమూర్తి, ప్రఫుల రాయ్ (కలకత్తా)లు ఉపాధ్యక్షులుగానూ శ్రీ వి. బి. కులకర్ణి (బొంబాయి) ప్రధాన కార్యదర్శిగాను, శ్రీయుతులు నిమాయిఘోష్, సుధీర్ ఘటక్ (బెంగాల్)లు సంయుక్త కార్యదర్శులుగాను శ్రీ కృష్ణగోపాల్ (బొం) కోశాధికారిగానూ, మరి తొమ్మండుగురు కార్యవర్గ సభ్యులుగాను ఎన్నిక అయ్యారు. ★



20

ఆరోజే మధ్యాహ్నం...ఎండ తీవ్రంగా కాని...కాని...పొద్దు తిరిగాక ఆకాశమంతా మబ్బులు కమ్మాయి. అక్కడక్కడ చిరుచినుకులు రాలాయి; రాను రాను గాలి వీచింది. మేఘాలు పడమటి దిక్కునకు ప్రయాణం చేసి కొండల్లో కేంద్రీకరించాయి. రాను రాను సాయంత్రానికి కొండల్లో మెరుపులు మెరిసాయి.

ఆసమయాన నీలమ్మగుడిదగర పలకరాతిమీద గుడ్డి వెంకన్న ఒంటిగా కూర్చున్నాడు చేతిలో బాణాకర్రవుంది. గన్నెమ్మ పుణ్యమా అంటూ తన కోరిక నెరవేర్చిందిని ఇక్కడ విడిచిపెట్టి వెళ్ళిపొమ్మంటే తీసుకొచ్చి విడిచిపెట్టి వెళ్ళిపోయింది. కర్ర ముందుకు వేసుకొని కూర్చున్నాడు.

చిన్న చప్పుడు కాగానే "యెవరయ్యా" అన్నాడు. గుడ్డోడా సీకటిపడ్డంది యిక్కడేం వున్నావ్" అని సంజీవి అడిగాడు.

"అయ్యా! దాసుడు కానాకేస్తే యిని పోదామని..."

"ఆకలితో సగం చచ్చాడు. జొరంతో సస్తంటే ఎలాగొస్తాడు? రా యీడిలో వదిలేస్తాను" అన్నాడు.

"వద్దయ్యా! దాసు డెలాగైనా వస్తాడు ..."అంటూ సర్దుకొని కూర్చున్నాడు.

ఏరు జలజల పారుతున్న శబ్దం వినిపిస్తోంది వారధిపై గంటలతో పరుగులెత్తే యెడబళ్ళ చప్పుడు. అప్పుడప్పుడు "హాహ్యా యో" అన్న బస్సుల అరుపులు...గిటన్నిటిమీదకు భల్లూకంలా మీదపడి మ్రింగడానికి వచ్చే చీకటి!

పాదాల చప్పుడు.

"ఎవరయ్యా?"

జవాబు లేదు.

"పేరు సెప్పు."

చిన్న మూలుగు.

వెంకన్న కర్రయెత్తి "సెప్పకపోతే మీద పడ్తాది."

"నేనురా...దాసుడ్ని.!


"అయ్యా వూరుకొని కొంప ముంచేదువు! రాజిగాడు యిలా గొస్తాడనీ కాసాను."

దాసుడు మౌనంగా గుడి తలుపులు తీసాడు. ఈ వేళ చిరిగిన మాసిన వస్త్రాలు, తడిపి ఆరవేసి మడి కట్టుకొని వచ్చాడు. నిన్న వీటితోనే వచ్చాడు. కొడుకు నిన్న మధ్యాహ్నమే జ్వరంతో పడున్న తండ్రిని చూచి మెల్లగా ఆ మేదరి బుట్టలోని పట్టు వస్త్రం—పూరంతా కలిసి దాసుడికి కొని యిచ్చిన ఆ నేరేడుపండు రంగు పట్టు పంచే—కాజేసి త్రాగడానికి డబ్బుకోసం అమ్మేవాడు. కోమటి పేరయ్య నాలుగోవంతు ఖరీదుకు కొనేసాడు. ఆపంచెపోవడం దాసుడు నొచ్చుకున్నాడు. జ్వరం అధికమైంది. ఆ పంచె పోయింది—తన బ్రతుకూ సరే అనుకున్నాడు. లేవలేని పరిస్థితి. కానీ కడ ప్రాణం వున్నంతవరకూ తల్లికి తన చేత అలనా పాలనా జరగవలసిందే! నెమ్మదిగా లేచి బట్టలు మార్చుకొని...అడుగులో అడుగులు వేసుకుంటూ ఆయాసం రాగా ఆగి—మళ్లీ నాలుగడుగులు వేసి...ఇలా చాల సేపటికి నీలమ్మగుడి చేరుకున్నాడు. అక్కడకు వచ్చేసరికి ఆయాసం రావటంచేత వెంకన్నకు వెంటనే బదులు చెప్పలేక పోయాడు.

దీపం వెలిగించి కూలబడిపోయాడు. శివాలు వెయ్యటానికి శక్తిలేదు; ముదుసలి ముద్దలా గజగజ వణికిపోతున్నాడు. పండిన జుత్తూ గడ్డం...ఆ మధ్యను బక్క చిక్కినముఖం—పళ్లు రాలిన నోరు...లోతుకన్నూ...గోడకు జార్లబడిపోయాడు.

వెంకన్న తడుముకొని మెల్లమెల్లగా గుడి గుమ్మం బయట కూర్చున్నాడు. దాసుని మూలుగు వినిపిస్తోంది.

"అయ్యా!" అన్నాడు వెంకన్న. దాసుడు సమాధానంగా మూలిగాడు. "ఆ రాజిగాడు పసిపిల్లడు మల్లుని యీడ్పించాడు. ఆ



శ్రీశైలంవద్ద పాతాళగంగా తీర్థం.

ఫొటో: ఎ. సీతారాం-తెనాలి

★ దగా పడిన తమ్ముడు ★

పుల్లియ్యక్క భూమి పుట్టా పోసినాడు. బతుకులు యెందరివో కాలుస్తున్నాడు. ఆడు ఆడిరక్తం చూస్తే గానీ బుద్ధిరాదు. అందుకేనయ్యా కాసాను!

దాసుడు మూలుగుతూ "నాయనా! పులా - సింగమూ! మనసుల్ని సంపుకు తిన వంతసేపూ మంచోడేవరా!..."

"మంచోడా? నాయంపూర్లో వుండాలా. ఈ గేమం, గంగలో కలిసిపోతంది. సూడయ్యా! నివ్వు ఈలందరికీ యెంత సెప్పినావు! ఏల! నాలాంటి గుడ్డోడు కన్ను మూసి సూసినా కన్నిప్పి సూసినా ఒకటే!"

దాసుడు మెల్లగా ఆగి "ఎవరిగివాల...బటి...ఆళ్ళ...బతుకులు...నడుస్తాయి! సీకటి నేకపోతే...యెలుగు గవడిక్కావాల? సెడ్డ నేకపోతే...మంచి నేదు!"

నాలుక లాగేస్తోంది. మాటలు తడబడుతున్నాయ్. కానీ వున్న కొనవూపిరితో మాటలు మెల్లగా దొర్లుతున్నాయ్.

"పడమట...పొద్దుకుంగితే... తూరుపున లేవదా? ఒకరోజు శేడి...యింకోరోజు సల్లన. సస్తాం...పుట్టాం! సావు మనక్కాదు. పెపంచకం నిలబడడానికి?"

ఒక్క మూలుగు మూలిగాడు. కొండల్లో ఉరుములు గంభీరధ్వని చేసాయ్. మెరుపులతో మేఘాలు ఇటువేపు వురుకుతూ పరుగెడుతున్నయ్. ఆకాశం ఎద్దరిల్లిపోతోంది!

వెంకన్న 'అయ్యా' అన్నాడు. మాటలు లేవు. తల్లి వాలింది! అనుకున్నాడు. మౌనముగా "నరుడా" అన్న గంభీరశబ్దం వినడానికి చెవులు రిక్కించి చేతులు కట్టుకొని కూర్చున్నాడు.

ప్రమిదలో నూనెవుంది. వత్తియెత్తేవారెవరూ లేరు రానురాను...ఓనిముషంలో వత్తే కాలి దీపం ఆరిపోయింది. చీకటి! ఎటు చూస్తే చీకటి! కానీ వెంకన్నకు మనసులో ఆనందం! నీలమ్మతల్లి మాటలు వింటూను!

హోరున గాలివీసోంది-వర్షం ముంచుకొస్తోంది—ముంచుకొచ్చింది! దబదబ పడుతోంది. వెంకన్న మెల్లగా తడుముకుంటూ గుడిలోనికి కాలు పెట్టాడు.

తలుపులు వేయడానికి ప్రయత్నించాడు: గాలి తలుపులను తెరుస్తూ వర్షపుజల్లును గుడిలోనికి కొట్టుతోంది. లోన గడియ లేదు. తలుపులు కొట్టుకుంటూన్నాయ్. ఉరుముల శబ్దం గుడిలో ప్రతిధ్వనిస్తోంది. సాష్టాంగ పడ్డాడు. ఆపడటంలో మోచెయ్యి ప్రమిదలోపడింది. చప్పున లేచాడు. గుడిలోనికి గాలి బాగా కొట్టోంది......తను తడిసిపోతుంటే కూర్చునే తడుముకొంటూ ఒకమూలకు పోతుండగా చేతికి యేదో తగిలింది. మెల్లగా చేతితో తడిమాడు. చల్లగా తగిలింది అలా చేతితో ఒళ్లంతా తడిమాడు. దాసుడు చచ్చిపోయాడని నిర్ధారణ చేసుకొడానికి ఒక క్షణమైనా పటలేదు. ఆ శవాన్ని... ఆతలని రెండుచేతులతో గట్టిగా పట్టుకొని గుండెకు హత్తుకొంటూ వెక్కాడు. యేడుపు ఉధృతంగా వచ్చేసింది. కన్నీరు కాలవలై దాసునిమీద పడజొచ్చింది. ఆ యేడుపుతోనే "నిన్ను ఆకలితోనే సంపేశారు...నా అయ్యా...మా దాసయ్యా! నిన్ను ఆకలితోనే సంపేశారురా!......మా తల్లికి యింక దీపం యెవురు పెట్టారు? శివా లెవకేసాగు?" ఒక పేయేడుపు! ఆగోల అంతా వురుముల భీకరధ్వనిలో కలిసిపోయింది. ఆ

కన్నీరు దాసునిమీదనుంచి జారి ప్రకృతి చల్లనవానలో చేరిపోయింది!

21

మరుచటిరోజు వుదయం — వర్షం వెలిసి ప్రకృతి ప్రశాంతంగావుంది. విరిగిన చెట్లు, యెగిరిన యింటి కప్పులు బీభత్సపు అవశేషాలుగా అగుపిస్తున్నాయ్. దాసుడు ఈ మటిలో పుట్టి, యీ వూరు మన్ను నే నమ్ముకొని బ్రతికి చివరకు యేటిఒడ్డున బుగ్గయిపోయాడు.

మధ్యాహ్నమయ్యేసరికి పేటేరు ముంచుకొచ్చింది. హోరుమనే ఆ ప్రవాహపు వడి పూరి చివరవరకు వినిపిస్తోంది. రెండు ఒడ్డులుతీసి పారి యెదుటి ఒడ్డునవున్న ఖైరి గ్రామంలోకి కూడా ప్రవాహం చొచ్చుకుపోతోంది. ప్రజలు యిల్లు వాకిలీ విడిచిపెట్టి దగ్గరగా వున్న గుట్టమీదకు వెళిపోతున్నారు. నవిరి గ్రామంకు ఆ ప్రమాదం లేదు — ఒడ్డు యెత్తుగా వుండటం దక్షిణపువేపు యిసుకదిబ్బలు, దిబ్బలపై సరుగుడు తోటలు వుండటంవల్ల యేరు ఎంతవచ్చినా వరదబాధ వుండదు.

ఏరు రాను రాను హెచ్చయి జొబ్బలు పెట్టోంది. చెట్లూ, పశువులూ, కలప కంపనూ తిప్పుతూ త్రోసుకుంటూ పోతోంది. జీలుగుతెప్ప లేకుండా యెటువంటి గజయీతగాడూ యేటిలో దిగలేకపోతున్నాడు. గంగమ్మతల్లి రాను రాను రౌద్రస్వరూపిణి అవుతోంది. ఒడ్డును దభీమని కూల్చేస్తోంది. వంతెనను గజగజలాడిస్తోంది. తెప్పలమీదనున్న మనుష్యుల్ని కూడా తిప్పిరీలలో గిరగిర త్రిప్పి ముంచబోతోంది — ఏమిటీ బీభత్సం? ఎందుకీ ప్రళయాకారం? ఎందుకింత ఒడుకు దుడుకులు? — ఏతమ్మా — మొన్ననే వెన్నెల్లో సొగసుతో సొంపుతో మువ్వలరవలులతో నృత్యంచేసిన దానివి, యింతలో యీ బీభత్సం దేనికమ్మా? ఎప్పుడూ ఆ మాధుర్యం నీలోవుంటే — కంటికి యింపై నీ ఒడ్డునవున్న వాళ్ళలో భావోద్రేకాలు కలిగించి కమ్మగా రాగాలు కలకాలం తియ్యించేదానవే!

ఏరు నవ్వింది! కారుచీకటిలో ఒకమూల చిన్నవెలుగు, నిరాశలో ఆశారేఖ. గతంజ్ఞప్తికి తెప్పించింది. ఒకప్పుడు యేరు, భీభత్సంగా వచ్చింది. రాను రాను తగ్గి చూపుకు పసందుగా ప్రశాంతంగా పారజొచ్చింది. వేసవిలో యెండిపట్టురాలైంది. పెనుగాలికి యిసుకరేణువులే యెగిరాయ్. తాగడానికి నీటిబొట్టు యివ్వలేని నికృష్ట నిర్జీవియైంది! మళ్ళీ బీభత్సమైన వరదవస్తేగానీ ఆమెలో ప్రాణం తొణికిసలాడలేదు!

ఏదేశ చరిత్రకైనా, ఏ వ్యక్తి బ్రతుకుకైనా నేనే ప్రతిబింబమని తెలుసుకోలేక పోయినందుకే కామోసు యేరు నవ్వింది!

ఆ బీభత్సమే లేకపోతే ఆ మనోహరమైన ప్రశాంత జీవితానికి ఆస్కారం ఉండేదా?

జీవితంలో నిజంగా ఒడుదుడుకులతోనే దాసుడు జీవించాడు. సుఖంగా సజావుగా వుంటే తనలో ప్రాణంవుండి లేనట్టేఅయ్యేది. ప్రాణంలేని మనిషి, అలాంటి మనుషులున్న జాతి యెలా వర్ధిల్లుతుంది?

నవిరి గ్రామంలో యెందరో పుట్టారు — ఎందరో గిట్టారు. లోటు కనపడలేదు. కానీ దాసుడు లేని లోటు కనిపిస్తూనే వుంది. నీలమ్మ గుడిలో దీపం పెట్టేవారు లేరు. బాధగా బరువుతో వున్న గుండెలను యే మాటలు తేలికచేసేవో ఆ మాటలు అటువంటి వాళ్ళకు వినిపించలేదు. ఆపదలో, ఆవేశాలలో యే హృదయం సామెతలతో, మంచి మాటలతో లేశమాత్రమైనా అసూయ లేని అపూర్వమైన అభిమానంతో, ప్రేమతో లాలించేదో అగుండె కరువైపోయింది. దాసుడు చనిపోయాక కూడా జీవించాడు. కోడలు కోపంతో యెగిరిపడి మాటలు విసరడానికి మామ ఇకలేడు. కొడుకు కొలు కుక్కనీ, పీకే తినడానికి తండ్రిలేడు. ఆమె కోపాన్ని, వాడి రాక్షసత్వాన్ని చల్లగా భరించేగుండె పగిలిపోయింది. ఇప్పుడు చెదిరనకోపాలు, విహరిస్తున్న రాక్షసత్వం వాళ్ళనే బాధపెటజొచ్చినయ్. ఆ ముసలాడు యెంతమంచోడు! కొడుకునకు యిప్పుడు అయ్యజ్ఞాపకం వస్తే బావురమని యేడుస్తాడు. కోడలు తను యెంత అన్యాయం చేసానని నొచ్చుకుంటుంది. అయేడుపు రాకుండా వుండా అంటే తను అయ్యను జ్ఞాపకం తెచ్చుకోకూడదు. జ్ఞాపకం రాకండా వుండాలంటే తను యిలా బ్రతకకూడదు. తన మనసు యింకెవరి అధీనంలోనో వుండాలి! అంచేత దొంగతనంచేసో, పనిపాట్లుచేసో, పేకాట ఆడో యేంచేసి యేం వచ్చినా పూర్తిగా దొంగసారా కొట్లోపోసి తండ్రిని మరచిపోతున్నాడు. పెళ్ళం కూలీనాలీ దొరికిన నాట్లుకు చేసి, లేనప్పుడు పెద్దయిళ్ళల్లో అడుక్కొని పిల్లలను పోషిస్తోంది.

ఒకనాటి సాయంసమయాన నీలకంట అయ్యోర్ల వీధి అరుగుమీద వత్తి తాకుచేసుకుంటోంది. మసలమ్మ ఒక మూల కూర్చోలేదు. ఏదో పనిపాట్లు చేసుకుంటోంది. కొత్త అలసట రాగానే రెండేసి రోజులకి జ్వరంవస్తోంది. ఈ వేళ జ్వరతీవ్రత లేకపోవటంవల్ల మనుమరాలుకు ఏకులు చెయ్యటంలో సహాయం చేస్తోంది. దగర నీలికూర్చుంది. అప్పుడే వెంకన్నకు కొద్దిగా అన్నం గంజి పోసింది. వెంకన్న తింటున్నాడు. ఇంతలో పీసగొంతుక గట్టిగా వినిపిస్తోంది. వీధిలో యెదురుపడ్డ వాళ్ళని ఆపి "ఓరయ్యా! సూద్రపోడ్ని పప్పు తినమంటే యెలాగరా? అందరూ పప్పుతింటే లేపొద్దున్న పైదండు వసే కత్తీ తుపాకీ పట్టుకోగలరా? సూద్రపోడు బతుకే మాంసం! ఆడు తుపాకీపట్టుకోవాలంటే దేముడూ సారా రెండూ వుండాలంటావా లేదంటావా?"

నవ్వుతూ వాళ్ళు ఒప్పుకున్నారు. పీస గొంతుక మరింత హెచ్చించి అభినయంతో "ఆ గవుర్నమెంటోడు మంచి సరుకు

★ దగాపడిన తమ్ముడు ★

యిచ్చేవోడు తక్కువ దర! ఈ దొంగ నాయాళ్లంతా పెద్దపరువు ఎక్కువ దరకిచ్చి మనుసుల్ని యోగంగా చంపేస్తున్నారా! నాకు తెలుసునే.....నాకంతా తెలుసును ...... యిది నాగవుర్నమెంటోడు పని కాదునే!"

గుంపులో ఒకడు "మ రె వ డి ది రా! చూస్తావా? ఆడు యెగిరేపిట్టల్ని పంజరంలో పెట్టానంటే యేం అవుతాది! ఏ నాడూ తాగనోడివి నివ్వు తాగావా? పదిమంది జబ్బులొచ్చి పడున్నారు — నాయుడూ కరణాలు, పైనున్నోలు సారా కొట్టోడు బాగుపడిపోతన్నాడు!"

పీన పకపక నవ్వుతూ మళ్లీ దవ్వున నవ్వు నాపి "ఏమన్నావయ్యా! నా గవుర్నమెంటోడిని నాలాంటోలనీ అంటావా? హా...మీదనున్న నాగవర్నమెంటోడు కిందనున్న మనం మంచోలమే — ఈమధ్యనున్నోలే — దేముడు వరం యిచ్చినా పూజారి యివ్వడురా! అయ్యా నందిని పంది సేస్తారు—పందిని నందిసేస్తారు! సూసావా? కరణం దొంగలెక్కలు రాసేసినాడా? పుల్లయ్యని జైల్లో పెట్టేసినారా..., నిన్నటికి యీయేళకి నివ్వు మారిపోనావు— అలాగే రావా మంచిరోజులు"

ఆ దగ్గరలోనే నీలి యింటి దగ్గర వున్న వెంకన్న ఉత్కంఠం కుస్సుమనటంతో పీసయిటు వేపు వచ్చాడు. వెంకన్న మాడిన కడుపు పూటుదేరటంతో లేచివచ్చినిల్చొనే "వస్తాయి! ఊరంతా యీ పెద్దనాయాలంతా పెట్టిన కొటకంతో మాడిపోతూ గొడ్లయిపోనారు! దేముడు కళ్ళు యిచ్చినాడు కాదు!"

పీన దగ్గరగా వచ్చి నీలిని చూడగానే "ఏం అమ్మా! ఈ గుడ్డోడు తక్కువ పాపాలు సేసినాడా. ఏమయినాడు? అలాగే యెవురి రోజు వాళ్ళకి వస్తాది. మనం అందరినీ పీకడం యేల? ఆకర్మ రాబందై పీకుతాది!"

గ్రుడ్డివెంకన్న "వస్తాను తల్లీ" అంటూ కర్ర సహాయంతో చిన్న చిన్న అడుగులు వేస్తూ ఆగి గట్టిగా, "ఎవుడిపాపం వాడినే తింటాదని ఆపిల్లులకి రయ్యాల మొలతాళ్ళు కట్టండి! ఆ పక్కలకి పెత్తనం యిస్తే యీ పేదోలింటి కుండలన్నీ కలకవా? దాతా దైవంలేని కొంపలాగ వూరంతా అయిపోతుంటే కళ్ళున్న యీ మనుసులంతా గొడ్డులయిపోతున్నారు! అందరూ కూడి యీ బలుగుర్ని కట్టి పంచాయితీ పెట్టండి!"

కొడుకు మామ్మ చెప్పినమాటలు అంటుంటే, వంతో వంతో వస్తున్న పుల్లయ్య "ఏంరా గుడ్డోడా అలా గరుస్తున్నావ్" అని పలకరించగానే వెంకన్న ఆగి "నాయనా పుల్లీగా! నా తరవాత నివ్వేపూరి పేరు నిలబెట్టావ్. నాను గుడ్డోడినయ్యాను. నీకు కళ్లున్నాయ్. పేణంపోయినా నీతికి నిలబడాలరా! ఊరిలో వున్న బీదా బిక్కీ పడుకున్నారు! అలసిలేపి నాయనా! వచ్చినోలికి ప్రాణంపోసి, బతికి బగమంతుడ్ని చూపించు! అలు అప్పుడు మనుసులవుతారు. ఏ నాడు అలు మనుసులయ్యారో. శవాలను పీక్కు తినడానికి వున్న యీ రాబందులన్నీ యెగిరి పోతాయి!"

వెంకన్నకు ఉద్రేకంతో ఒళ్లు పులకరించి పోయింది. పుల్లయ్య బదులు చెప్పలేదు. మల్లుమాత్రం వాళ్ల మామ్మనే సామెతల్లో ఒకటైన "నోరూనోరూ నాలాగా...వీపు వీపు కాసావా?" అంటున్నాడు. పుల్లయ్య "కప్పు మూద్దాంలే" అంటూ వాకిట అడుగు పెట్టినా పీస మాటాడలేదు. మల్లుడు పీసతాత మెడను చుట్టివేసి "నోరూ నోరూ నాలావా ...వీపు వీపూ కాసావా" అంటున్నాడు.

"బాగుందిరా తాతా" అన్నాడు పీస. ఆ పొగడ్తలో మలు తన తెలివిని విప్పుతున్నాడు. "బుద్ధి బుద్ధి బాగున్నావే—బువ్వా నీవు తింటున్నావే!"

పీసను యెంతో ముద్దుచేసి మనవణ్ణి ముద్దులాడాడు. నీలి చప్పున కలుగజేసుకుని "అయ్యా! తాగావా" అంది.

పీసను యీ ప్రశ్న మేలు కొలిపింది. ఇంత వరకూ మౌనంగా వున్న యీ గొంతుకు యీ ప్రశ్నతో మైకాన్ని పటాపంచలు చేసింది. వెంటనే జవాబు చెప్పలేకపోయాడు. కొంత సేపటికి "అమ్మా" అన్నాడు. మళ్లీ నోరు పెగల్లేదు. వాస్తవిక పరిస్థితులలోపడ్డ పీసకు దుఃఖం ముంచుకొచ్చి "పిల్లా జెల్లా మాడిపోతుంటే చూడలేక—సేతకాక...ఆ మంగలోడు పట్టిస్తే...ఓసెణమేనా యియన్నీ మరిచిపోతే...పేణానికి సుకమని..."

కాస్సేపు నిశ్శబ్దంగా వుంది. పుల్లయ్య "నీలాంటి రోజులు యింక రాకూ వస్తాయిలే" అని అనబోతూ పెళ్ళాం వేపుచూచి వూరుకున్నాడు.

★

[ఇంకావుంది]

ప్రణయలేఖలు

వెలివెల భాస్కరరామారావు

"ఏమిటే వెంకీ, అంత సంతోషం...?"

....

"నిన్నే...!"

"......అమ్మగోరూ......" బాగా సిగ్గుపడిపోతో అంది.

"ఏమిటే? ఏం జరిగిందే నీ సంతోషం వంతికళ్ళా!"

"మరేమోనండీ......!"

"ఏమిటే, మాటే రావడంలేదు! మీ ఆయన దగ్గిర్నించి ఉత్తరం వచ్చిందేమిటి?"

"మరే...మరేనండమ్మా" నిండైన సంతోషంతో అంది వెంకి.

"నేనప్పుడే అనుకున్నా" అంది జమున చిన్న నవ్వు నవ్వుతూ...

వెంకి రామారావుగారి యింట్లో పనిమనిషి. వయస్సు పద్దెనిమిదిఉంటుంది. మనిషి చిక్కగా బొద్దుగా ఉంటుంది. పెళ్లంటే అయిందిగాని, ఆ రామిగాడు ఇంటిపట్టున ఉంటేనా! అబ్బే! ఎప్పుడూ ఆ ఇంజనీరు గారితో క్యాంపులు...సంవత్సరానికి మహాఅయితే ఒకనెల ఉంటాడేమో. వెంకి రామారావుగారి యింట్లో నౌకరీ చేరి దగ్గిర దగ్గిర నాలుగేళ్ళనా అయిఉంటుంది. వెంకి తల్లికూడా వారింట్లోనే నౌకరీచేసి పింఛను పుచ్చుకుంటే, ఆ ఖాళీలో ఆమె కూతుర్ని వేసి భర్తీచేశారు రామారావుగారు వంశపారంపర్యహక్కు పోవటానికి వీల్లేదని ఉద్ఘాటిస్తూ...రామారావుగారి వయస్సు నాలుగున్నర పుష్కరాలు దాటింది. మొన్నీమధ్యనే పాపం భార్యావియోగంతో సగం క్రుంగిపోయారు. ఆయన ఒక్కర్తే కూతురు జమున...మొన్ననే ఇంటరు ప్యాసయింది. ఇహ పెళ్లి చేసెయ్యాలని రామారావుగారి పట్టుదల. కాని ఒక్కొక్కసారి విసుగేసి

"ఎంత ప్రయత్నం చేసేమాత్రం ఆ దైవబలం ఉండొద్దుటండీ...ఎప్పటికయ్యే యోగం ఉందో, ఏమో..." అనేవారు.

ఇహ మనం కథకి అడ్డం పడదాం.

"ఏవిటే, ఏమిటి రాశాడేమిటి నీ మొగుడు?" అంది జమున పుస్తకం తిరగేస్తూ...

"పరే..." అంది నిష్ప్రహతో వెంకి.

"ఏమో అలా అంటున్నావ్!"

"అబ్బె, అంతచదువే ఉంటే యిహ లేనిదేముందండమ్మా" చిక్కమొహంతో అంది వెంకి.

"అయితే నీకు చదవడం రాదన్నమాట?" ఆశ్చర్యంగా అడిగింది, జమున.

"నిజంగానండి, వట్టండి...అమ్మగారు కాస్త యీ ఉత్తరం చదివి పెట్టండి మీకు పుణ్యముంటుంది..." బ్రతిమాలింది వెంకి.

'పాపం!' అనుకుంది జమున నీలంరంగు కవరు విప్పుతూ!

"నా చిట్టిప్రియా వెంకీ!

కోయిల తనస్నేహితుణ్ణిపిలుస్తోంది...చంద్రుడు కలువల్ని ఆహ్వానిస్తున్నాడు. పిల్ల తెమ్మెరలు లేత గులాబీలని దూసుకుపోతున్నాయ్! కాని నేను...? నేను ఏకాంతంగా ఎన్ని పగళ్ళు, ఎన్ని రాత్రిళ్ళు గడిపేస్తున్నానో అంచనాకి అందకుండాఉంది. నీకు ప్రేమలేఖ రాద్దామని ఎన్ని రీముల కాగితాల్ని పాడుచేశానో, నా జమాఖర్చు చూస్తే నీకే తెలుస్తుంది... నేను ఎన్నో కలలు పగలు రాత్రీకూడా కంటున్నాను. అందులో ఎన్ని మేడలు కనిపించాయనుకున్నావ్! ఆ మేడల కిటికీ చువ్వలకి, బ్రష్ పుచ్చుకుని షాలిమార్ రంగు వేస్తూ నువ్వే కనుపిస్తున్నావ్! నిజంగా నా ప్రేమే ఒక వజ్రమయి ఉంటే దాన్ని అనేకరకాలుగా కోసేసి నీకు నెక్లెసుచేయించేసి ఉండేవాణ్ణి...ఓ నా హృదయ కుసుమమా! నీకు ప్రేమసామ్రాజ్యపు ఓటలు బాతిగా తెలియనటు కన్పిస్తోంది. కాని నువ్వే ఆ సామ్రాజ్యానికి రాణివి! జవాబు తిరుగుటపాలో రాస్తావుగా ... రాముఁడు."

"ఏవిటే రామిగాడికి యింతచదువుందా! ఎప్పుడూ చెప్పలేదూ!" కుతూహలంగా అడిగింది జమున.

"అబ్బె ఆడిమొహం! ఆడికేంరాదండమ్మ...ఇంతకీ అమ్మగారూ! మీరు చదివిందానికి అర్థంఏటండీ..."

జమునకి ప్రశ్న వినిపించలేదు. మెదడు తీవ్రంగా పనిచేస్తోంది..."ఎవరు ఈ ఉత్తరం రాశాడు?" ఇదే ఆమెకి అంతుదొరక్కుండా ఉంది. ఆలోచన తీవ్రంఅయింది...

"ఆ...ఇదిగో ఇలా చూడువెంకీ...మీ ఆయన ఎక్కడ పనిచేస్తున్నాడన్నావ్!..."

"ఆ డెవడో ఇంజనీరంటండీ...ఎప్పుడూ క్యాంపులు. ఒక్కక్షణమయినా మాఆయన్ని యింటికాడుండనివ్వడు...ఏవిఁ క్యాంపులో ఏమో!" చెప్పుకుపోతోంది వెంకి.

"ఆ...! ఇది తప్పకుండా ఆ యింజనీరే వ్రాసిఉంటాడు" అనే నిర్ణయానికి వచ్చింది జమున. ఆ ఉత్తర సారాన్నంతా, విడమర్చి గడగడా చెప్పేసింది జమున.

"ఆ....చూడండమ్మగారూ.... నాకూ చదువుగ్రాదూ ఏమీ రాదూ! దీనిక్కాస్త జవాబుకూడా మీరే రాసి పుణ్యంకట్టుకోండి. అబ్బె మరేంలేదు...రెండే ముక్కలు... 'నేనిక్కడ బాగా నే ఉన్నా'నని 'అంతే... మరోస్తానండమ్మా...మర్చిపోకండే..." మెల్లిగా సాగింది వెంకి.

కలం, కాగితం తీసుకుంది జమున.

2

"దణ్ణాలండి!"

"ఒరే! రామిఁగా! నీకేం మతిపోతోందా! పాడునవగా పోయావ్. అప్పుడే పన్నెండు కావస్తోంది...ఇహేం తిండీ తిప్పలు అక్కరే!" కొంచెం విసుక్కున్నారు యింజనీరు గారు...

"ఇయాల ఉత్తరంవచ్చిందండి"నసిగాడు రాముఁడు.

"ఉత్తరం? ఏం ఉత్తరంరా? ఓహో మొన్న నీ పెళ్లానికిరాసిన ఉత్తరం జవాబా! అలా చెప్పితగలడు మరి!...ఆ! ఎలావుందిట..."

"బాబూ! అంత చదివొస్తే ఆరోజున మీ చేత ఎందుకు ఉత్తరం రాయించుకుంటానండీ!"...

చిన్నబుచ్చుకున్నాడు రాముఁడు...

"ఊ...ఇలాతే" అని పుచ్చుకుని చదవసాగారు యింజనీరుగారు.

ప్రియమయిన భర్తగారికి...

నమస్కారములు. మీ ఉత్తరం చూసి భలే ఆశ్చర్యం...బాగా అసహ్యం రెండూ వేశాయ్! ఇక్కడున్నప్పుడు బాగానే ఉండేవాడివి...అక్కడికి వెళ్ళాక బాగా చెడిపోయి సన్నాసివయిపోయావ్! దీని

★ ప్రళయ లేఖలు ★

రెండిటికీ ఆ ఇంజనీరుగారే కారకుడు... వాడికి సౌభాగ్యవుయినంతవరకూ దూరంగా వుంటూ వుండు...వాడి వరసచూస్తే దుష్టుడి లాగా వున్నాడు. మీ మేలు కోరే వ్యక్తిగా కోరుతూ...మీ వెంకి"

ఇంజనీరుగారి ముఖం వివర్ణమయింది. ఏదీటో అద్భుతం తప్పుకొన్నట్టు బాధపడ సాగాడు...ఏదో వాడికి నచ్చచెప్పి తప్పించుకు పోటప్పటికి దేవుడు కనిపించాడు.

3

మరి నాలుగురోజులకి వెంకికి ఉత్తరం వచ్చింది రాముడు దగ్గర్నించి...పరిగెట్టుకుంటూ వచ్చింది జమున దగ్గరికి...

"ఏమిటే అకంగారు!" నవ్వుతూ అడిగింది జమున.

"మరేమోనండి ఉత్తరమండి...వచ్చిందండి!"

"ఎక్కణ్ణుంచి...ఓహో మీ ఆయన దగ్గర్నుంచా? ఏదీ..." కుతూహలంగా విప్పింది జమున తన అస్త్రం ఎలాపని చేసిందో తెలుసుకోవాలని...

"ప్రియమయిన రూపిణీ... వెంకికి నా ఆశీస్సులు...

నీ రాంబాణం లాంటి ఉత్తరం అందింది. అసలు అది నీవు రాసిందేనా అని నా అనుమానం...నువ్వీ కొత్తయజమానురాలి దగ్గర కొచ్చాక మరీ కత్తికొట్టుక తృసుగులా తయారయ్యావ్! ఆవిడ చెప్పేమాట లన్నీ సుబ్బరంగా మూటగట్టి గొయ్యితీసి కప్పెట్టేయ్! తెలిసిందా!. పిలుంచే పైన సిమెంటు మలామూ చేయించెయ్! ఏం! మరోసంగతి నువ్వీ యజమానురాల్ని ఎంత తొందరలో వదిలేస్తే అంతమంచిది. మా యింజనీరుగారు కూడా అలాగే చెప్పారు. ఇదుగో వెంకి...మా యింజనీరుగారు ఎంత మంచివారనుకున్నావ్!...

వస్తాను...రాముడు."

4

మరోవారం జరిగిపోయింది. వెంకి గబగబా పరిగెట్టుకుంటూ వస్తోంది ... రోజూ ఉన్న హుషారు కనిపించడంలేదు ... ఏదో బాధ ఆమె ముఖంలో కనిపిస్తోంది...

"అమ్మగారూ ... అమ్మగారూ ..." బాధతో ఆవేశంతో పిలుస్తోంది వెంకి...

"ఏమిటే అకంగారు ... ఏంజరిగింది!" ఆత్రంగా అడిగింది జమున.

"మా ఆయన వచ్చాడండి" కళ్ళంట జలజలా నీళ్లు కారుతున్నాయి వెంకికి...

"మీ ఆయనొస్తే చక్కగా నవ్వాలి చవటా! ఏడుస్తావేమే వెర్రి మొహమా!" అంది జమున.

"అదికాదండీ..." ఏడుపు మరీ ఎక్కువైంది.

"అరె! ఎందుకే అంతేడుపు...నీ ఏడుపు ఊడ్చెయ్యా...జరిగిందేమిటో చెప్పేం వ్వే చచ్చుపీనుగా!" అరిచింది జమున.

"అదికాదండీ...మా ఆయనండి...తుపాకితో కాల్చుకునండి ... చచ్చిపోతానంటున్నాడండి..." మరీ బిగ్గరగా ఆక్రోశించింది వెంకి.

"ఆ! కాల్చుకుని చస్తాడా! ఏం అదేం రోగం తిన్నగాబతక్క" స్వరం హెచ్చించింది జమున.

"మరేమోనండీ...ఆఇంజనీరుగాడుకూడా వచ్చాటండీ...వాడికింకా పెళ్ళి, పెటాకులు లేవుగదండీ...మరి..."

"ఊ...వసే"

"వాడు, మా ఆయన మళ్ళీ తనతో వెంటనేరాకపోతే కాల్చేస్తానన్నాట్టండీ... వాడిచేతిలో చావడం ఎందుకని తనే కాల్చేసుకుంటాట్టండీ...అయ్యో నాపసుపో ..."బాగా సాగదీసి ఏడుస్తోంది వెంకి...

"ఇంజనీరు వచ్చాడూ ...? వీడికేం పోయేకాలం! వాడికేమోపాపం పెళ్ళయిందీ. ...తనేమో ఘోటక బ్రహ్మచారీ...ఏం? వాడు పదిరోజులాగివస్తే వీడి సామ్మేం పోయింది? ఒసేయ్ వెంకీ ... వాణ్ని ఎలా

(56-వ పేజీ చూడండి)

నక్షత్ర ఫలితాలు

(9-4-58 మొదలు 15-4-58 వరకు)

బి. నరసింగరావు

గ్రహస్థితి

ర	బు శు		
కు	13 తేదీని రవి మేషములో ప్రవేశించును. ధనుర్మకరకుంభములలో చంద్రుడు		
కు			
శ		గు రా	

అశ్విని [చూ, చే, చో, లా]

ఈ వారము అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. మిక్కిలి శ్రమపడినమీదట కార్యసిద్ధిని పొందుతారు. కోర్టువ్యవహారములు అనుకూలిస్తవి. ఇతరులకు సహాయముచేయుటకు పూనుకొని నెరవేరక నిందల పాలౌతారు. భార్య ఆరోగ్యము సరిగా వుండనందున అశాంతి కలుగుతుంది. ఉద్యోగస్తులకూ 13, 14, 15 తేదీలలో ఒత్తిడివున్ననూ తోటివారి సహకారమువల్ల సర్దుబాటుగా వుంటుంది. వర్తకులకు నిరాశగావున్ననూ 10, 11, 12 తేదీలలో స్వల్పలాభము కలుగుతుంది.

* భరణి [లీ, లూ, లే, లో] *

ఈ వారము మీరు మొదలుపెట్టిన కార్యములకు ఆటంకములు కలుగుతవి. మీ ఆలోచనలు ఇంకా కొంతకాలానికిగాని కార్యరూపము పొందవు. మీరు ధనవంతులై వుండిన్నీ సమయమునకు అవకాశములేక అప్పుచేయవలసి వస్తుందిగాని త్వరలో నే వద్దుకొని తీర్చివేస్తారు. దగ్గరబంధువులకు సహాయముచేయాలని తాపత్రయపడతారు గాని నెరవేరక మాటపడి మనోవ్యథ పొందుతారు. సాహసవంతులగుటచేతను పట్టుదలతో ప్రయత్నించి ఫలము పొందుతారు. వాహనములవల్లగాని యంత్రములవల్లగాని కలిగే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. లోహపు సామానులు, రంగులు వ్యాపారస్తులకు, భూస్వాములకు మేలుకాలము. 9 వ తేదీని ఆటంకములు. 10, 11, 12 తేదీలలో ఋణముచేయుట, తీర్చుట, కార్యసాధన. 13, 14, 15 తేదీలలో మనోవ్యథ, ప్రమాద భయం.

* కృత్తిక [అ, ఈ, ఊ, ఏ] *

ఈ వారము బంధుసహాయమునకు, అధికారుల సహాయమునకు, మీ బుద్ధిబలముతోనే మీకు కలుగుచున్న చిక్కులను పరిష్కరించుకొని ఫలము పొందుతారు. కవులు నూతన రచనలు ప్రారంభిస్తారు. ధనాదాయము తృప్తికరంగా యుంటుంది. ఈశాన్యదిక్కునుండి ఆత్మీయుల శుభవార్త తెలుస్తుంది. శిల్పులకు, నటీనటులకు యోగకాలము. వైద్యులకు లాభకరముగా యుంటుంది. 9 వ తేదిని శ్రమతోకూడిన కార్యక్రమము. 10, 11, 12 తేదిలలో ధనాదాయము, బంధుసహాయము, కార్యానుకూలత. 13, 14, 15 తేదిలలో అధిక ఖర్చులు, అలసట.

*రోహిణి [ఓ, వా, వీ, వూ] *

ఈ వారము మీకుయోగకాలము. ఉన్న యిబ్బందులు తీరిపోతాయి. అనుకున్న సొమ్ము చేతికి వస్తుంది. కోర్టువ్యవహారములు అనుకూలముగా తీర్పు అవుతాయి. పిల్లల అభివృద్ధికి కొన్ని ఏర్పాట్లు చేస్తారు. పండితగోష్ఠివల్ల నూతనాంశములు తెలిసికొంటారు. ఉపాధ్యాయులకు, పండితులకు, న్యాయవాదులకు మంచికాలము. నటీనటులకు యోగము. 9 వ తేదిని అలజడితో కూడిన కార్యక్రమము. 10, 11, 12 తేదీలలో శుభయోగములు 15 వ తేదిని మనోవ్యథ.

* మృగశిర [వే, వో, కా, కీ] *

ఈ వారము మీ ఆర్థికస్థితి, పదవి, ఎక్కువవుతాయి. బంధువులను కలుసుకొంటారు. కవులతోను, గాయకులతోను వినోదిస్తారు. ఇంట్లో వారికి కల్గిన అనారోగ్యము నరవుతుంది. దూరస్థులయిన ఆప్తుల క్షేమం తెలిసి ఆందోళన తొలగుతుంది. బియ్యము, నూలుబట్టలు, వెండినగలు వ్యాపారస్థులకు లాభయోగము. కవులకు, గాయకులకు, నటీనటులకు మేలుకాలము. 9 వ తేదిని శ్రమగల కార్యక్రమము. 10, 11, 12 తేదీలలో ప్రయాణము, లాభము, బంధు సమాగమము, మృష్టాన్న భోజనము. 14 న శుభవార్త 15 అస్వస్థత.

* ఆరుద్ర [కూ, ఘ, ఙ, ఛ] *

ఈ వారము మీకుయోగదాయకము. గత వారం పూర్తిగాకుండా నిలిచిపోయిన పనులు ఈ వారము లాభకరంగా ముగుస్తాయి. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటారు. నూలు, బట్టల వ్యాపారస్థులకు యోగము. కవులకూ, గాయకులకూ, కళాకారులకూ మేలుకాలము. 9 వ తేదిన తీరికలేని కార్యక్రమము. 10 11 12 13 తేదిలలో కార్యలాభము. స్త్రీలతోను ఆప్తులతోను, విందు, వినోదము, శుభవార్త 15 న అలసట.

* పునర్వసు [కే, కో, హా, హీ] *

ఈ వారము శ్రమదాయకముతో కూడిన కార్యక్రమమువల్ల తీరిక వుండదు. యత్నకార్యములకు విఘ్నములు కలుగుతాయి. ఆర్థికస్థితి సరిగా వుండనందున అవసరాలు, తీరక యిబ్బంది అవుతుంది. అకాలభోజనమువల్ల ఆరోగ్యము భంగపడుతుంది. వెంటనే శ్రద్ధవహించండి. వర్తకులకు శ్రమ ఎక్కువ. 9 వ తేదిని ఉద్యోగస్థులకు ఒత్తిడి. 10 11 12 13 తేదిలు రాజకీయవాదులకు అనుకూలము, స్వల్పలాభము. 15 వ తేదిన అనారోగ్యము.

పుష్యమి [హూ, హే, హో, డా]

ఈ వారము మీకు మిశ్రమయోగము. మొదట్లో నిరాశగా ఉన్నప్పటికి క్రమేణా మిత్ర సహాయమువల్ల కార్యలాభము పొంది తృప్తి చెందుతారు. ఉద్యోగస్థులకు ధనలోపమువల్ల, అలజడి, వ్యాపారస్థులకు మాంద్యము 9 వ తేదిని, నిరాశ, గృహకలతలు, మనోవ్యథ 10 11 తేదిలలో ప్రయాణము, మిత్రసహాయము. 12 13 తేదిలలో కార్యసిద్ధి, విదేశీయుల పరిచయము, విచిత్ర వస్తు సంపాదన 15 న ఆరోగ్యభంగము.

* ఆశ్లేష [డీ, డూ, డే, డో] *

ఈవారము బంధువుల రాకవలన ఖర్చులు ఎక్కువ. తలపెటిన పనులకు ఆటంకము, గృహకలతలవల్ల మనోవ్యథ ఉంటుంది. పీఠాధిపతులవంటి మతగురువుల బోధనవలన మనోవికాసము కలుగుతుంది. ఉద్యోగస్థులు కొంత శ్రమపడిన మీదట మేలును పొందుతారు. 9 వ తేదిని ఆటంకములు, అధిక ఖర్చులు 10, 11, 12 తేదిలలో సాధుసాంగత్యము, ఆత్మవికాసము, స్వల్పలాభము

★ నక్షత్రఫలితాలు ★

13, 14, 15 తేదిలలో బంధువుల రాక, ఆందోళన.

* మఖ [మా, మీ, మూ, మే] *

ఈవారము మీరు పరోపకారముకొఱకు ఎక్కువ శ్రమ పడికూడా మాట దక్కక చింతిస్తారు. ధనలోపమువల్ల అలజడిగా ఉంటుంది. ఇచ్చి పుచ్చుకొనేపట్ల ఒత్తిడి ఎక్కువై వివాదపడతారు. కోర్టు వ్యవహారములు సుముఖమవుతాయి. ఇంట్లో స్త్రీల ఆరోగ్యము సరిగా యుండదు. 9 వ తేదిని ఆటంకములు, ధనలాభము. 10, 11, 12 తేదులలో కొంత కార్యానుకూలత 13, 14, 15 తేదిలలో వివాదము, ఆరోగ్య చింత.

* పూర్వఫల్గుణి (పుబ్బ) *
[మో, టా, టీ, టూ,]

ఈవారము ఎంతో వుత్సాహముతో కార్యసాధనకు ప్రారంభించినప్పటికీ ఆటంకములు కలుగుతాయి. అయిననూ నిరుత్సాహపడక ప్రయత్నములను మానకుండా చేయుటచేత తుదకు మీకు అనుకూలముగా ఫలము కలుగుతుంది. రాబడి చాలక, ఖర్చులు ఎక్కువగుటచేత కుటుంబ కలతలు వచ్చి మనోవ్యధ కలుగుతుంది. అవయవములకు దెబ్బలు తగిలే ప్రమాదం ఉంది. జాగ్రత్త వల్ల తప్పవచ్చును. ఉద్యోగస్థులకు అధికారులచే మాట పడవలసి వస్తుంది. ఖనిజములు, లోహములు, రంగులు వ్యాపారస్థులకు శ్రమతోకూడిన లాభము. 9 వ తేదిన ధనలోపము, ఆటంకములు 10, 11, 12 తేదిలలో కార్యానుకూలత, సోదరసహాయము 13, 14, 15 తేదిలలో అనారోగ్యము, ప్రమాద భయము.

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) *
[టే, టో, పా, పి]

ఈవారము మీ ప్రజ్ఞను ఉపయోగించి చేసే ప్రయత్నములు నెరవేరతాయి. ఆదాయం బాగుంటుంది. అధికారుల ఆదరణ లభిస్తుంది. ప్రయాణము వల్ల నూతన మిత్రలాభము, శుభకార్య నిశ్చయము. జరుగుతాయి. కవులకు సన్మానము. శిల్పులకూ, చిత్రకారులకు వైద్యులకు మేలు కాలము 9 వ తేదిని అధిక ఖర్చులు, ప్రయాసము 10, 11 తేదిలలో ప్రయాణము. మిత్రలాభము. 12, 13 తేదిలలో కార్యసిద్ధి. 14వ తేది అస్వస్థత.

* హస్త [పూ, ష, ణా, ఠ] *

ఈ వారము మీకు మంచియోగకాలము, ధనయోగంకలుగుతుంది. పురాణగ్రంథపఠనము వల్ల మీ జ్ఞానం అభివృద్ధి అవుతుంది. కోర్టు వ్యవహారములు అనుకూలిసవి. ఉద్యోగులకు హోదా పెరుగుతుంది. ఉపాధ్యాయులకు, పండితులకూ, న్యాయవాదులకూ, కళాకారులకూ మేలుగా యుంటుంది. 9 వ తేదిని కార్యసాధనలో శ్రమ. 10, 11, 12, 13 తేదిలలో ధనయోగము, కార్యానుకూలత, పండిత గోష్ఠి. 15 అలసట.

చిత్త [పే, పో, రా, రీ]

ఈ వారము మీరు తలపెట్టిన పనులు నిర్విఘ్నముగా నెరవేరతాయి. అనుకున్న డబ్బు చేతికి వస్తుంది. ఆప్తుల క్షేమం తెలుస్తుంది. బంధుమిత్రులతో కలసి వినోదములలో పాల్గొంటారు. నూలు, బటల వ్యాపారస్థులకు లాభము. 9 తేదిన కార్యాచరణలో త్రిప్పట, ప్రయాసము. 10, 11, 12, 13 తేదిలలో ధనయోగము, కార్యసిద్ధి, వినోదములు, మృష్టాన్నభోజనము, కవులకు, కళాకారులకు నటనటులకూ యోగకాలము 14, 15 తేదిలలో నిలకడలేని స్థితి.

* స్వాతి [రూ, రే, రో, తా] *

ఈ వారము యోగప్రదముగా యుంటుంది ధనాదాయము బాగుంటుంది. మీ పనులనేకాకుండా యితరుల పనులుకూడా మీరు తలపెట్టి నిర్వర్తిస్తారు. కోర్టు వ్యవహారములు అనుకూలము. వాహనయోగము బాగుంది. శుభ కార్యాలోచనలు చేస్తారు. ఇంట్లో పాడి, పశువు సంపదవృద్ధి అవుతాయి. ఖరీదైన వస్తువులు క్రయ విక్రయములలో లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. 9 వ తేదిన కార్య తొందరచే అలసట ఆపైని ధనలాభము, కార్యసిద్ధి, విందు, వినో[illegible]

విశాఖ [తీ, తూ, తే, తో]

ఈ వారము మీకు ఏమంత యోగకాలముకాదు యత్నకార్యములకు ఆటంకాలు వస్తాయి. కార్యభారము ఎక్కువ. అనుకున్నటుగా డబ్బు రానందున అవసరములు తీరక ఇంట్లో అసంతృప్తి కలుగుతుంది. వేళ తప్పిన భోజనమువలన ఆరోగ్యము సరిగావుండదు. వెంటనే శ్రద్ధ తీసుకోండి ఉద్యోగస్థులకు క్రొత్త సమస్యలు; వర్తకులకు ఆందోళన. 9 వ తేదిన కార్యభంగము, శ్రమ, అశాంతి. 10, 11, 12 తేదిలలో పితృవర్గ సహాయం, లాభం. 14, 15 తేదిలలో ఆరోగ్యభంగం.

——ధరలు:——

నూలు, వస్త్రములు: సమస్థాయిలో వుండును.

నూనె దినుసులు: స్వల్పముగా హెచ్చును.

బెల్లము, పంచదార: మార్పు లేదు.

చింతపండు: మార్పు లేదు.

ఆహారధాన్యములు: సమస్థాయిలో వుండును.

పప్పు దినుసులు: మార్పు లేదు.

వెండి, బంగారము: కొంచెము తేడాలో వుండును.

ఎండలు ఎక్కువగా వుండును. అచ్చటచ్చట వర్షించును.

* * *

జన్మనక్షత్రము బట్టిగాని, జన్మనక్షత్రము నెరుగనివారు నామనక్షత్రము (వారి వారి పేర్ల ననుసరించి పేరు మొదటి యక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకొనునది. కృష్ణుడను పేరునకు మృగశిరా నక్షత్రమును, హృషుడను పేరునకు స్వాతియు, శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్రపాలకుడనే పేరునకు హస్తయును, భీముడు, భైరవుడు అనే పేర్లకు పూర్వాషాఢయును చూచుకొనునది.

అనూరాధ [నా, నీ, నూ, నే]

ఈ వారము అనుకొన్న సొమ్ము సకాలంలో చేతికిరాదు. ఏ పని చేసిందికి ఎటూ నిశ్చయించలేనిస్థితిలో ఉంటారు. తలపెట్టే పనులకు మొదట్లో ఆటంకాలుకలిగినా వారాంతమున మిత్రసహాయంవల్ల కార్యసిద్ధిని పొందుతారు. 9 వ తేదిని ఆర్థికలోపము, కార్యభంగము. వర్తకులకు నిరాశగావున్నా [illegible] చయం. 14, 15 తేదిలలో యింటియందుండు వారి ఆరోగ్య చింత.

జ్యేష్ఠ [నో, యా, యీ, యూ]

ఈవారము మీకు మిశ్రమయోగము. అనుకున్నట్టుగా పనులు జరగవు. ధనలోపము వుంటుంది. కోరిన సహాయము లభించదు. అవసరములు తీరక ఆందోళన కలుగుతుంది. దైవముపై భారము వేసి కార్యసాధనకు ప్రయత్నించి ఫలమును పొందుతారు. వర్తకులకు

మొదట్లో త్రిప్పట, ఆశాభంగము, వారాంతములో లాభము. 9 వ తేదీన త్రిప్పట, కార్యభంగము, శ్రమ 10,11,12 తేదీలలో పుణ్యపురుషుల సాంగత్యము, శాంతి, కార్యలాభము. 14,15 తేదీలలో ఇంట్లో వున్న పెద్దల ఆరోగ్యముగురించి ఆందోళన.

* మూల [యే, యో, బా, బీ] *

ఈ వారము అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. కొరు వ్యవహారములు అనుకూలమైనా, మరికొన్ని క్రొత్తవి తలెత్తుతాయి. ఇచ్చి పుచ్చుకునే చోట వివాదాలు వచ్చి మనోవ్యధ కలుగుతుంది. భార్య ఆరోగ్యము చెడే సూచన లున్నవి. విద్యార్థులకు చదువు సరిగా జరుగదు. వర్తకులకు శ్రమతో కూడిన లాభము. 9 వ తేదిని కార్యభంగము, వివాదము 10,11,12 తేదిలలో కార్యానుకూలత, కర్రలో బొమ్మలు చేయువారికి లాభము. 14,15 తేదీలలో ఆరోగ్యచింత.

పూర్వాషాఢ [భూ, ధ, ఫా, ఢ]

ఈ వారము ఎంత ప్రయత్నించినా కార్యసాధనలో ఫలముండదు. సాహసము, పట్టుదల గలవా రగుటచే విడనకుండా చిక్కులను విప్పుకొని మేలుపొందుతారు. సోదర సహాయమువల్ల ఒడదుడుకులు సర్దుకుంటాయి. జాగ్రత్తవుంటే ప్రమాదములు తప్పుతాయి. 9 వ తేదీన కార్యభంగము, మనోవ్యధ. 10,11,12 తేదీలలో సోదర సహాయము, కార్యానుకూలత, శుభయోగము, పోలీసు, ఇంజనీరింగ్ శాఖల ఉద్యోగుల కుపయోగం. 15 వ తేదిన ప్రమాదభయం.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈ వారము మీకు యోగదాయకము. మీ ప్రజ్ఞచేత కార్యసాధనలో జయమును పొందుతారు. అధికారుల సహాయము కలుగుతుంది. నూతనవ్యక్తుల పరిచయము కలుగుతుంది. బంధువుల కుశలవార్త వింటారు. గణితశాస్త్రజ్ఞులకు, కళాకారులకు, కవులకు, చిత్రకారులకు యోగకాలము. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటారు. 9 వ తేదీన కార్యలాభముచే త్రిప్పట. 10, 11, 12 తేదీలలో కార్యసిద్ధి, మిత్రలాభము, కుశలవార్త. 14, 15 తేదీలలో శ్రమ, ఆందోళన.

శ్రవణము [జూ, జే, జో, ఘా]

ఈ వారము మీకు యోగప్రదము. పోయినవారములో పూర్తికాకుండా నిలచిపోయిన పనులు ఈ వారములో సానుకూలమవుతాయి. రాబడితోపాటు అధికారముకూడా పెరుగుతుంది. ఉపాధ్యాయులకు, న్యాయవాదులకూ, పండితులకూ, మేలుకాలము. 9 వ తేదీన త్రిప్పట, శ్రమ. 10, 11, 18 తేదీలలో ధనలాభము, కార్యానుకూలత, సంతానమునకు క్షేమాభివృద్ధి, వర్తకులకు లాభము. 14, 15 తేదీలలో అలసట. అస్వస్థత.

ధనిష్ఠ [గా, గి, గూ, గే]

ఈ వారము మీరుచేసే ప్రయత్నము లన్నీ యింటాబయట కూడా తృప్తికరంగా సానుకూల మవుతవి. ఆర్థికస్థితి బాగుంటుంది. బంధుమిత్రులతో కలసి కవితాగోష్ఠి మున్నగు వినోదములలో పాల్గొంటారు. ఇంట్లోవారి ఆరోగ్యము బాగుపడుతుంది. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటారు. నూలు, బట్టలు, వెండి వ్యాపారస్థులకు లాభము. 9 వ తేదిన కార్యములపట్ల త్రిప్పట, అలసట. 10, 11, 12 తేదీలలో ధనలాభము, కార్యసిద్ధి; కవులకూ, గాయకులకూ, నటీనటులకు యోగకాలము. 14, 15 తేదీలలో అస్వస్థత.

*శతభిషం [గో, సా, సీ, సూ]

ఈ వారము మీ ఆదాయం పెరుగుతుంది. యత్నకార్యములు ఫలిస్తాయి. కవులు, గాయకులు, కళాకారులతో వినోదిస్తారు. దూర ప్రయాణం చేయవలసి వుంటుంది. సాంఘిక కార్యములలో పాల్గొంటారు. శుభకార్యాలోచనలు, బంధుమిత్రులతో విందుభోజనము జరుగతవి. కవులకు, గాయకులకూ, కళాకారులకూ, నటీనటులకు మంచికాలము. 9 వ తేదిన త్రిప్పట, శ్రమ. 10, 11, 12 తేదీలలో ధనలాభము, కార్యసిద్ధి, ప్రయాణము, శుభకార్యాలోచన, విందుభోజనము. 18, 14, 15 తేదిలలో ప్రయాసము.

పూర్వాభాద్ర [సే, సో, దా, దీ]

ఈ వారము డబ్బునుగురించి ఎక్కువ కష్టము కలుగుతుంది. సర్దుబాటు చేసుకొనవలసిన విషయాలు ఎక్కువవుతాయి. ఏ కార్యము నెరవేరదు. అకాలభోజనమువల్ల ఉష్ణాధిక్యముకలిగి అనారోగ్యచిహ్నాలు కనబడినవెంటనే శ్రద్ధతీసుకోండి. ఉద్యోగస్థులకు బాధ్యతలుఎక్కువ. ఆదాయాభివృద్ధి. విద్యార్థులకు చదువు సరిగాసాగదు. 9 వ తేదిన త్రిప్పట, కార్యభంగము అధికఖర్చులు. 10, 11, 12 తేదిలలో ప్రయాణము, రాజకీయవాదులకు లాభము. 14, 15 తేదిలలో ఆరోగ్యభంగము.

* ఉత్తరాభాద్ర [దూ, శం, ఝా, థా]*

ఈ వారము ఏపనిచేసిందికి సమాధానము కుదరక చికాకుపడవలసి వసుంది. ప్రతి ప్రయత్నము కొన్నాళ్ళుపోయేక అయేటట్లు వుంటుంది. కార్యసిద్ధికి శ్రమపడుతుకూడా మాటపడవలసి వుంటుంది. సకాలములో డబ్బు చేతికి రాకపోవడము అన్నిటికన్న పెద్ద ఆటంకము. అయినా వారాంతములో మీకన్న పై అధికారంలోవున్న వారిసహాయము వల్ల కొన్ని ప్రయత్నములు ఫలిస్తాయి. 9 వ తేదిన చాంచల్యము, ఆందోళన. 10, 11, 12 తేదిలో ప్రయాణము, కార్యలాభము. 14, 15 తేదీలలో అనారోగ్యము.

* రేవతి [దే, దో, చా, చీ] *

ఈ వారము మీరు ఎవరిసహాయంతో పని నెరవేర్చుకోవాలనుకుంటారో, ఆ వ్యక్తి వల్లనే మీకు ఆటంకములు కలుగుతాయి. డబ్బుకు తొట్రుపాటుఎక్కువ. అయిననూ ఆధ్యాత్మికచింతగలవారగుటచేత ఈశ్వరకృప వల్ల అన్ని కష్టములు తీరుతాయనే ధైర్యంలో వుంటారు. ఇంట్లోవారి ఆరోగ్యము ఆందోళన కలుగచేస్తుంది. ఉద్యోగస్థులకు ఒత్తిడి; వ్యాపారస్తులకు నిరాశ. విద్యార్థులకు చదువుమీద అనాసక్తి. 9 వ తేదిన ఆటంకమువల్ల అశాంతి. 7, 8, 9 తేదిలలో సాధుసాంగత్యము, ఆత్మశాంతి. 14, 15 తేదిలలో ఆరోగ్యచింత. ★



ఆత్మ విమర్శన లేనివారు అథః పతనం పొందవలసినదే-ప్రతిమనిషీ, ప్రతి జాతీ కూడ అప్పుడప్పుడు ఆత్మవిమర్శనం చేసుకొంటూ ఉండడం ఉజ్వలభవిష్యత్తుకు దారి తీస్తుంది.

తరతరాలనుండి విద్యావంతులు కాక పోవడమో మరేమో కాని స్త్రీలు ఎదుటి వారిని గౌరవించడంలో కొంత అవినీతిని ప్రదర్శిస్తున్నారు. ఇట్లా వ్రాస్తున్నానని ఆగ్రహించకండి. మనలో నూటికి నూరు మంది కాకపోయినా నూటికి తొంభైమంది యయినా ఈ శ్రేణిలో లెక్కించ నర్హులవుతూంటారు. భార్యాత్వం సిద్ధించినప్పటి నుండి మనుషులలో అనుకోని మార్పులు అవతరిస్తూంటాయి. పాణిగ్రహణంతో పట్టమహిషీత్వం సిద్ధించకపోయినా, అంతటిసంతృప్తి పొందుతాము మనం. నాటినుండే ఒక కుటుంబానికి బాధ్యతగల యజమాని పదవి, నిర్వహించవలసిన అవసరం వస్తుంది. యజమానురాలుగా మరి ఒకరి మాన్యతను తనే గాక తనకాశ్రయ మిచ్చినవారికి కూడ సంపాదించవలసిన బాధ్యతగల పదవది. పదిమందిలో తలెత్తుకుతిరుగు పతుల గౌరవమును రక్షించవలసిన పదవది. గృహిణీ ధర్మనిర్వహణంలో తన వల్లభునకు చేదోడు వాదోడుగా వుండవలసిన పదవది. తన్ను గూర్చి "ధర్మేచ, అర్థేచ, కామేచ, నాతిచరామి" అని అగ్నిసాక్షిగా ప్రతినలు పల్కిన పతి అడుగుజాడలలో సంచరించవలసిన పదవది!

ఎంతమంది గృహిణులు, ఎందరు వనితలు, ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తున్నారు. అనే ప్రశ్నకు జవాబు శూన్యమే కదా! తనభర్త అవునన్నది కాదనడం ఘనతగా భావించే స్త్రీలు ఎందరులేరు! ఈ గయ్యాళులను చూచి ఆ గృహప్రాంగణాల లోనికి వెళ్ళడానికి భయపడతామేం! మనమే కాదు వారివారి భర్తలుకూడా అంతే! కారణం-అతడు ఎంతటి వాడయినా సరే - కలక్టరంతటివాడు కూడా ఇంట్లో భార్యకు వాడలిపోవలసినదే! ఇది నేటిది కాదు. తరతరాలనుండి వస్తోన్న వారసత్వం. పూర్వకాలంలో రాజులకు అందరూ భయపడేవారు; వారు వారి శ్రీమతులకు జడిసేవారు. సత్యభామ జగత్పూజ్యుడయిన తన భర్తను కాలితో తన్ని, పాపం, ఘనత సంపాదించింది! ఈ రక్కసితనం తమ భర్తలవరకే ప్రత్యేకించబడదు. అది అవధులు దాటి అందరిమీదకు ప్రసరించి అధః పతనాన్ని అందిస్తోంది. ఎంతనీచం! ఎంతటి అజ్ఞానం! "తప్పులెన్నువారు తమ తప్పు లెరుగరన్నట్లు" మన మహిళలు ఎదుటి వారిని విమర్శించడంలో అగ్రగణ్యులే. ఈ విమర్శనలు తీవ్రాతితీవ్రములయి ఒక్కొక్కప్పుడు విపరీతాలకు దారితీస్తాయి. పల్లెటూరి మహిళామండలులలో ఈ చర్చలు ఏరూపాలు ధరిస్తాయో తెలుసుకోడం బహు కష్టతమంగా ఉంటుంది. ఎదుటివారు వింటే ఏదయినా అంటారనిగాని, లేక, నొచ్చుకుంటారనిగాని ఏమాత్రం ఆలోచించే అవకాశం ఈయరు.

ఈమధ్య మేము చదువుకొనే ఆడపిల్లలందరూ మాన్యులుమాస్టరుగారింటికివెళ్ళేము. మాస్టరుగారు మిక్కిలి ఉత్తములు. మమ్మల్ని చూచినవెంటనే గౌరవించాలనే తలపుతో తాగడానికి మంచినీళ్ళు తీసుకొనిరమ్మని భార్యామణిగారిని గట్టిగా పిలచేరు. వారు వంటింట్లో ఉన్నారేమో, తడవతడవకు వచ్చినవాళ్లందరికీ మంచినీళ్లు ఈయడం నా పనికాదని గట్టిగా అక్కడనుండే అరచింది ఆ ఇల్లాలు! పరువు కాపాడుకోవాలనేమో మా మాస్టరుగారు "బడిలో చదువుకొనే ఆడపిల్లలు వచ్చారు; తొందరగా తీసుకొనిరా" అని మళ్ళీ సర్దుతూ పిలచేరు. ఆ తల్లి-అపర కాళికావతారం కాబోలు - అక్కడనుండే "ఈ ఆడపిల్లలు సిగ్గువిడచి ఇట్లా ఇళ్ళంబడి తిరుగుతూఉంటే మంచినీళ్లు అందించడానికి ఇక్కడ దాసీలెవరు లేరు. కావలసివస్తే మీరు బావిలోంచి తోడుకొని పట్టుకొని వెళ్లండి" అని ఇల్లంతా ప్రతిధ్వనించేటట్లు జవాబిచ్చింది!

మాస్టరుగారు గౌరవభంగం అవుతోందని చిన్నబుచ్చుకొన్నారు. మేము "ఇంక వెళ్ళి వస్తాం సెలవియ్యండి" అని చెప్పి బయలుదేరేము. చిన్నబుచ్చుకొని అట్లాగే మాట్లాడకుండా నిలబడిపోయేరు పంతులుగారు!

మరొకసారి మేము నలుగురు స్నేహితులం కలసి దేవాలయానికి వెళ్ళేము. అక్కడ ఒక స్త్రీ దేవతాదర్శనానికి వచ్చివున్నది. ఆమె మడిట-మేము తొందరగా లోనికి వెళ్ళి దేవతాదర్శనం చేసుకుందామనుకుంటున్నాము. రుసరుసలాడిపోతూ ఆమె మా రాకను వ్యతిరేకించింది. దేమునకు అందరూ సమానులనీ ఏమేమో మేము చెప్తూఉంటే ఆమె "మాలచదువులు చదివి తెలివి మీరేమనీ. ఒకరి ఆజ్ఞ అన్నది లేదనీ" రుసరుసలాడుతూ ఏమేమో మాపై విసరింది. ఇంకా ఇట్లాంటివి ఎన్నో ఉదాహరణలు! ★

ఆడవాళ్లు; ఆత్మహత్యలు

... ఉద్ధరించారు!

★ వీరంరాజు వెంకటరమణాదేవి ★

'స్త్రీలు—ఆత్మహత్యలు' అనే శీర్షిక క్రింద శ్రీమతి ఆదిమధ్యం రమణమ్మ గారి వ్యాసానికి మేరీగారు సమాధాన మిచ్చింది. సర్వసాధారణంగా స్త్రీలు ఏయే పరిస్థితుల్లో ఆత్మహత్యలు చేసుకుంటారో శ్రీమతి రమణమ్మగారు చెపుతూ దుండగులు, త్రాగుబోతులైన భర్తలు, కఠినచిత్తులైన అత్తలు, తలిని కాదనలేక భార్యను రక్షించలేక అయోమయ అవస్థలోపడిన భర్తలు, ఒకదుండగునిచే, వంచకునిచే మోసగింపబడి కాలుజారిన పతితలు సంఘం వత్తిడికి తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటారని వ్రాసింది. మేరీగారు మొగవారిని వెనకేసుకొని, అత్తలు, భర్తలు కారణం కాదని, అత్తల అధికారం అంతరించి ఎంతోకాలం అయిందని, కోడలికి స్వాతంత్రం వచ్చిందని రోజులుమారాయి అని సంఘం స్త్రీల హక్కులు—ఆస్తికి, విడాకులకు, పునర్వివాహానికి గుర్తించిందని, అందువల్ల పురుషుడు గానీ, అత్తగాని సంఘంగాని చెప్పుకోదగ్గ కారణాలు కావని సమాధానం యిచ్చింది. కాని పాతివ్రత్యం అనేది ఒక మూఢాచారమని, ఇది నల్లమందు లాంటిదని అభిప్రాయ పడ్డది. పైగా భారతీయ నారీలోకంలో ప్రాచీనయుగంలో ప్రామాణికంగా ప్రాధాన్యత, కీర్తిప్రతిష్ఠలు గడించిన నారీమణులందరూ ఈ మెప్పుకోలులో మూఢాచార పారీణుల కాబోలు!

పతిని ప్రేమించటం (సినిమాస్థాయి ప్రేమ గాదు, పాశ్చాత్యలోకంలో చిత్రింపబడుతున్న ప్రేమ అసలే కాదు.) సామాన్యంగా, లోకంలో, పరస్పర అందచందాలవల్ల, భోగభాగ్యాలవల్ల, చదువు సంధ్యలవల్ల—అన్నీ కలిసిగాని, ఏ ఒక్క కారణం ప్రధానంగాగాని—ఒకరినొకరు ప్రేమించుకుంటారు; పెండ్లి చేసుకుంటారు. నూటికి ఏ అయిదారుగురినో మినహాయిస్తే, మిగతా 95 మంది తల్లిదండ్రులు యేరి కోరిన భర్తలనే పిల్లలు పెండ్లి చేసుకుంటున్నారు. పెండ్లి చేసుకున్న తర్వాత వారు ప్రేమించుకుంటున్నారు.

ప్రేమ స్థాయిని అధిగమించితే భక్తి అవుతుంది. దంపతుల ప్రేమలో మనం ఎంత కాదని వాదించినా కొంతవరకు భౌతికత ఉండకమానదు. కామాన్ని పూర్తిగా కొట్టివేయటానికి వీల్లేదు. అయితే దాంపత్యానికి అదే పరమావధి కాదు; అదే ఆదర్శం కాదు. అందచందాలు యౌవనోత్సాహాలు శాశ్వతముగా వుండవు. ఆ తర్వాత భార్యాభర్తలను కలిపి వుంచే బంధాలు పిల్లలు. అప్పుడు స్త్రీ ప్రేమను పంచుకుంటేవారు భర్త, పిల్లలు.

స్త్రీకి పత్నీధర్మమే అత్యంత ప్రధానమైన దన్నారు ఋషులు.

స్త్రీలను వంచించటానికే పాతివ్రత్యమనే మందు నూరిపోశారని, ఆ మహత్తు సంపాదించడానికే స్త్రీలు ఒళ్లు విరుచుకొని పడరాని కష్టాలన్నీ పడ్డారని, అవమానాలన్నీ భరించారనీ మేరీ వ్రాసింది. అసలు మహత్తు వస్తుందా అనేదొక ప్రశ్న. పాతివ్రత్యమువలనే గాదు, ఏ ఆదర్శం కోసమయినా నిస్వార్థయుతంగా, కీర్తి కాంతులు కోరకుండా, సర్వస్వార్పణ చేస్తే ఎవరికయినా మహత్తర శక్తులు వస్తాయి. తలిదండ్రులను పూజించి, సేవించి చరితార్థులయ్యారు ధర్మవ్యాధ పుండలీకులు. గురువును సేవించి మహాశక్తి సంపన్నులయ్యారు శంకరాచార్య వివేకానందాదులు - భక్తితత్వం పురుషులలో విషం నూరిపోసిందా? పాతివ్రత్యం స్త్రీలలో ఎందుకు నూరిపోస్తుంది? దుష్టవానిని మంచివానినిగా చేశాడని, చచ్చిపోయిన వానిని బ్రతికించాడని క్రీస్తును మోసగాడని అంటామా?

పాతివ్రత్యానికి ప్రారంభం వివాహం. వివాహం అనేది స్త్రీ పురుషులకు ప్రేమబంధం. ముక్కూ మొఖం తెలియని ఒక పురుషుని ఒక స్త్రీని సంసార బంధంలో ఇరికించే ఒక త్రాడు. అది శాశ్వతబంధం. దీనిని రోమన్ కేథలిక్ క్రైస్తవమతం అంగీకరిస్తుంది. దీనిని పవిత్రబంధంగా, ఎంచి ప్రతిమానవుడు విధిగా అనుసరించవలసిన ధర్మం అని అంటుంది. వివాహం ఎప్పుడైతే కాంట్రాక్టో అది తాత్కాలిక సంబంధమవుతుంది. ఇష్టమున్నంతవరకే సంబంధం. ఇష్టం అనేది వ్యక్తుల మానసిక స్థాయినిబట్టి వుంటుంది. నేడు కాంట్రాక్టు భావనవున్న దేశాల్లో అందచందాలు, భోగభాగ్యాలు వున్నంతవరకే అనే భావన వ్యాపించింది. ఫ్రాన్సు, బ్రిటన్, అమెరికా కోర్టులకు పెండ్లిండ్లు రద్దు చెయ్యటమే ప్రధానమయిన పని అయింది. ఎన్ని పర్యాయాలు విడాకులుఇస్తే సమాజంలో అంత నవీనత, అభ్యుదయంగా ఎంచుకుంటున్నారు.

భర్త కురూపియైనా, అంధుడైనా, బధిరుడైనా, రోగిష్ఠియైనా భార్య సేవ చెయ్యాలన్నారు. పెండ్లిచేసేటప్పుడు, తెలిసి, ఏ తండ్రీ తనకుమార్తెను దుర్మార్గుని చేతిలో, గ్రుడ్డివాని చేతిలో, రోగిష్టివాని చేతుల్లో పెట్టడు. మొట్టమొదట ఇద్దరు బాగావుంటారు. కాని జీవితమధ్యంలో ఇల్లాంటివి సంప్రాప్తిస్తే వదిలివెయ్యవలసినదేనా ... అంటే భారతీయధర్మం వవలరాదంటున్నది. తన భర్తకు దుర్గతివచ్చినప్పుడు వదలటం అనేది మానవ ధర్మానికి వ్యతిరేకం. అతడిని సేవించటమే, అతడిలో భగవానుని దర్శించటమే స్త్రీ పరమధర్మం అన్నారు మహర్షులు. అందం చందం, ధనం సంపద, వున్నప్పుడు ఏ స్త్రీయైనా, తన భర్తను గౌరవిస్తుంది కాని అవన్నీ పోయినప్పుడు భార్య భర్తను ఇదివరకులాగానే ఆరాధించటంలో విశేష వ్యక్తిత్వం వుంది. అదే ఆమెలో మహనీయ శక్తులను ప్రసాదిస్తుంది. ఆ రహస్యం కనుగొనలేక సతీసుమతిని అవహేళన చెయ్యటం అవివేకం. ఆ ఆదర్శం అక్కడి స్త్రీలకు లేనందువల్ల భర్త అడ్డకాళ్ళతో నడుస్తున్నాడని, నిద్రలో గురక పెడుతున్నాడని తనకిష్టమయిన నూటు వేసుకోవటం లేదని అమెరికా ఫ్రాన్సు దేశాల్లో విడాకులివ్వటం జరుగుతున్నది.

స్త్రీ పతనమవటం ప్రారంభిస్తే ఆమెను దేవుడైనా ఆపలేడు. ఎమిలీ జోలా వ్రాసిన 'మదాం బోవెరీ', టాల్‌స్టాయి వ్రాసిన 'అన్నా కరెన్నా' నవలలు చదివితే సాధారణంగా సంసారం చేసుకుంటే స్త్రీలు దారి తప్పితే ఎటువంటి ఘోరపతనస్థితి కొస్తారో తెలుస్తుంది. పతనం ఎవరికైనా ఒకటే.

వ్యాసవాల్మీకులు స్త్రీలను ఉద్ధరించారు

అయితే స్త్రీ పతనం కారాదు అంటారు భారతీయ మహర్షులు.

పురుషుల లోకధర్మమూ, స్త్రీల లోక ధర్మమూ అంటారేమో! స్త్రీ ప్రవృత్తి దేహస్థితి వేరు; పురుషుడు వేరు. స్త్రీలలో ప్రత్యేకత వందనీయమైన మాతృత్వం. అది పురుషుడికి వస్తుందా? ఎంత పెద్ద మొనగాడైనా ఇద్దరు పసిపిల్లలను సముదాయించమనండి ఆయన పస తెలుస్తుంది. అది స్త్రీకి నిర్ణయించిన ప్రత్యేకరంగం.

పురుషుడు పతనమయితే తానొక్కడు కొంతవరకు తనభార్య, కొద్దిగా పిల్లలు చెడవచ్చు. కాని తల్లి సౌశీల్యవతి అయివుండి తండ్రి దుర్మార్గుడయినా పిల్లల కెటువంటి నష్టం కలుగదు. కాని తల్లి పతిత అయి, తండ్రి ఎంత మహాపురుషుడయినా ఆ పిల్లల అధోగతి చెప్పనక్కరలేదు. తల్లి పతిత అయితే బిడ్డ ఎంత వ్యధపడుతుందో కుమారుడు ఎటువంటి మానసిక అవ్యవస్థలో పడిపోతాడో షేక్స్పియర్ మహాకవి 'హేమ్లెట్'లో చక్కగా చిత్రించాడు. అందువల్ల పురుషునితో స్త్రీ పతనంలో పోటీ పడరాదు.

స్త్రీని పాతివ్రత్యం అవలంబించమని పురుషులకు బహుభార్యాత్వం శాసించిన ఋషి నా కెవ్వరూ కనుపించలేదు. పైగా భారతీయ ఇతిహాసాల్లో అది కావ్యమని ప్రఖ్యాతిగాంచిన రామాయణం 'ఏకపత్నీ వ్రత' ధర్మాన్ని ప్రపంచానికి బోధించటం లేదా! వేదకాలంలో ఆర్యులు ఏకపత్నీ వ్రతులుగానే వుండేవారని మనం చదవటం లేదా! బహుభార్యాత్వంతో క్రుంగిపోయిన దశరథుని చరిత్ర మనకు తెలియదా! లోకానికి గుణపాఠం నేర్పటంలేదా! వాల్మీకి భారతస్త్రీల గొంతులు కోశాడా లేక, ఏకపత్నీవ్రత ధర్మాన్ని పురుషలోకానికి బోధించి స్త్రీ లోకాన్ని ఉద్ధరించాడా?

ఇక కుంతీదేవి, ద్రౌపదులను పతితలుగా వర్ణించలేదని ఆవేదన ఎందుకో? పతితల నెప్పుడైనా సమాజానికి ఆదర్శప్రాయులుగా నిలబెటటం ఎక్కడైనా చూస్తున్నామా! కుంతీదేవికి సూర్యునితో గల్గిన సంబంధం వల్ల కర్ణుడు జన్మించాడు. ఇది నిజంగా పతనమే అనుకున్నా, కుంతీదేవిని పతితగానే వుంచటంలో ఉదాత్తత ఏమివుంది? లేక పతితయైనా సమాజంలో తదితర స్త్రీలతో సమాన గౌరవం ఇవ్వటంలో ఆధిక్యత వుందా, లేక పతితగా సమాజంముందు నిలబెటటంలో గొప్పతనంవుందా? ఏదైనా పొరపాటువల్ల మంత్రంవల్ల గాని, తంత్రం వల్లగాని స్త్రీ కాలుజారితే అది పొరపాటని సమాజం గుర్తించి క్షమించితే ఆ సమాజం అత్యున్నత సమాజమైవుండాలి. అందువల్ల ఆమె భావి జీవితాన్ని గంగలో కల్పకూడదని సమాజపెద్దల అభిప్రాయమయి వుండాలి. కుంతీదేవి భర్త పాండురాజు పాండురోగి అయినందువల్ల దాంపత్యం అసంభవమయింది. భార్యాభర్తలిద్దరూ సంతానం కావాలనుకోవటంవల్ల కుంతీదేవి పంచపాండవులను కన్నది, పాండురాజు అనుమతించాడు. అది ఆపద్ధర్మం. ఈ ధర్మసూక్ష్మాన్ని గుర్తించకపోతే ధర్మరాజాదులు ప్రపంచంలో ఒక వ్యభిచారిణికి జన్మించిన పుత్రులని చులాకన అయ్యేవారుగదా! దాంపత్యం చెడిపోకుండా—దాంపత్యం ఒక శారీరకమైనదే కాదు కాబట్టి-భార్యాభర్తల మధ్య ఏకాభిప్రాయం వున్నందువల్ల కుంతీదేవి పతివ్రతగా వెలిసింది. వ్యాసుడు ఆమె కా గౌరవం యిచ్చి కాలు జారిన స్త్రీలను సమాజం ఏ విధంగా గౌరవించాలో నేర్పాడు.

ఇక ద్రౌపది విషయానికి వస్తే ఆమె మహాశక్తిసంపన్నురాలని మహాభారతం తెలియజేస్తున్నది. పంచపాండవులు శారీరకంగా వేరైనా ఏకాత్మ ప్రభావితులు, ఏక మనస్కులు. అందరూ ద్రౌపదినే భార్యగా మన్నించమని తల్లి ఆదేశించింది. వారూ ఎంచుకున్నారు, ఆమె అంగీకరించింది. ఇది అసాధారణ ఉదాహరణ. పంచపాండవుల్లాంటి సోదరులు అరుదే ద్రౌపది లాంటి శక్తిశాలినీ అరుదే.

ద్రౌపది తన భర్తల నేవిధంగా ప్రేమిస్తున్నదో, సేవచేస్తున్నదో ఆమె సత్యభామతో చెప్పింది. అటువంటి విజ్ఞానురాలు భర్తలను దద్దమ్మ లనుకోగలదా! ధర్మరాజాదులను దద్దమ్మలని ఎవరనగలరు? కౌరవ సభ నంతా నుగ్గునూచగా గొటగలరు. అయినా ధర్మరాజు ప్రబోధంవలన ఆగారు భీమార్జునులు. వారు మేరీగారి వుద్దేశ్యంలో పిరికి పందలా?

మనకు కుంతీదేవిలాగానే క్రైస్తవలోకానికి క్రీస్తుమహాశయుని మేరిమాత వృత్తాంతం విచిత్రంగావుంది. ఆమె భర్తతో సంబంధం లేకుండా క్రీసునెలాకన్నదని ఫ్రెంచి విప్లవ రచయితలు ప్రశ్నించారు. అది అసంభవం అన్నారు శారీరకంగా. దాని సాధారంగా తీసుకొని క్రీస్తును పతిత పుత్రునిగా అంగీకరించవలసిందేనా! మనం ఎవ్వరమైనా క్రీస్తును దూషించలేదుగదా! ఆనాటి సమాజం, నేటి సమాజంగాని మేరీ కన్యను వ్యభిచారిణిగా, పతితగా ఎంచటం లేదుగదా! మహాభారత కవి వ్యాసుడు కుంతీదేవిని ఆదర్శమాతగా వర్ణించాడు, లోకోత్తర వీరులను కన్న మహాతల్లిగా ఆరాధించారు.

ఇక విద్యావతులైన యువతులు అన్నీ తెలుసుకొని వివాహం చేసుకుంటున్నారని, విద్యాహీనులే తల్లిచాటున వుంటూ ఏవో అకృత్యాలు చేస్తున్నట్లు, తలలు దాచుతున్నట్లు మేరీగారు ఒక భావం వెలిబుచ్చారు. దారితప్పేవారువిద్యావంతుల్లోనూవున్నారు. పుట్టింటిలో పెరుగుతున్నవారు పతిత లవుతున్నారనటం ఎక్కువ పొరపాటు.

రామాయణ మహాభారతాది గ్రంథాలను సరిగా చదవక, చదివినా పాక్షిక బుద్ధితో చదివితే మేరీగారికి వచ్చిన భావాలేవస్తాయి. పైగా ఆ గ్రంథాలు చదువుతున్నప్పుడు కథనేగాకుండా, అందులో ధర్మసూక్ష్మాన్ని కూడా గ్రహించాలి. ★

"సోదరీమణులు నా రచనను అపార్థం చేసుకున్నారు" ★ విమర్శలకు సమాధానం

సి. హెచ్. మేరీ

విమర్శ ఎప్పుడైతే వస్తుందో అప్పుడే మన జీవితాలు, ఆచారాలు, సంస్కృతి సరిదిద్దుకోటానికి అవకాశం కల్గుతుంది. విమర్శకులలో పరిహాసకులున్నా వారిని మనం అంతగా లెక్క చేయము. సోదరి రమణమ్మగారి వ్యాసాన్ని సదుద్దేశ్యముతోనే పరిశీలించా. ఆడవాళ్ళలో ఆత్మహత్య లధికమన్న విషయమై వారితో భేదించలేదు. వారు చూపిన కారణాలు ఈనాటికి సరిపడవని వ్రాశా. పాతకాలపు మూఢాచార పరాయణత్వ ప్రభావమే స్త్రీకి పిరికిపాలు నూరిపోస్తుందని, దాని ధాటికి బానిసలై స్త్రీలు ఆత్మహత్యలకు ఆహుతి అవుతున్నారని వ్రాశా. అలాటి వారికి ధైర్యోత్సాహాలు కలుగజేయాలన్న పరమ ధ్యేయంతో ఆదినుండి నేటివరకు గల పౌరాణిక, చారిత్రక, సాంఘిక ఘటాలను సోదాహరణంగా తీసుకున్నా. అందుకు కాంత, బి. యన్. లక్ష్మిగార్లు ప్రతివిమర్శలతో వ్యాసాలు వ్రాశారు. ఉభయులు ఒక్కొక్కచోట ఒకరితో ఒకరు భేదించినా, భిన్నత్వములో ఏకత్వంలాగ "మత దూషణ" అన్న పాతపాటలో ఏకీభవించారు. కత్తిరింపుల జుట్టు, హైహీల్ షూస్, మోకాళ్ళ వరకు గౌను, కుడిచేతిలో కర్చీఫ్, ఎడమచేతిలో లేడీస్ బాగ్, ఫాషనబుల్ తెల్ల మొహం (బొట్టు, కాటుక లేని మొహం) వుండకపోతాయా, అలాటి జాతివిధ్వంసక వస్తువులుంటే ఆటంబాంబు కాకపోతుందా అన్న ఊహాగానంతో వులిక్కిపడి "వనితాలోకంపై ఆటంబాంబు" అని ప్రకటన చేశారు. నక్క-తాటికాయ; గుమ్మడికాయల దొంగల సామెతలు గుర్తుకొచ్చాయి. మతం పేరిట, మతం ముసుగులో బ్రతుకు వెళ్ళబుచ్చే పరిస్థితులలో లేనందున మత దూషణకు దూరమై, భారతజాతి అంతా ఒక్కటేనన్న సిద్ధాంతంతో మారిన కాలములో స్త్రీ మనుగడకు మార్గమేదో తరచి చూశా. ఆద్యంతములవరకు "ఆడవాళ్ళ-ఆత్మహత్యలు" అన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకొనే నా వ్యాసం పూర్తిజేశా. నేల విడచిన సాము ఏదీ చేయలేదు.

"పేరు ధర్మరాజు పెను వేపవిత్తు" లుంటారన్న విషయం తెలియక పేరును బట్టి రూప, గుణ, ఆచారాలు నిర్ణయించుకున్నారు సోదరీమణులు. "విప్రన్న చెప్పిందే వేదం", "శంఖంలో పోసిందే తీర్థ"మన్న పాత శంకలతోనే ఇంకా వున్నారు. "వనితాలోకం" శీర్షికలో అన్యమతం పేరుచూచి అయోమయస్థితిలో ఒకరు, సహించలేని పరిస్థితులలో ఇంకొకరు పడిపోయారు. పేరునుబట్టి అది మతప్రచారమంటే చెల్లకపోతుందా అన్న తలంపుతో భారత నారీమణుల ఆదర్శాన్ని తూలనాడారని ఒకరంటే, హిందూ మతదూషణే అని ఇంకొకరన్నారు. యథార్థాన్ని ఉభయులూ గుర్తించలేకపోయారు. కొందరిని కొంతకాలము మోసగించవచ్చు. అందరినీ అంతకాలమూ మోసగించలేము. భరతవర్షం నానాజాతి మతసమితి. అందులో మన ఆదర్శ నారీమణుల ఆర్యజాతి అంతర్భాగం. అంతకన్నా ఆర్యజాతి ఆధిక్యత యేమీ లేదు. రాజుగారి పెద్ద భార్య మహా ఇల్లాలని పొగడుకుంటే వచ్చే ప్రమాద ముండదు; చిన్న భార్య శీలాన్ని శంకించవలసిన పరిస్థితులు కలుగజేస్తే మాత్రం విపత్తులకు దారితీస్తుంది. ఆర్యజాతి అగ్రగణ్యులు, వారి అనుయాయుల భార్యలే ఆదర్శ సతులూ అయితే, మిగతా భారతజాతి విషయమేమిటి? భారత జాతి అంతా ఆర్యజాతి వారనుకుందామా? ఉత్తమ స్త్రీలు అన్ని జాతులలోనూ వున్నారన్న విషయం మరుగు పరచడం సబబుగాదు. కుక్కను చావకొట్టే ముందు పిచ్చికుక్క అనమన్నారు. వాస్తవాన్ని గుర్తించనేరక దానిని కప్పిపుచ్చటానికి ఓ రాయి విసిరితే సరిపోతుందని తలచారు. కనీసం భావ ప్రకటన ప్రతి భారతీయుని జన్మహక్కన్న పరమసత్యాన్ని గూడా గుర్తించలేకపోయారు. చిన్ననాటి క్రైస్తవమత ప్రచారం, పాదిరీలు, మిస్సమ్మలు మాత్రమే గుర్తుకువచ్చారు.

"కుళ్ళువున్న చోటే ఈగలు వుంటాయనే విధానం యేమీ లేదు; బెల్లమున్న చోట గూడా ఈగలు ముసురుతాయ్. ఈగలు ముసిరినంత మాత్రాన బెల్లం కుళ్ళిపోదు" అని కాంతగారు వ్రాశారు. "ముతికి భాండమందు ముసురు నీగల భంగి" అని వ్రాసిన వేమన నిజంగా వెర్రివాడయ్యాడు. ఈగలు వ్రాలితే ఆకుళ్లను తినడమో, అందులో చావడమో జరుగుతుంది. మంచి చెడులను వివరించునపుడు ఉదాహరణ తీసుకుంటారు. ఉన్నప్పుడు తింటానికి తయారై, కష్టకాలంలో కంటికి కానరాని చుట్టాలను తలపోస్తూ "బెల్లముంటే ఈగలు ముసురుతాయే!" అన్నది నిష్ఠురోక్తిగా అంటారు. కుళ్ళువున్న చోట ఈగలు వ్రాలితే ప్రమాదముండదు; బెల్లమున్న చోట ఈగలు వ్రాలితే బెల్లం కుళ్ళదుగాని, ఈగలు వ్రాలిన బెల్లమును కంటితో చూస్తే సనాతనులు, ఆచారపరులు తినటానికి తయారుకారు. అలాటి బెల్లం తినటానికి, తినిపించటానికి సంఘ సంస్కరణ కర్తలు పూనుకోని పక్షంలో అఘాయిత్యాలు ఆత్మహత్యలు జరుగుతాయి.

పాతివ్రత్యములో అంతటి మహిమ లేదన్న సందేహమొచ్చి, అంతటి మహిమే వుంటే పురుషులంతా జడిసి అత్యహార్యం కాపాడి అయ్యేవారని కాంతగారు వ్రాశారు. స్త్రీలచేతిలో వెన్నముద్దలు, కీలుబొమ్మలు పురుషులు. అలాటి ఆయుధాన్ని స్త్రీలు సృష్టించుకోలేదు. సృష్టించుకో


చూడండి! సన్‌లైట్ సగంబిళ్ల మాత్రమే
ఈ బట్టలన్నిటిని ఉతికింది!
వేసినప్పుడు దాని అధికమైన నురగ!
SUNLIGHT SOAP
సన్‌లైట్ సబ్బు బట్టలను
తెల్లగాను, కాంతివంతముగాను ఉతుకును
హిందూస్థాన్ లీవర్ లిమిటెడ్ బొంబాయి వారి ఒక తయారు
S. 248 X52 L. F.

★ అపార్థం చేసుకున్నారు ★

టానికి అవసరమూ గలుగలేదు. ఆనాటి పురాణ పురుషులే స్త్రీని బానిసత్వమనే పుక్కలతో బంధించి వంటింటి కుందేలును చేసుకోటానికి సృష్టించిన మహిమలేని ఆయుధమది. దానిని గూర్చి ఎన్నెన్నో కథలల్లారు. రాముడంతటివాడు రమణి సీతను ఎడబాసేవాడు మూడు గిరులు గీచాడంటే ఆనాటి స్త్రీ యేలాటి బానిసత్వములో బంధింపబడివుందో బోధపడుతుంది. పతివ్రతలలో ఒక్కరుగూడా ఆత్మహత్యలు చేసుకోలేదని ఆశ్చర్యాన్ని వెళ్ళబుచ్చడం విడ్డూరంగా వుంది. శీలం శంకింపబడి వేరేగతి కానరాని వారే ఆత్మహత్యలు చేసుకుంటారు. శీలవతులు చేసుకోవలసిన అవసరమెందుకుంటుందో తోచదు. దశరథ రాణులు సహగమనము చేయలేదన్న వాదన యథార్థమైనది. అందులో సహగమనాలు శాస్త్రం విధించలేదని ఒకరు, మాద్రి చేసుకున్నదని మరొకరూ వ్రాశారు. కృతయుగ ధర్మశాస్త్రమైన మనుస్మృతిలో మానవుని ఆయువు 400 సం॥ లని వ్రాయబడివుంది. త్రేతాయుగపు మానవుల వయస్సు దానికన్నా తగ్గాలి. కాని దశరథుడు 60 వేల సంవత్సరాలు జీవించాడు; సమకాలికులగు రాణులు వృద్ధురాలని వదలివుండవచ్చు. అంతమాత్రాన శాస్త్రాలు సహగమనం విధించలేదన్న వాదన సత్యదూరమవుతుంది.

విడాకులకోరులంటూ—"విడాకుల చట్టం" దివాళాకోరుదా అన్నట్టు, కాంతగారు, "విడాకుల బిల్లుండగా అనుకోవడం అవమానకర" మని లక్ష్మిగారు వ్రాశారు. భారతీయ మహిళాసంఘాల నిరంతర ఆందోళన కృషి ఫలితమే విడాకుల చట్టమని ఉభయులు మరచిపోయారు. ఒక ప్రక్క ఆర్యజాతి ఆదర్శాన్ని తూలనాడి నట్లుగా బాధపడుతూ వేరొకప్రక్క భారత స్త్రీ జాతి ఏకోన్ముఖంగా నిలబడి సాధించుకున్న చట్టాన్ని తేలికగా చూడడం భారతజాతి స్త్రీలను చిన్నపుచ్చడము కాదేమో! ఉంగరాల చేతితో మొత్తితే బాధవుండదేమో! సంతుగల స్త్రీకి వితంతు వివాహపు అంతు కావాలని యెవరన్నారు? మధురానుభూతులు మరువలేని మొగవలు, అవినీతికి పాలయి అనర్థాలతో ఆత్మహత్యలకు గురికాకుండాచేయటమే వితంతువివాహపు వుద్దేశ్యం. వయస్సు మళ్లిన వొగ్గులకు, మమకారం వుడిగిన ముసలులకు, పుట్టెడు సంతతిగల పుణ్యస్త్రీలకు బలవంతపు బ్రాహ్మణార్థం చేయమని యెవరంటారు? చెప్పేవి శ్రీరంగనీతులు, చేసేవి మరోలాగున కాకుండా, సంఘం కళ్ళు కప్పి తెరచాటున తైతక్కలాడకుండా, స్త్రీని అవినీతిబారినుండి తప్పించడానికి 'కందుకూరి' అనేక కష్టాలను ఎదుర్కొన్నారు. ఇంట్లో హీనమైనా, శుభకార్యాలకు దూరమైనా, వీధిలో దుశ్శకునపుపక్షియైనా, నున్నటితలపై తెల్లటిముసుగే మాతీరు అనేవాళ్లను ఎవరూ కాదనరు. అనాథశరణాలయాలు వెలిశా



"ఒడుపు"

ఫొటో: ఎ. కె. ఎస్. రావు-కలకత్తా

యంటే దేశమంతా అనాథులుగమ్మని, పతిత జనోద్ధరణసంఘ కేంద్రాలు స్థాపించారంటే జాతిఅంతా పతితలుగమ్మని సిద్ధాంతమా! అలాగే విడాకులచట్టం, వితంతు వివాహపు చట్టమూను. అన్యోన్యముతో చేసే కాపురాలు చెడగొట్టుకొమ్మని గాదు. తప్పు అన్నది యెవరుచేసినా తప్పేఅనటం - పురుషులను పాపపంకిలపుపనులు చేయమని ప్రోత్సహించి అదే అవినీతిని ఆడవాళ్ళు చేయాలన్న తలంపుగా చిత్రించటం అపార్థంతో కూడుకున్నదవుతుంది. చదివినవాళ్లకందరకూ, సర్టిఫికెట్లు రావు; అందులో తప్పినవాళ్లంతా మొద్దబ్బాయలనుకుందామా? జ్ఞానశూన్యులనుకుందామా? అందరిని సర్టిఫైచేయలేమన్నంత మాత్రాన కన్యలంతా కాలుజారినవారుగా వ్రాశానన్న విపరీతార్థము తీయటం సబబు కాదు.

అష్టాదశ పురాణాలలో చతుర్వేదాలలో ఇష్టమొచ్చిన అవతారాలు, మతాలు, ఆచారాలూను. ఒకమతానికి ఇంకోమతం, ఒకజాతికి ఇంకోజాతి సరిపడని సిద్ధాంతాలు. ఆర్యద్రావిడ వైషమ్యపు యుద్ధాలు. మత సూత్రధారులతో సూత్రధారులు, పాత్రధారులతో పాత్రధారులు శిఖపట్ల గోత్రపు జపాలు! అశేషజాతి శూద్రులు; అందులో అస్పృశ్యులు. బహుళత్వములో ఏకత్వంగా భారతజాతి అంతా ఒక్కటేనన్న సిద్ధాంతం శూన్యం. మన అంతఃకలహాలే పరాయి పాలకులకు తావిచ్చాయి. వేదాలకు, దేవాలయాలకు దూరమైన ప్రజానీకానికి దైవారాధన తృష్ణలో అన్యమత స్వీకారం ప్రబలింది. మనకు సంస్కృతి నేర్పిన మతోన్మాదమే మనపూజ్య బాపూజీని బలిగొన్నది!

కాలం మారింది; మారినకాలంలో మనమున్నాము. కాలానికి ఎదురీత విపరీతమవుతుంది. చరిత్రకారుడు, శాస్త్రకారుడు (సైంటిస్టు) ఏనాడో పౌరాణికుణ్ణి ఛేదించాడు. భౌతికవాది ఛార్లెస్ డార్విన్ భావవాదులపై చావుదెబ్బతీశాడు. అయినా మనం జాతిమతవిద్వేషాలు వల్లించుకుంటున్నాము. వారంతా "చంద్రలోకయాత్ర"లో వుంటే, మనం లక్ష్మితోబుట్టువని, శివుని జటాజూటపు ఆభరణమని వినాయకుని చూసి నవ్వాడని మురుసుకుంటున్నాము. ఎన్నోలక్షలమైళ్ళ దూరానవున్న సూర్యుని హనుమంతుడు మ్రింగాడని, కుంతికి సంతతి గలుగజేశాడని మనమానందిస్తుంటే, అదొక మండలమని అవతలవాళ్ళంటున్నారు. మారినసంస్కృతికి మన సంస్కృతికి పోలికలు లేకుండా పోతున్నాయి. పాతకాలపు సిద్ధాంతాలువల్లించాలనీ, వల్లించని వాళ్ళు జాతి ద్రోహులని ముద్రలు వేయడం సబబనిపించుకోదు. అస్పృశ్యతా, వర్ణవ్యవస్థ లానాడు; వాటి నిర్మూలన ఈనాడు. బహుజాతిబోధలానాడు; ఏకజాతిబోధ ఈనాడు. వాదభేదాలు వదులుకొని వట్టిదానికి మురిసిపోక స్త్రీ జాతిసమైక్యతకు పాటుపడవలసినదిగా కోరుతున్నా. స్త్రీజాతికి జరిగే అన్యాయాలపట్ల "మూగనోము" నోచక, ముగువలు తెగువతో ముందుకు రాగలరని ఆశించుతున్నా. ఎందరో మహానుభావులు - అందరికీ వందనాలు. ★

నిదానం లేని వాగ్దానం

"దానికేముందోయ్. నే వెళ్ళగానే ఉత్తరం రాస్తా. వాణ్ని పంపించివేయ్. మా కంపెనీలో చాలా ఖాళీలున్నాయిలే. వాడక్కడకొస్తే వాడిచేతే అప్లికేషన్ ఫారమ్ పూర్తి చేయించి సంతకం పెట్టేస్తా. నాతోటే తీసుకుపోదామనుకున్నా వాడిని. కాని నేనింకా ఇలా విశాఖపట్నంవెళ్ళి అక్కడ వారంరోజులుండాలి."

మా బంధువుడొకాయన అన్న మాటలివి: ఆయన ఓ పెద్ద కంపెనీకి మేనేజరు. మా అన్నయ్య బి. యే. ప్యాసయి ఇంట్లో కూర్చున్నాడు. అందుకని నాన్నగారు వాళ్ళ కంపెనీలో ఏదేనా ఖాళీ ఉందేమోనని అడగగా ఆయనలా చెప్పేడు.

తరవాత నెల్లాళ్ళకి కాదు రెండు నెల్లకి కూడా ఆయన దగ్గఱనుంచి ఉత్తరం రాలేదు. నాన్నగారు ఆయనే ఉద్యోగం వేయిస్తాడన్న ధీమాతో ఇంకెక్కడా ఉద్యోగ ప్రయత్నం చేయలేదు. ఈ రెండు నెలల్లోనూ నాలుగయిదు రావలసిన ఉద్యోగాల్ని కంపెనీ ఉద్యోగంకన్నా తక్కువనే ఉద్దేశంతో అన్నయ్య తిరగ్గొట్టేశాడు. తీరా రెండు నెల్లయినా ఆ మాటిచ్చిన బంధువు ఉలుకూ పలుకూ లేకపోవడంతోటే ఇప్పు డేడుస్తున్నాడు. ఆయనకి నాన్నగారు రెండు మూడు ఉత్తరాల దాకా వ్రాశారు. కాని జవాబులేదు.

ఇప్పుడు అన్నయ్యవని రెంటికిచెడ్డ రేవడిలా తయారయింది. ఆయన్నే నమ్ముకొంటే తీరా మోసంచేశాడు. పోనీ ముందే మీకు నేను ఏం సహాయం చేయలేను, మీ పాట్లు మీరేపడండి అని చెప్పేస్తే మాకే గొడవా లేకపోను. లేదా ప్రయత్నిస్తాను, అయితే కావచ్చు అని చెప్పినా ఫరవాలేదు.

ఇలాటి వాగ్దానాలు (promises) చేసి తీరా మోసం చేసేవాళ్ళనిచూస్తే చెడ్డ అసహ్యం పుడుతుంది. తామేదో మహాగొప్ప వాళ్ళమయినట్లు, ఉద్యోగం (ఈ సందర్భంలో) ఇచ్చేసినట్లు మాట్లాడుతారు. తీరా క్రియ శూన్యం.

వీళ్ళలోనే ఇంకొకరకం మనుష్యులున్నారు. వారినిచూస్తే నమిలేయాలని ఉంటుంది. నాన్నగారొకసారి విశాఖపట్నంలో ఉన్న ఒక బంధువుకి ఇలా మా అన్నయ్య బి. ఏ. ప్యాసయినట్లు, ఏదేనా ఉద్యోగం ఉంటే ప్రయత్నించమని వ్రాశారు. దానికి ఆయన ఇక్కడ సింధియా కంపెనీలో ఉద్యోగం ఖాళీగాఉంది. కాని మీ వాడికి ఫస్ట్‌క్లాస్ రాలేదు. అందుకని లాభంలేదు. అని రాసేశాడు. పోన్లే విలుపడదని ముందటే తెలియబర్చాడు తరవాత బాధ పెటకుండా అని ఊరుకున్నారు. పోనీ ఎప్లయ్ (Apply) చేస్తే ఏం పోయిందని ఎప్లయ్ చేశాడు అన్నయ్య. ఇంటర్‌వ్యూకి పిలుపు వచ్చింది. వెళ్ళేడు. ఇంటర్‌వ్యూలో ఆ ఉద్యోగం వాడికిచ్చారు. వీల్లేదని రాసేసిన బంధువుకి ఈ సంగతి ఎలా తెలిసిందో ఆయన మానాన్నగారికి ఉత్తరం రాశాడు. "నేను ముందర ఆకంపెనీలో ఉద్యోగంకోసం ప్రయత్నించాను. కాని బి. ఏ. ఫస్ట్‌క్లాస్ రావాలన్నారు. అయినా మా వాడికి సెకండ్ క్లాస్ వచ్చింది ప్రయత్నించండి సాధ్యమైనంతవరకు అని చెప్పాను. నా మాట కాదనలేక వారు మీవాడికి ఆఉద్యోగం ఇచ్చారు." ఉత్తరం చదివి నాన్నగారు ఆశ్చర్యపోయారు. అన్నయ్య పళ్ళుకొరికేడు, "వాళ్ళ చేయి ఎప్పుడూ పైనేఉండాలి, దుర్మార్గులు" అనుకుంటూ.

మాట యిచ్చామంటే ఏదో ఊరకనే వారితో మాటవరసకి అన్నాంకదా అనుకోకూడదు. వారికి మనం సహాయపడగలమా? సహాయపడితే ఎంతదాకా సహాయపడగలం? తీరా మనం సహాయపడకపోతే వారు ఎంత నిరాశ చెందుతారా? ఈ ప్రశ్నలన్నిటికి సమాధానం చెప్పుకుని మరీ వాగ్దానం చేయాలి. ఇలాంటి వాగ్దానాలు చేసేటప్పుడు "చెప్పడం సులువు చేయడం కష్టం" అన్న సామెతని మనసులో పెట్టుకోవాలి.

కె. లలితాంబ,
(అయినవలి, అమలాపురం తాలూకా.)

కొబ్బరితో

కొబ్బరి చాలా బలముగల ఆహారము. కొబ్బరిని పప్పుల్లోను కాయగూరల్లో కలుపుగాను పచ్చళ్లగానూ యింకా అనేక రకములుగా చేసుకుంటారు. కాని కొబ్బరితో అనేక రకముల పిండివంటలు నిలువఉండేవి కూడ చేసుకొనవచ్చును.

కొబ్బరి హల్వా

ముందరజీడిపప్పు కిస్‌మిస్ బాగుచేసి కొద్ది నేతిలో వేయించి పావుతులం యాలక్కాయలు పొడిచేసి కొంచెం పచ్చకర్పూరం కలిపి చిటికెడు మిఠాయిరంగు చుక్కపాలల్లో కలిపి ఉంచుకోవాలి ఒక ముదురు కొబ్బరికాయ తీసుకొని పగులకొటి సన్నగా తురిమి, అరగిద్దబియ్యం గంటసేపు నానబెట్టి, తురిమిన కొబ్బరి, నానబెట్టిన బియ్యం మెత్తగా కాటుకవలె రుబ్బి గరిటజారుగా కలిపి ఒక కళాయిపాత్రలోనికి తీసుకొని నవాసేరు చక్కెర వేసి కుంపటిమీద సన్నని సెగలో పెటి గరిటతో కలియబెడుతూ అర్ధ నవాసేరు నెయ్యి దగ్గరపెట్టుకొని కొంచెం పోస్తూ కలుపుతుండాలి. చివరకు చక్కగా ఉడికి ముద్దవలె అవుతుంది. అందులో జీడిపప్పు వగైరాలు వేసి నలుమూలలా కలియబెట్టి పళ్ళెమునకు నెయ్యిరాసి అందులో హల్వా వేసి సమానంగా చదునుచేసి చల్లారేక యిష్టమొచ్చిన సైజులో ముక్కలుకోసి ఉపయోగించుకొనవలెను. దీనిని కొబ్బరిహల్వా అని చెప్పేంతవరకు ఎవ్వరూ తెలుసుకొనలేరు. ఇది రెండుమూడు రోజులు నిలువఉంటుంది.

కొబ్బరి బోండా

ఒక ముదురు కొబ్బరికాయ తురిమి దారెడుబియ్యం గంటసేపు నానబెట్టి రెండూ కాటుకవలె రుబ్బి గరిటజారుగా కలిపి కళాయిగిన్నెలోనికి తీసి ఒకప్రక్క ఉంచి నవాసేరు చక్కెర కళాయిపాత్రలోపోసి కొంచెం నీళ్ళుపోసి పొయ్యిపైపెట్టి తీగపాకం రానిచ్చి క్రిందికిదించి కొంచెం యాలుకపొడివేసి బాణలి పొయ్యిపైపెట్టి అరవీసె డాల్డావేసి కాగినతరువాత ఈ కొబ్బరి మిశ్రమంలో చిటికెడు సోడావేసి కలిపి కొంచంకొంచెముగా గరిటతో కాగే చమురులో వేసి దోరగా వేగనిచ్చి తీసి పాకంలోముంచి రెండునిముషాలుంచి తీసి, విడిగా పళ్ళెములో పెట్టుకొనవలెను. ఈ విధంగానే అన్ని తయారుచేసుకొనవలెను. ఇవి గుల్లవిచ్చి నోట్లో వేసుకుంటేనే కరిగిపోతవి. పదిరోజులదాకా నిల్వఉంటవి.

కారంగా

పైన చెప్పిన విధముగనే అంతా రుబ్బుకొని సరిపడినన్ని పచ్చిమిరపకాయలు



ధర్మ సందేశం

నడకకి బుద్ధిచెప్పి

ఉషారాణి నడకగురించి చాలా బాగా వ్రాశారు. "మా బామ్మచూస్తే" అక్కడ పంక్తి చదివి చాలా నవ్వుకున్నాను. ఈ వూరిలో ఒక అమ్మాయివుంది. ఆమె నడిచిందంటే తూర్పు కో కాలు, పడమటికి ఒక కాలు కాక, చేతులుకూడా అలాగునే, తవ్వి కావన్నట్లు దూరంగా విసురుకుంటూ పోతుంది. ఆమెప్రక్కన నడవడానికి ఎవ్వరికీ ధైర్యముండదు ఎవరయినా అలా నడుస్తే ఆ నడిచిన మనిషికి ఈమె చెయ్యి అడపాదడపా విసురుగా తగులుతూంటుంది. పోనీ ఈ వ్యాసం చదివినవారు 'కాళ్ళకి, చేతులకీ బుద్దిచెప్పి' సుభ్రంగా నడవడం నేర్చుకుంటారనుకుంటాను.

—ఎస్. భానుమతి, శ్రీకాకుళం.]

* * *

నడక

ఉషారాణిగారి 'నడక' అనే వ్యాసం చాలబాగుంది. నిజాన్నే వెల్లడించారు. వాళ్ళ బామ్మలాంటివారు మనకెంతో అవసరం. ఆమెగారన్నట్టె అందం అలంకారం ఒకఎత్తు; నడక ఒకటే ఒక ఎత్తనవచ్చు. కొందరమ్మాయిలు నడుములు అష్టవంకరలు త్రిప్పి నడుస్తారు. అదే అందం. ఫాషను అనుకుంటారనుకుంటా. మరికొందరు నడుస్తుంటే ప్రక్కన పోయేవారికి దెబ్బలకొదవే ఉండదు. అంటే చేతులు అంతగా ఊగిస్తూ నడుస్తారు. కొందరు నడుస్తుంటే జడ ఎగరాలి. మావూళ్ళో ఒకాయనున్నాడు. ఆయన నడుస్తుంటే ఎగురుతున్నాడేమో అనేటుంటుంది. ఇన్ని అవతారాలు పడి నడిచేవారిని చూస్తే నవ్వొస్తుంది. ఒకోసారి అసహ్యం వేస్తుంది.

—కె. ప్రేమలత, కర్నూలు-బళ్లారి]

* * *

టి. ఉషారాణిగారు 'నడక' వ్యాసంలో చక్కగా నిర్భయముగా విడమరచి చెప్పారు. శరీరములో ఏవిధమైన లోపాలులేక పోయినా కొందరు నడకవల్ల వికారముగా కనపడతారు. ఇప్పటిరోజులలో నడక ఒక పాషన్ అయిపోయింది.

—ఎస్. శేషమ్మ, తాడేపల్లి గూడెం]

* * *

19-8-58 ఆంధ్రపత్రికలో వ్యాసాలు "శిశిరవసంతాల సందేశం" (బి. ఎస్. లక్ష్మిగారిది) "అతిథి సత్కారం" (మరుకుమల్లి సుశీలగారిది) చాల బాగున్నాయి. సుశీలగారు అతిథి మర్యాదల్లో నిత్యం వుంటే ఇబ్బందులను అతిసున్నితంగా చూపించి రాసేరు. ఇంక ఈ పత్రికలోనే శ్రీమతి భానుమతిగారి "అత్తగారు అవకాయ" వ్యాసం వినోదంగా పొట్టచెక్కలయ్యేట్టు నవ్వించింది. వ్యాసం అంతా అతిశయోక్తితో నిండివుంది. ఎంత పెద్దరికపు అత్తగారైనా 50, 60 ఏళ్ళు పైబడ్డ మనిషి అవకాయంటే అంత అంచనా లేకుండా జాడీడు ముక్కలకి గుప్పెడు వుప్పు కారం వేస్తుందా? ఇంతకు నిజంగా ఈమెకు అలాంటి అత్తగారువున్నట్టు లేదు. ఉన్నట్లయితే ఎంతమంచి అత్తగారైనా ఆమెను దుయ్యబడుతూ కోడలు వ్యాసం రాస్తుంటే వూరుకుంటుందా?

—వి. లక్ష్మి, బరగడ్-ఒరిస్సా]

* * *

19-8-58 తేదీ ఆంధ్రపత్రికలో భానుమతి రామకృష్ణగారు వ్రాసిన "అత్తగారు-అవకాయ" వ్యాసం చాలా బాగుంది. మొదట్నించి చివరవరకూ హాస్యాన్ని చిందిస్తూ ఆవిడ కలాన్ని నడిపించి, ఎక్కడో ఉన్న మూలాంటి వాళ్ళకు హాస్యరసాన్ని అందించింది. అవకాయ అనే హెడింగు చూసేటప్పటికే మళ్ళీ మన ప్రాంతాలకు పరిగెత్తుకుని వెళ్ళిపోదామనిపించింది. కానీ పరిస్థితులు అనుకూలించక స్నేహితులందరికి తలొక్క కార్డు అవకాయ పంపమని వ్రాసినాను. ఈ అయిడియాని ఆంధ్రపత్రిక ద్వారా అందించిన భానుమతి రామకృష్ణగారికి నా ధన్యవాదాలు. అవకాయంటే మరచిపోయిన నాకు భానుమతిగారి పుణ్యమా అంటూ మళ్ళీ అవకాయ తినే భాగ్యం త్వరలోనే స్నేహితుల ద్వారా కలుగుతున్నందుకు సంతోషిస్తున్నాను. ఇక ముందుకూడా భానుమతిగారు ఈలాంటి చక్కటి వ్యాసాలని రాస్తారని ఆశిస్తున్నాను.

—ప్రభల వెంకటేశ్వరరావు, పూనా]

* * *

"భానుమతీ రామకృష్ణ"గారు రచించిన "అత్తగారూ - అవకాయ" (తే 19-8-58) చాలా రసవంతంగా ఉంది. సాధారణంగా మన యిండ్లలో జరిగే విషయాలను తమాషాగా చిత్రించారు రచయిత్రి. కొందరు గొప్పకుపోయి నా మాదిరి చెసేవాగున్నారా అని తమనుతాము పొగుడుకుంటారు. అలాంటివారికి శృంగభంగం తప్పదు. ★


—రేపూరురాధ

మెత్తగానూరి, ఉప్పు, కాస్తసోడా, రెండు కట్టలు కొత్తిమిరి త్రుంచి అన్నీ వేసి కలియబెట్టి కాగుచున్న నేతిలో వేసి వేయించుకొనవలెను. తీపి యిష్టములేనివారికి ఇవి నచ్చవచ్చు. ఇవికూడ నిలవ ఉంటవి. కాని కారం కాబట్టె వేడిమీద ఉన్నరుచి తరువాత ఉండదు.

కొబ్బరి అరిసెలు

ఒక ముదురు కొబ్బరికాయ తురుముకొని ఒకప్రక్క ఉంచవలెను. అర్ధశేరు బియ్యం బాగుచేసి కడిగి రెండు మూడు గంటలు నానబెట్టి పిండి కొట్టించి మెత్తగా జల్లించి ఒకప్రక్కగా ఉంచి సవాశేరు బెల్లం పొడిచేసిగాని చక్కరగాని తురిమిన కొబ్బరిలో వేసి కాస్త యాలుకపొడికూడవేసి కళపెళలాడిన నీటితో కళాయి గిన్నెలో గట్టిగా ముద్దకలెకలిపి బాణలిలో పాను డాల్డా వేసి పొయ్యిపైపెట్టె కాగిన తరువాత అరిటియాకుమీదగాని బాదం ఆకుమీదగాని నిమ్మకాయంత ఉండచేసి ఆకునకు కొంచెం చమురురాసి పలుచగా తట్టి కాగుచున్న చమురులో వేసి దోరగా వేగనిచ్చి తీసి వెయ్యవలెను. నువ్వుపప్పు (చాయపప్పు) చారెడువేసి కలిపి అరిశెలు చేసుకుంటే రుచిగా ఉంటవి. ఆకులు దొరక్క శ్రమపడలేనివారు పెద్ద వుసిరికాయంత ఉండలుగా చేసుకొనికూడ వండుకొనవచ్చును. కాని అరిశెలంత రుచి ఉండవు. ఇవి పదిపదిహేను రోజులు నిలువ ఉంటవి. ★

కొత్తపల్లి రాజ్యలక్ష్మి,
(చిన్నగంజాం.)



పాదుషాగారి పరిహాసం

మొగల్ వంశ మండనుఁడా
అక్బరు భూజాని కొలువు,
కన్నుల వైకుంఠముగా
చెన్నుమీరి యుండినది.

పాదుషాహాగారి కది
పరిహాసా లాడు వేళ;
పరివేష్టితులగువారిని
ప్రశ్నించా రీ విధముగ.

"పాదుషాను గదా నేను
పరాభవమ్ము సహింపను.
నన్నొకతుంటరి తన్నిన
ఎట్టి శిక్ష విధియింతును?

సూక్ష్మబుద్ధు లగు మీరలు
సునిశితముగ యోచింపుడు,"
అని వచించి యూరకుండె
అక్బరు భూధవు; డంతట

మంత్రులలో ముఖ్యుండా
మానసింహు డిటుల పలికె;
"పాదుషాను తన్నువాని
పాతించుట యుత్తమమ్ము"

"పాడి దప్పి మిమ్ము దన్ను
గాడిద తల తీయించి,
బూడిద చేయుట లె"న్నని
తోడర్ మల్ పలుక దొడగె.

ఎవరికివా రీ రీతిగ
ఏమేమో నుడువుచుండ,
పెదవి విరచి మహాప్రభువు
అదికాదని పలికినారు.

వీరబలుడు కలడు గదా!
ధీరతతో నత డప్పుడు,
ప్రభువుగారి ప్రశ్న నిట్లు
పగులగొట్టి అంతు దేల్చె.

"సమ్రాట్టును తన్నువాడు
సామ్రాజ్యమునందు లేడు,
ఉన్నచో ప్రభువులకు వాడు
చిన్ని మనుమడగుట నిజము.

అట్టివాని పట్టితెచ్చి
గట్టిగ చెక్కిళ్లు నొక్కి,
ముద్దులు కురిపింపవలయు
నద్దియె శిక్షగును" అనగ.

వీరబలునిధీగరిమకు
వెరగుపడిరి సభాసదులు.
సెభాసంచు చక్రవర్తి
సభనుమాని లోనికరిగె. ★

కె. శ్రీనివాసులు

క్రిందదేవుడు పైదేవుడు

గౌతముడనే మహర్షి దగ్గర అనేక మంది శిష్యులు విద్య అభ్యసిస్తుండేవారు. ఆయన సర్వ విద్యా పారంగతుడు. గొప్ప వేదాంతి. శిష్యులంటే అనిర్వచనీయమైన ఆదరాభిమానాలు చూపుతాడు. శిష్యకోటి యావత్తు గురుకులంలోనే వుండేవారు. ఎక్కడెక్కడనుంచో వచ్చి చేరేవారు.

అందులో సారంగుడనే శిష్యుడుండేవాడు. సారంగునిమీద గురువుకు ప్రత్యేకాభిమానం వుండేది. కారణం సారంగునిలోని చురుకుతనం ప్రతివిషయంలోనూ వుత్సాహం చూపేవాడు. తర్కించి తర్కించి సంగతులు తెలుసుకునేవాడు. ఎక్కడ సందేహం వస్తే అక్కడ పాఠం ఆపి సందేహం తీరిస్తేనేగాని పాఠం ముందుకు నడిచేదిగాదు. తోటి శిష్యబృందం కిమ్మనకుండా పాఠాలు వింటూ తల లూపేవారు. సారంగుడు మాత్రం యింకా ఎక్కువ వివరాలు అడిగేవాడు. అనుభవంవల్ల వాటిని రూఢి చేసుకునేవాడు.

ఒకనాడు గౌతముడు భగవంతుని అస్తిత్వాన్నిగురించి పాఠం చెపుతున్నాడు. సమస్తవస్తు సంతతిలో భగవంతుడున్నాడని వివరించాడు. సారంగుని కిది పూర్తిగా అర్థం కాలేదు. గురువుతో చర్చకు దిగాడు. గౌతముడు ప్రహ్లాదచరిత్ర సంపూర్ణంగా వినిపించాడు. అప్పటికి కూడ సారంగునికి తృప్తికలగ లేదు. ఇక లాభం లేదనుకుని తిరిగి ఏకాంతంగా ఆలోచించుకుని అందులోవున్న సత్యం గ్రహించమని చెప్పి వూరుకున్నాడు గౌతముడు.

సారంగుడు ఆరోజంతా తీవ్రంగా దాన్ని గురించి సతమత మవుతూనే



బాలపండితుడు
ఫోటో: బి.గంగనాథ్-సికింద్రాబాద్

వున్నాడు. అన్ని చోట్లా ఒక్క దేవుడు వుండటం ఎలా సంభవమూ అని తర్కించుకుంటున్నాడు. జంతువుల్లో, మానవుల్లో, వృక్షాల్లో, పర్వతాల్లో, పక్షుల్లోకూడ భగవంతు డుండాడా అని ప్రశ్నించుకున్నాడు, ఆలోచించుకున్నాడు. కాని సమాధానం కుదరలేదు.

మర్నాడు వుదయాన్నే నదిలో స్నానంచేసి గురుకులంవైపు వస్తున్నాడు. ఎదురుగుండా ఒక ఏనుగు వస్తోంది. దాని మీద మావటి వున్నాడు. అది కొంచెం పొగరుమోతుగా ప్రవర్తిస్తుండడంవల్ల దాన్ని మావటి అంకుశంతో పొడుస్తూ నడిపిస్తున్నాడు.

సారంగుడు ఎదురుగా రావటం చూసి దూరాన్నుంచే మావటి తప్పుకోమని హెచ్చరిస్తున్నాడు. ఏనుగులోకూడ భగవదంశ వున్నప్పుడు తనసేం చేస్తుందో చూద్దామనుకుని సారంగుడు ప్రక్కకు తప్పుకోకుండా ఏనుగుకు ఎదురు వెళ్తున్నాడు. మావటిపైనుంచి తప్పుకో అని అరుస్తున్నాడు, కాని సారంగుడు వినిపించుకోలేదు.

ఇంకేముంది. ఏనుగు అమాంతం తొండంతో సారంగుని పైకిఎత్తింది. మావటి ఏనుగును గట్టిగా అంకుశంతో పొడిచాడు. ఆ బాధకు ఓర్చలేక సారంగుని వదిలేసింది. కొద్దిపాటి దెబ్బలతో తప్పించుకుని సారంగుడు గురుకులం చేరుకున్నాడు.

అనవసరంగా ఏనుగు తనను పై

జి. రామకృష్ణ

క్రిందదేవుడు, పైదేవుడు

కత్తి పడేసింది కాబట్టి దానిలో భగవదంశ లేదని గురువుగారితో గట్టిగా వాదించవచ్చని అనుకున్నాడు.

ఆ ప్రకారంగానే తనకు తగిలిన దెబ్బలు గురువుకు చూపించి ఆ ఏనుగులో భగవంతుడు లేనేలేడని అన్నాడు సారంగుడు.

గౌతముడు చిరునవ్వు నవ్వాడు. గురువు నవ్వుకు అర్థం తెలియలేదు సారంగునికి. స్వానుభవంవల్ల తప్ప ఏ విషయాన్నిగాని పూర్తిగా విశ్వసించని సారంగునికి చక్కటి అనుభవం అయినందుకు ఒక విధంగా గౌతమునికి సంతోషంగా వుంది. మరో ప్రక్క శిష్యునికి దెబ్బలు తగిలినందుకు విచారించాడు.

సారంగుని దెబ్బలకు ఆకుపసరు రాసి వూరడించాడు. కొంతసేపయ్యాక సారంగుని సందేహానికి జవాబిచ్చాడు. మావటిలోవున్న పైదేవుని హితవు విననందుకు ఏనుగులోవున్న క్రిందదేవుడు శిక్షించాడని చమత్కరించాడు గౌతముడు.

ఈ మాట సారంగునికి బాగా నచ్చింది. మావటిలో వున్న దేవుని గురించి ఆలోచించకపోవటం తనదే తప్పు అనుకున్నాడు. పైదేవుడు పరిపరి విధాల హెచ్చరించినా కించిత్తు కూడ లెక్కచేయని తనను ఏనుగులో వున్న దేవుడు శిక్షించి తనకు జ్ఞానోపదేశం చేసినందుకు సారంగుడు ఆనందించాడు.

అతని సందేహం తీరిపోయింది. అన్నింటా భగవంతుడున్నాడని గట్టి నమ్మకం కుదిరింది.

ఆనాటినుంచి సారంగుడు పరమ భక్తుడయ్యాడు. ★

'నాగార్జునకొండ'

(29-వ పేజీ తరువాయి)

మాత్రం నిలవలేకపోయిందన్న విషయాన్ని చెబుతూ ఇప్పుడు 'నాగార్జునకొండ' చిత్రంలో, ఆ భరతవాక్యాన్ని చిత్రించారు.

మహాయాన ప్రవర్తకుడైన నాగార్జునాచార్యుని కృషిఫలితమే, ఈనాటి అమరావతి స్తూపాలూ, శ్రీపర్వతగుహాలయ శిల్ప సంపదాను. క్రీ. శ. 137నుండి 57సంవత్సరాల పాటు, ఆయన శ్రీ పర్వతంమీద నివసించి బ్రహ్మాండమైన తాత్విక పరిశోధనలుజరిపాడు. ఆయన అధ్వర్యాన నడచిన ఇక్కడి విద్యాపీఠం దేశిదేశాలవిద్యార్థులకు గమ్యస్థానంగా, విద్వాంసులకు, జిజ్ఞాసువులకు యాత్రాస్థలముగా విలసిల్లింది. ఆంధ్రులకు భారతీయులకుకూడా గర్వకారణమైన శిల్ప కళాఖండాలు అవతరించాయి. వేలాది విద్యార్థులు ఇక్కడి బౌద్ధ విహారాలలో ఉండేవారు. ఆనాడు సాతవాహన చక్రవర్తులు బౌద్ధాన్ని ఆదరించారు. ఆ తరువాత 3వ శతాబ్దంలో ఇక్ష్వాకులు రాజ్యానికి వచ్చి, శ్రీ పర్వత సమీపంలోనే 'విజయపురి' నిర్మించి అది రాజధానిగా పరిపాలనసాగించారు. క్రమేణా ఇక్కడ ఆ విద్యాపీఠం, ఆ విహారాలూ అన్నీ అంతరించిపోయాయి.

నాగార్జునుడి గ్రంథాలనేకం మనవారు టిబెట్ భాషనుండి తిరిగి సంస్కృతంలోకి తర్జుమా చేసుకోవలసి వచ్చింది. నాగార్జునాచార్యుడు ప్రతిపాదకుడు అని చెప్పకోతగ్గ మహాయాన బౌద్ధం టిబెట్, చైనా, జపాన్, ఫార్మోజా ప్రభృతి దేశాలలోనే ఈనాడు వర్ధిల్లుతోంది. నిర్వాణ మార్గాన్వేషణ వ్యక్తి బాధ్యతేననే హీనయాన వాదం, ప్రజాబాహుళ్యాన్ని ఆకర్షించ లేదన్న భావమే, అమితాభ బుద్ధుడు ఈశ్వరుడనీ, ముక్తిసాధనలో ఆయన సహాయపడతాడనీ ధైర్యం చెప్పే మహాయాన శాఖ అవతరించడానికి కారణం అంటారు. అది అవతరించడమే బౌద్ధం ఈ దేశంలో అంతరించడానికి కారణమంటారు. విగ్రహారాధనకు బౌద్ధం అంగీకరించగానే, భారతీయులు తమ దేవతలపై పుకే మొగ్గడంతో దీని ప్రాభవం తగ్గిపోయింది.

పధ్నాలుగు వందల అడుగుల నిడివి గల 'నాగార్జున కొండ' డాక్యుమెంటరీ చిత్రానికి ఇదీ 'కథ'.

నాగార్జున క్షేత్రంలో, పురావస్తు శాఖ త్రవ్వకాల వల్ల బయటపడిన సుందరశిల్పాల చేతా,ఒక మహామతపీఠం ఉదయాస్తమానాలు చూస్తూ రెండువేల ఏళ్లుగా నిలచి వున్న కొండలచేత, అక్కడ చైత్యాలచేతా, వాటి పక్కనే కొలంలా నిరంతరంగా, అప్రతిహతంగా సాగిపోయే నదిచేత, రెండు వేల ఏళ్ళనాటి బుద్ధ ఘోషమీద వాలిన నిశ్శబ్దం చేతా, దానికి నాదానువాదా లవతగ్గ సంగీత స్వరాలచేతా, నాగార్జున క్షేత్రకథను తెర మీద చెప్పించారు.

అందుకోసం బయలుదేరిన కామెరా,ఉపదేశం కోసం మహాప్రతక్త దగ్గరకు వెళ్ళే వ్యక్తిమాపే, భక్తిప్రపత్తులతో, ఆకొండనీ, నదినీ, జరిగిపోయిన అబ్దాలను, కరిగిపోయిన శబ్దాలనుసమీపిస్తుంది. వాల్మీకిమహర్షి ఉపమానాలకు మల్లె నిరుపమానాలైన ఈ తథాగత కథా శిల్పాలలో చిరంజీవంగా నిలచిన కరుణతో 'ఛాయాగ్రహణయంత్రం' ప్రేక్షక హృదయాలను రసార్ద్రం చేసివేస్తుంది. ఇవాళ, బుద్ధుడి మంచిమాటలను చాటి చెప్పడానికి నాగార్జునాచార్యుడు లేకపోయినా, ఎవరూ లేకపోయినా, ఆ శిల్పాలే ఆయన సందేశాన్ని అందచేస్తూ ఉన్నాయి. దుఃఖ నివారణకై గౌతముడు అనే అతడు పడినబాధను రసవత్తర గాథలుగా గానం చేస్తున్నాయి. ప్రజలను ఆకర్షించి బౌద్ధమతం స్వీకరింప చేయడమే, ఇలా బుద్ధుడి కథలను, శాశ్వతంగా ఉండే శిలా ఫలకాలమీద గుహాకుడ్యాలమీద మలచడంలో ఆచార్యులు ఉద్దేశించిన ప్రయోజనం అంటారు. మతం పుచ్చుకోకపోయినా, చూచినవారిలో సమ్యగాలోచనను కలిగించి, వారిని పరిశుద్ధుల్ని చేస్తాయి ఈ నాగార్జునకొండ శిల్పాలు.

ఈ దేశంలోని ఏ యితర బౌద్ధ శిల్పాలకూ ఎందునా తీసిపోని ఈ శిల్పాలను, (కొన్ని శిథిలాలనూ) ఇంత మనోహర చిత్రంగా తీసిన ఫిలింస్ డివిజన్‌వారు అభినందనీయులు.

మూడవ శతాబ్దంలో ఇక్ష్వాకురాజులు కట్టించిన విజయపురి దాదాపు అంతా, ఇటీవలి త్రవ్వకాలలో బయట పడింది. అక్కడి భవంతులు, క్రీడారంగాలూ, జలక్రీడారంగాలూ, మొదలయినవన్నీ కూడా ఇందులో చూపించారు.

ఇక్ష్వాకులు, బౌద్ధమతాన్ని ఆదరించినా, స్వీకరించలేదు. వారు యజ్ఞాలూ యాగాలూ చేశారు. ఒకరాజు అశ్వమేధయాగం చేసిన తోటూ, అక్కడి హోమకుండం కూడా చూపించారు.

ఈ చూపడంలో, రూపు ధరించిన జ్వాల కాలం అనిపించే రీతిన, లీలగా దృగ్గోచరం అయే హోమాన్ని, అందులో, దీక్షా కంకణం ధరించి, ఆజ్యం పోస్తున్న దృశ్యాదృశ్య హస్తాన్ని లీలగా చూపించారు.

అలాగే నాగార్జున క్షేత్రం ఉజ్వలంగా విలసిల్లిననాటి బౌద్ధారామాలూ, స్నానఘట్టాలూ, ప్రార్థన మందిరాలూ చూపినప్పుడు కూడా చక్కని శిల్పాన్ని అవలంబించారు. కాని, బాగుందన్న ఊహతో, అదే పనిగా పావుకోళ్ళ కాళ్ళలోనే కథనడపబోవడం బాగులేదు.

మొత్తానికి ఆలోచనామృతమైన సంగీతాన్ని, శ్రుతి మధురమైన వ్యాఖ్యానాన్ని మనోహర శిల్పాలకు జోడించి, సృజనాత్మకమైన ప్రతిభతో ఛాయాగ్రహణ శిల్పాన్ని మలచుకుంటూ రూపొందించిన ఈ చిత్రం అందరు తప్పక చూడతగ్గది. ★

న్యూఢిల్లీ లేఖ

(7-వ పేజీ తరువాయి)

శాఖ చూస్తూ ఉండేది. ఇరవై ఏళ్ళతరవాత, విభక్త భారత దేశంలో వ్యవసాయమనీ, ఆహారమనీ, విద్య అనీ, ఆరోగ్యం అనీ, శాస్త్రపరిశోధన - సంస్కృతి అనీ, కామన్వెల్తు సంబంధాలనీ ఆరు వేర్వేరు శాఖలు ఏర్పాటుచేశారు. ఉద్యోగాల్ని లెక్కలోకి తీసుకుంటేవిద్యాశాఖ, శాస్త్రపరిశోధనశాఖ నాలుగోస్థానం ఆక్రమిస్తాయి. మొదటిస్థానం రక్షణశాఖది, రెండు ఆర్థిక శాఖది, మూడు వాణిజ్య పరిశ్రమల శాఖది, తరవాత స్థానం విద్యది, శాస్త్ర పరిశోధనది. ఇలాగ సిబ్బంది హెచ్చించటం ఇంతటితో ఆగేసూచనలుకూడా లేవు. అధికారుల ప్రాబల్యాన్ని ప్రపంచంలో ఏదేశమూ నివారించుకోలేకపోయింది. అందులో సోషలిజం ఎక్కువైన కొద్దీ అధికార ప్రాబల్యంకూడా ఎక్కువౌతుంది. అధికార ప్రాబల్యమూ, ఉద్యోగాల కోసం వెంపర్లాటమూ మొగుడూ పెళ్ళాల

న్యూఢిల్లీ లేఖ

కంటెవి. వీటిసంతానమే ఉద్యోగాలు. 1951 డిసెంబరులో, రైల్వేలను మినహాయించితే, మిగతా కేంద్రప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగుల సంఖ్య 1,42,850. 1957 సెప్టెంబరు నాటికి వీరి సంఖ్య 2,82,449 అయింది. 1957 లో మొదటి 9 నెలల్లోనూ ఉద్యోగుల సంఖ్య నెలకు సగటున 1700 చొప్పున పెరుగుతూ వచ్చింది.

రూపాయి నాణాల్ని గుండ్రంగా ఎందుకు చేస్తారు? ఒకరినుంచి ఒకరికి త్వరగా చెలామణీ అయ్యేందుకే. ★

(40-వ పేజీ తరువాయి)

గైనా యిక్కడకిపంపించు...తెలిసిందా... నాన్నగారూ నేనూ కలిసి విడికింతగడ్డెట్టి పంపిస్తాం ... తెలిసిందా! నువ్వేం భయపడకు...వెళ్లు...!" నిర్విచారంగా వెళ్ళింది వెంకి...దీర్ఘంగా విశ్వసించి కుర్చీలో కూలబడింది జమున...

5

"రామారావుగారు లేరండీ ? ... " ఒక పురుషకంఠం పిల్చింది బయటనుంచి.

"ఆ! లోపల ఉన్నారండీ! లోపలికి రండి!" జవాబు చెప్పింది జమున వచ్చినవారు ఎవరా అని పరిశీలిస్తూ. ఇరవై అయిదు ఏళ్ళ స్ఫురద్రూపి. సిల్కు బుష్‌కోటు తొడుక్కున్నాడు ... ఒక్కక్షణం రెప్ప వాల్చకుండా చూసింది జమున...ఎవరీయన? ఏమీ పాలుపోవడం లేదు...యువకుడుకూడ ఒక్కక్షణం రెప్పవాల్చకుండాచూసి...

"రామారావుగారూ...!" పసిగేశాడు.

"మా నాన్నగారు..." సమాధానం.

ఇంతలో 'ఎవరూ' అంటూ రామారావుగారు రానేవచ్చారు జటాయువులా!

యువకుడు లేచి నిలబడి "నమస్కారమండీ"

"ఎవరునాయనా ! మీరు?" వృద్ధప్రశ్న.

"నేనండీ ! మురళీధరాన్ని...రామనాథంగారబ్బాయినండీ !..."

"ఓరి నువ్వట్రా—! ఎంతవాడవయ్యావ్ ...ఏమిటి! అమ్మా నాన్నా బాగా ఉన్నారా! ఏమిటి కథ?" ప్రశ్న పరంపర వస్తోంది.

"ఆ...! అంతా బాగున్నారండీ! ఏదో యిలా యీ ఊరొస్తే మిమ్మల్ని చూసిపోదామని..."

"బాగుంది నాయనా బాగుంది..." అంటూ కూతురికేసి తిరిగి "ఇతను మురళీధరం అని పదినిమిదేళ్ళ క్రితం యీ వూళ్ళో ఉండేవాడు...వీళ్ళ నాన్నగారు యిక్కడ ఉద్యోగం చేసేవారు! ఆ! గోటికాయలాడుతూ ఉండేవాడు ఎంతవాడయ్యాడో చూశావా !" అని మురళీధరంకేసి తిరుగుతూ "ఏమి చేస్తున్నావురా నీవిప్పుడు? ఆ మధ్య నేదో ఇంజనీరింగు చదువుతున్నావన్నారు?"

"మరేనండి...చదువయింది...ఇప్పుడు

> "పెండ్లి అయిన తర్వాత పెండ్లికొడుకు వచ్చిన బహుమతులు అన్నీ వెతకసాగాడు.
>
> "ఏమిటి వెతుకుతున్నారు?" ప్రశ్నించింది భార్య.
>
> "మీ నాన్నగారు ఇచ్చిన వెయ్యిరూపాయల చెక్కు ఏమయ్యింది."
>
> నాన్నగారికి పూర్తిగా మతిపోతోంది. ఇంతక్రితమే ఆయన దానితోనే చుట్ట వెలిగించుకున్నారు."
>
> —కే. సుభాస్ చంద్రబోస్

అసిస్టెంటు ఇంజనీరుగా పనిచేస్తున్నాను... రావుడని మా నౌకరు...వాడిదీ వూరే? మీకు తెలుసనుకుంటాను..."

జమున విభ్రాంతురాలైంది. ఒళ్లు గిర్రున తిరుగుతున్నట్టనిపిస్తోంది...ఈ అవస్థంతా చూస్తూ మురళీధరం ఆమెవైపొక కొంటె నవ్వు విసిరాడు. జమున ఒక్కమాటు చురుక్కునచూసి, గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది లోపలికి.

"దణ్ణాలండి బాబయ్యగారూ !"

"ఎవరూ! రావుడా! ఏరా ఎప్పుడొచ్చావ్ !"

"నిన్నేనండీ...ఇదిగో పెళ్లికొడుగ్గారు యిక్కడే ఉన్నారే!"

"ఆ! పెళ్ళికొడుకా...ఎవరూ?" ఆశ్చర్యంగా అడిగారు రామారావుగారు.

"మీ అల్లుడుగారండీ...మీరొప్పుకుంటే..."

"ఆ! నా అల్లుడా...!" కళ్లు పరవశమయిపోతోంది రామారావుగారికి. "నా అల్లుడా...ఎంత చల్లనిమాట చెప్పి నా హృదయాందోళన నివారించావ్...ఇదిగో నా హృదయపూర్వకంగా నీకు మా అమ్మాయిని కన్యాదానం చేసాను...ఇంతకంటె ఆనందం యింకే వుంటుంది!" అన్నారు రామారావుగారు తృప్తిగా !

* * *

"అయితే యిదంతా మీరు ముందు వేసుకొన్న ప్లానే నన్నమాట!" అడిగింది ఆశ్చర్యంగా జమున ఆనాటి పాలవెన్నెలలో పైడాబామీద కబుర్లు చెపుతూ భర్తతో.

"మరేమిటనుకున్నావ్"

"అబ్బా బలే జిత్తులమారులే మీరూ!" నవ్వుతూ అతని హృదయంమీద వాలిపోయింది జమున. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad



అవ్వ

ఫొటో : పి. వి. నారాయణ్.